ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 21 పేజీలు: 10+4 వెల: 6.50



భారత్‌కు వీసా సేవలు పునరుద్ధరించిన బంగ్లా
'సర్' విధులకు న్యాయాధికారులు 5లో





# ట్రంప్‌కు షాక్!

## ప్రతీకార సుంకాలను కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టు

### భారత్‌పై విధించిన 18% కూడా అనధికారికమే

### నా దగ్గర ప్లాన్-బి ఉంది: ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి సుంకాల విషయంలో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ ప్రతీకార సుంకాలను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టివేసింది. టారీఫ్‌లను విధించే అధికారం అధ్యక్షుడికి లేదని కోర్టు తేల్చిచెప్పింది. ఆర్థిక విధానానికి కేంద్రబిందువుగా, ప్రధాన విదేశాంగ విధాన సాధనంగా సుంకాలను వాడుకోవడాన్ని వ్యతిరేకించింది అధ్యక్షుడి నిర్ణయం

>>2

# కేంద్రంలో ఏఐకి ప్రత్యేక శాఖ!

ఏర్పాటు చేయాలని సూచించిన రేవంత్
మానవ పరిణామక్రమంలో ఇది కీలకమలుపు
తెలంగాణలో ఎఐ స్టార్టప్ విలేజ్‌కి సిద్ధం
ఇండియా కృత్రిమ మేధకు పవర్‌హౌస్ కావాలి
ఢిల్లీ ఎఐ సమ్మిట్‌లో సిఎం రేవంత్


శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి20:** ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం, మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తుచేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ విని యోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్లు భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణా మాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం-రాష్ట్రాల సమన్వయంతో జాతీయ 'ఏఐ వార్ రూమ్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్రం అను మతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహిం

>>2



# 1న రాహుల్ రాక

## రెండు రోజుల్లో రాజ్యసభ సభ్యుల ఎంపికపై నిర్ణయం: పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి20:** మంత్రులపై అవినీతి ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోండి అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అవినీతిపై బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. బండిసంజయ్ పై మహేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 1న తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాబోతున్నారని, రాజ్యసభ సభ్యుల ఎంపికపై రెండు రోజుల్లో నిర్ణయం తీసు

>>2



# బిడ్డకు తల్లే సర్వస్వం..

## తండ్రి పేరు అక్కర్లేదు: బాంబే హైకోర్టు చరిత్రాత్మక తీర్పు

**ముంబై, ఫిబ్రవరి 20:** సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య విధానాలకు చరమగీతం పాడుతూ బాంబే హైకోర్టుకు చెందిన ఔరంగాబాద్ బెంచ్ ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. బిడ్డ గుర్తింపునకు తండ్రి పేరు తప్పనిసరి కాదని, తల్లి పేరు, కులంతోనే అన్ని హక్కులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అత్యాచారం వల్ల జన్మించిన 12 ఏళ్ల బాలిక స్కూల్ రికార్డుల నుంచి ఆమె తండ్రి పేరును పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన ఒక మహిళ తన 12 ఏళ్ల కుమార్తె తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై జరిగిన అత్యాచారం వల్లే పాప జన్మించిందని,

>>2




# 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్

## సెమీకండక్టర్ తయారీలో ఇండియాకు మహర్దశ

### కృత్రిమమేధ, కీలక ఖనిజవనరుల అందుబాటుకు కూటమిలో చేరిక

### ఐటిశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ సమక్షంలో ఒప్పందాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ తయారీ రంగంలో అద్భుత పురోగతి సాధించే దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. ఈ రంగాల్లో అగ్రగామి దేశాలు సభ్యులుగా ఉన్న "పాక్స్ సిలికా" కూటమిలో ఇండియా చేరింది. ఏఐ, కీలక ఖనిజాల కోసం అమెరికాతో చారిత్రక ఒప్పందం ఖరారు చేసుకుంది. దీనితో ఏఐ, కీలక ఖనిజాలు, సరఫరా చెయిన్, భద్రత, ఆర్థిక రంగాల్లో కూటమిలోని సభ్యదేశాల నుంచి భారత్ అమిత సహకారం పొందే వీలుకలిగింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వేదికగా ఈ ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. ఈ కార్య క్రమానికి కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, భారత్‌లోని యూఎస్ రాయబారి

>>2

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

# పోలీసుల ఛార్జిషీట్ మళ్లీ వెనక్కి

### హార్డ్‌డిస్క్‌లు, సిడిలు, పెన్‌డ్రైవ్‌లతో పూర్తి సమాచారం అందించాలన్న నాంపల్లి కోర్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు దా ఖలు చేసిన ఛార్జిషీట్‌ను నాంపల్లి కోర్టు మరోసారి వెనక్కు పంపింది. ఇప్పటికే రెండుసార్లు ఛార్జిషీట్‌ను వెనక్కు పంపగా పోలీసులు దానిని సవరిం చి మళ్లీ పంపగా తాజాగా పంపిన దాంట్లోనూ లోపాలు వున్నట్లు గుర్తించిన కోర్టు మరోసారి లోపాలను గుర్తించి దీనిని సవరించి, అన్ని సాక్ష్యాలతో తిరిగి తీసుకురావాలని పోలీసులను ఆదేశించింది. 2024 డిసెంబరు నెలలో పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ప్రీమియర్ షో కోసం రాత్రి పది గంటల వేళ హీరో అల్లు అర్జున్ రాగా ఒక్కసారిగా అభిమానులు పోటెత్తారు. ఈ సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోగా ఆమె కుమారుడు శ్రీతేజ్ ఇప్పటికీ చావు బతుకుల మధ్య పోరాడుతుండడం తెలిసిందే. ప్రీమియర్ షోకు అల్లు అర్జున్‌ను రావద్దని పోలీసులు కోరి నా ఆయన రావడంతో ఈ తొక్కిసలాట జరిగిందని చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి అల్లు అర్జున్ సహా స ంధ్య థియేటర్‌కు చెందిన నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేయడం విదితమే. అప్పట్లో అల్లు అర్జున్ అరెస్టుపై టాలీవుడ్ అభ్యంతరం తెలపగా పోలీసులు లెక్క చేయలేదు. చివరకు ఒక రోజు తరువాత అల్లు అర్జున్‌కు బెయిల్ వచ్చింది. ఈ కేసులో అల్లు అర్జున్ సహా 23 మందిపై పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో లోపాలను గుర్తించిన కోర్టు వెనక్కు పంపగా తాజాగా నాటి ఘటనకు సంబంధించి హార్డ్ డిస్క్‌లు, సిడిలు, పెన్ డ్రైవ్‌లతో పూర్తి సమాచారం అందించాలని కోర్టు పోలీసులను కోరింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు తొక్కిసలాట ఘటనపై పూర్తి సమాచారంతో ఛార్జిషీట్‌ను మరోసాకి పంపినట్లు తెలిసింది.


మేడారం జాతరకు అంతర్జాతీయ వారసత్వ గుర్తింపునకు కృషి 6లో
డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్‌మోడల్‌గా తెలంగాణ 7లో






శుక్రవారం హోటల్‌లో పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# హోటల్‌లో భారీ పేలుడు

## నలుగురికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ (మన్సూరాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా కోర్టు భవనాల పక్కన ఉన్న చట్నీస్ హోటల్‌లో ఇడ్లి స్టిమర్ పేలడంతో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎల్బీనగర్

>>2

# సమ్మిట్ వద్ద నిరసనలా?



## కాంగ్రెస్ చర్య అప్రజాస్వామికం

### ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

### అది దేశగౌరవానికి భంగం కలిగించడమే: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** దేశం గ్లోబల్ టెక్నాలజీ శక్తిగా ఎదుగుతున్న సమయంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఏఐ సమ్మిట్ కాంగ్రెస్ కార్యకర్తలు భంగం కలిగించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడారు. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికగా నిలిచిన ఈ సమ్మిట్లో వినూత్న ఆవిష్కరణలు, గిన్నిస్ వరల్డ్ రికార్డులు వంటి అంశాలు దేశ ప్రతిష్ఠను పెంచాయని, ఇదే సమయంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన పేరుతో అల్లర్లు సృష్టించారన్నారు. కొందరు కార్యకర్తలు సమ్మిట్ వద్ద అర్ధ నగ్నంగా నిరసన తెలపడం అంతర్జాతీయ వేదికపై దేశ గౌరవానికిభంగం కలిగించిందన్నారు. ప్రజాస్వామ్యంలో విభేదాలు సహజం, నిరసనలు అవసరం అన్నారు. కానీ ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్న కార్యక్రమంలో దేశ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరించడం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధం అన్నారు. రాజకీయ లాభాల కోసం దేశాన్ని ప్రపంచ వేదికపై చిన్నబుచ్చే చర్యలు

>>2





## ఎఐ సదస్సులో యూత్‌కాంగ్రెస్ నేతల నిరసన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కలకలం సృష్టించారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 జరుగుతున్న సమయంలో, కొందరు కార్యకర్తలు హఠాత్తుగా చొక్కాలు విప్పి ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సదస్సులో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కార్యకర్తలు నిరసనకు దిగారు. పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్ అంటూ పెద్దగా నినాదాలు చేస్తూ, సమ్మిట్ బోర్డు ముందు నిలబడి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి, ఆందోళనకారులను బలవంతంగా బయటకు పంపించి, అదుపులోకి తీసుకున్నారు. వారిని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ ఉన్నతస్థాయి సదస్సులో భద్రతను దాటుకుని కార్యకర్తలు ఎలా లోపలికి వచ్చారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నిరసనకు సంబంధించిన వీడియోలను యూత్ కాంగ్రెస్ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కంటే కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యత ఇస్తోందని యూత్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో ఆరోపించింది. ఈ ఘటన తర్వాత భారత్ మండపం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాగా, ఈ సదస్సును రాహుల్ గాంధీ గతంలోనే ఒక ప్రచార కార్యక్రమంగా విమర్శించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి నిరసనలు సరికాదని అధికార పార్టీ నేతలు విమర్శించగా, ఇది తమ నిరసన తెలిపే హక్కు అని విపక్ష నేతలు పేర్కొన్నారు.

## ఢిల్లీలో అమెరికా రాయబారి విందులో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి20:**ఢిల్లీలోని చీఫ్ ఆఫ్ మిషన్ నివాసంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఏర్పాటు చేసిన విందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ విందుకు ఫెడ్‌ఎక్స్ సీఈవో రాజ్ సుబ్రమణియన్, ఓపెన్‌ఎఐ సీఈవో స్యామ్ ఆల్టమన్, క్రోటియా దేశ ప్రధాని ఆంద్రేజ్ ప్లెంకోవిక్,భూటాన్ ప్రధాని షేరింగ్ టోబ్‌గయ్, కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్,భర్తీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ ఛైర్మన్ సునీల్ భర్తీ తదితర ప్రపంచ స్థాయి పెద్దలు,పరిశ్రమల అధిపతులు,మల్టీనేషనల్ కార్పొరేషన్ సీఈవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పారిశ్రామికవేత్తలతో, ప్రముఖలతో సమావేశమై తెలంగాణ అభ్యుదయ పారిశ్రామిక పాలసీపై వివరించారు. తెలంగాణలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయలు, ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ఎకోసిస్టమ్‌పై వివరించారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,లాజిస్టిక్ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ఈమేరకు హైదరాబాద్‌కు రావాలని ప్రముఖలను సిఎం సాదరంగా ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల పెట్టుందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి మద్దతు ఇస్తామని, స్పీడీ క్లీయరెన్స్‌తో పాటు, పారదర్శకమైన విధానాలను అందజేస్తామన్నారు.



కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి శుక్రవారం న్యూఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయిన దృశ్యం

# 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్

>> సెర్గియో గోర్, అమెరికా ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి జాకబ్ హెల్బర్గ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటి మంత్రి అశ్వినివైష్ణవ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ కృషితో యావత్ ప్రపంచం భారత్‌పై పూర్తి విశ్వాసం కనబరుస్తోందని అన్నారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌లో సెమీకండక్టర్ తయారీకి అనువైన వాతావరణం అభివృద్ధి చెందుతుందని పాక్స్ సిలికాన్ కీలక ఖనిజాలు, ఏఐ కోసం సురక్షితమైన, వినూత్నమైన, నమ్మకమైన ప్రపంచ స్థాయి సరఫరా వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో పాక్స్ సిలికా కూటమిని ప్రారంభించారని మంత్రి పేరొన్నారు. గతేడాది డిసెంబర్ 12న వాషింగ్టన్‌లో జరిగిన పాక్స్ సిలికా సమ్మిట్‌లో భాగస్వామ్య దేశాలు ఈ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. ఇందులో ఆస్ట్రేలియా, గ్రీస్, ఇజ్రాయెల్, జపాన్, ఖతార్, దక్షిణ కొరియా, సింగపూర్, యూఏఈ, యూకే సభ్య దేశాలుగా ఉన్నాయని ముడి సరుకుల నుంచి సెమీకండక్టర్లు, ఏఐ మౌలిక సదుపాయాల వరకు అన్ని దశల్లో ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకోవడం ద్వారా స్థిరమైన ఆర్థిక వ్యవస్థను నెలకొల్పడం ఈ కూటమి ప్రధాన లక్ష్యంగా చెప్పారు. సెమీకండక్టర్ తయారీకి సిలికాన్, గాలియం, జెర్మేనియం వంటి కీలక ఖనిజాల నిరంతర సరఫరా అవసరం కాగా, సహజ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం పుష్కలంగా ఉన్న దేశాలతో కూడిన ఈ కూటమిలో చేరడం వల్ల భారతదేశానికి స్థిరమైన, నమ్మకమైన సరఫరా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రపంచ భౌగోళిక ఉద్రిక్తతల వల్ల వచ్చే కుదుపులు లేదా చైనా వంటి ఒకే దేశంపై ఆధారపడటం వల్ల ఎదురయ్యే ముప్పుల నుంచి మన తయారీ రంగానికి రక్షణ లభిస్తుంది. అమెరికా నేతృత్వంలోని ఈ కూటమిలో చేరడం ద్వారా భారత్ ప్రపంచ టెక్ సప్లై చైన్‌లో నమ్మకమైన, స్థిరమైన, సురక్షితమైన కేంద్రంగా మారుతుందన్నారు. ఇది సెమీకండక్టర్ తయారీ రంగంలో ఫ్యాబ్స్, అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ కేంద్రాల స్థాపనకు భారత్ అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతుందని అశ్వినివైష్ణవ్ అన్నారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ మాట్లాడుతూ పాక్స్ సిలికా అనేది సామర్థ్యాల కలయికగా అభివర్ణించారు. స్వేచ్ఛాయుత ప్రజలు ఏకమైతే భవిష్యత్తు వారిదే అవుతుందని చెప్పడానికి పాక్స్ సిలికా ఒక నిదర్శనమని అమెరికా మంత్రి జాకబ్ హెల్బర్గ్ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడం సహా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్న వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వాణిజ్య ఒప్పందం నుంచి ప్యాక్స్ సిలికా వరకు, అలాగే రక్షణ సహకారం వరకు మన రెండు దేశాలు కలిసి పనిచేయడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. ప్యాక్స్ సిలికాలో భారత్ చేరడం ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల గమనాన్ని మరింత వేగవంతం చేసే వ్యూహాత్మక ముందడుగు. భారత్ అపారమైన ప్రతిభ కలిగిన దేశం. సవాళ్లను ఎదుర్కొనే సామర్థం భారత్‌కు ఉంది. ఈ కూటమికి భారత్ ఇంజనీరింగ్ నైపుణ్యం ఎంతో కీలకం. ప్రతిభతో పాటు, క్లిష్టమైన ఖనిజాల ప్రాసెసింగ్ సామర్థంలోనూ భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. దీనిపై మేము పూర్తిస్థాయిలో కలిసి పనిచేస్తున్నాం. ప్యాక్స్ సిలికా ఫ్రేమ్‌వర్క్ కింద నమ్మకమైన ఏఐ సాంకేతికతలను అమెరికా, భారత్‌తో పంచుకుంటుందని సెర్గియోగోర్ అన్నారు. మా మిత్రదేశాలు ఆర్థిక ఒత్తిళ్లు, బెదిరింపులను ఎదుర్కోవడం మేము గమనిస్తున్నాం. వారు తమ సార్వభౌమాధికారం లేదా శ్రేయస్సులో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రపంచ సరఫరా గొలుసు కేవలం కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందుకే నేడు ప్యాక్స్ సిలికా డిక్లరేషన్‌పై సంతకం చేస్తూ, బ్లాక్ మెయిలింగ్‌కు నో చెబుతున్నాం. ఆర్థిక భద్రతే జాతీయ భద్రత అని మేము చాటిచెబుతున్నామని అమెరికా ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి జాకబ్ హెల్బర్గ్ అన్నారు.

# కేంద్రంలో ఎఐకి ప్రత్యేక శాఖ

>> చేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని అన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ఏఐ అభివృద్ధి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని ఆయన స్పష్టం చేశారు.

# ట్రంప్‌కు షాక్!

>> వినియోగదారులు, వ్యాపారాలకు ఖర్చులను పెంచిందని వ్యాఖ్యానించింది. ట్రంప్ వివాదాస్పద నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన మొదటి తీర్పు ఇదే. గతేడాది ఏప్రిల్ 1న లిబరేషన్ డే పేరుతో ట్రంప్ పరస్పర సుంకాలను ప్రకటించి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ధర్మాసనంలో మొత్తం 9 మంది న్యాయమూర్తుల్లో ఆరుగురు ట్రంప్ సుంకాలను వ్యతిరేకించగా ముగ్గురు మాత్రమే సమర్థించారు. ఈ తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ రాశారు. ఆయనతో పాటు ముగ్గురు లిబరల్ న్యాయమూర్తులు, సంప్రదాయవాదులైన నీల్ గోర్సుచ్,అమీ కోనీ బారెట్ కూడా ట్రంప్ సుంకాలను వ్యతిరేకించారు. ఏకపక్షంగా సుంకాలను విధించే అసాధారణ అధికారాన్ని అధ్యక్షుడు నొక్కి చెబుతున్నారు అని జస్టిస్ రాబర్ట్స్ పేర్కొన్నారు. ట్రంప్ యంత్రాంగం ఏ చట్టాన్ని సూచించలేదని, కాంగ్రెస్ గతంలో ఐఈఈపిఎ చట్టం సుంకాలకు వర్తింపజేయవచ్చని చెప్పిందని ఆయన అన్నారు. ఇంత వరకూ వివిధ దేశాల నుంచి వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించాలని తేల్చిచెప్పింది. భారత్‌పై కూడా ట్రంప్ 18 శాతం సుంకాలను విధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ ప్రధాన విధానపరమైన చర్యలు తీసుకోవడానికి అనుమతించిందని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. రాబోయే దశాబ్దంలో ఫెడరల్ బడ్జెట్‌ను రెండు ట్రిలియన్ డాలర్లకు పెంచేందుకు, తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకే సుంకాలను విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. సుంకాల పెంపు ఉత్తర్వులను రద్దుచేస్తే జాతీయ భద్రత, విదేశాంగ విధానం.. ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుందని కోర్టును ట్రంప్ హెచ్చరించారు. కానీ దిగుమతి సుంకాలను విధించడానికి తమకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని ట్రంప్ యంత్రాంగం అంటోంది. దీని ద్వారా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. పరస్పర సుంకాల విధింపునకు 1977 అత్యవసర అధికారాల చట్టాన్ని ఉపయోగించలేరనే కోర్టు తీర్పు స్పష్టం చేసినా రిటైలర్లు, ఇతర వ్యాపారాలలో నిర్వహణ ఖర్చుల గురించి అనిశ్చితి కొనసాగే అవకాశం ఉంది. న్యాయమూర్తులు క్లారెన్స్ థామస్, బ్రెట్ కవనాగ్, శామ్యూల్ అలిటో మాత్రం మిగతా ఆరుగురితో విభేదించారు. ఈ తీర్పు ట్రంప్ విధించిన అన్ని సుంకాలను ప్రభావితం చేయదు. ఉదాహరణకు, వేర్వేరు చట్టాలను ఉపయోగించి ఉక్కు, అల్యూమినియంపై ఆయన విధించిన టారిఫ్‌లు అమలులో ఉంటాయి. ట్రంప్ రెండు విధాలుగా సుంకాలను విధించారు. దేశాల వారీగా లేదా పరస్పర సుంకాలు ఇవి చైనాకు 34 , మిగిలిన దేశాలకు కనీసం 10 గా ఉంది. మరొకటి ఫెంటానిల్ ప్రవాహాన్ని అరికట్టడంలో విఫలమైనందుకు కెనడా, చైనా, మెక్సికో వస్తువులపై ట్రంప్ విధించిన 25 సుంకాలు. ఇతర దేశాల నుంచి వస్తువులను దిగుమతి చేసుకున్నప్పుడు కంపెనీలు సుంకాలను చెల్లించాయి. ఈ తీర్పుతో వేలాది కంపెనీలు వాటిని తిరిగి పొందడానికి వ్యాజ్యాలు దాఖలు చేయనున్నాయి. ట్రంప్ యంత్రాంగం ఇప్పటివరకూ 133 బిలియన్ డాలర్లు అంటేసుమారు రూ.11 లక్షలకోట్లు సుంకాలరూపంలో వసూలుచేసారు.

**నాదగ్గర ప్లాన్ బి ఉంది...ఇది ఎంతో అవమానకరం...ట్రంప్..!**

సుంకాల ఉత్తర్వులను రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన తన వద్ద ప్లాన్ బి ఉందని వ్యాఖ్యానించారు. గవర్నర్లతో జరిగిన ప్రైవేట్ సమావేశంలో సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం అవమానకరం అని అభివర్ణించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సుంకాలపై సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన సమయంలో ట్రంప్ రెండు పార్టీలకు చెందిన దాదాపు 24 రాష్ట్రాల గవర్నర్లతో ప్రైవేట్‌గా సమావేశమయ్యారు. తీర్పుపై తక్షణమే వైట్‌హౌస్ స్పందించలేదు. టారిఫ్ విధానం కింద ఇప్పటికే వసూలు చేసిన బిలియన్ల డాలర్లను కంపెనీలు వాపసు పొందేందుకు అర్హత కలిగి ఉంటాయా లేదా అనే విషయాన్ని కూడా కోర్టు స్పష్టం చేయలేదు. రిటైల్ దిగ్గజం కాస్ట్‌కోతో సహా అనేక సంస్థలు తిరిగి చెల్లింపు కోరుతూ దిగువ కోర్టులను ఆశ్రయించాయి. కాంగ్రెస్ అనుమతి లేకుండానే విధానపరమైన చర్యలు తీసుకోవడానికి అధ్యక్షుడికి అధికారం లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్, జస్టిస్ నీల్ గోర్సుచ్, జస్టిస్ అమీ కోనీ బారెట్ మరో ముగ్గురు ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఏకపక్షంగా టారిఫ్‌లను విధించే అసాధారణ అధికారాన్ని ట్రంప్ వినియోగించారని చీఫ్ జస్టిస్ రాబర్ట్స్ వ్యాఖ్యానించారు.



## టెక్ దిగ్గజాలను అబ్బురపరిచిన 'ఎఐ వండర్‌కిడ్'

### ఎఐ రంగంలో పిన్నవయసులోనే అద్భుతప్రతిభ సాధించిన రావుల్‌జాన్ ఆజు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశ రాజధానిలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఓ బాల మేధావి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఏఐ కిడ్ ఆఫ్ ఇండియా గా పేరుగాంచిన 16 ఏళ్ల రావుల్ జాన్ అజు, ఈ అంతర్జాతీయ వేదికపై టెక్ నిపుణులు, దేశాధినేతల నుంచి ప్రశంసలు అందుకుంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అతను సాధించిన అద్భుతమైన ప్రగతికి ఈ సదస్సులో అరుదైన గౌరవం దక్కింది. తనకు ఈ సదస్సులో ప్రసంగించే అవకాశం రావడం పట్ల రావుల్ సంతోషం వ్యక్తం చేశాడు. ఏఐ వల్ల కలిగే లాభనష్టాలను, ప్రపంచ సమస్యల పరిష్కారంలో భారత్ ఎందుకు నాయకత్వం వహించాలో తాను వివరించనున్నట్లు తెలిపాడు. ఈ సదస్సులో భాగంగా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌ను కలిసే అవకాశం కూడా రాహుల్‌కు దక్కింది. ఆ క్షణంలో నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. కేవలం హాయ్ మాత్రమే చెప్పగలిగాను. ఆయనతో కొన్ని నిమిషాల సంభాషణలో చాలా నేర్చుకున్నాను. అదొక అద్భుతమైన అనుభవంఅని రావుల్ ఆనందంగా పంచుకున్నాడు. గతవారమే తాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశానని, ఆయన దార్శనికత, మార్గనిర్దేశం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని రాహుల్ తెలిపాడు. టెక్నాలజీ, డీప్ టెక్ రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని కృషి అమోఘమని కొనియాడాడు. కొంతకాలం క్రితం రావుల్ రూపొందించిన ఏఐ టూల్స్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో అతను వెలుగులోకి వచ్చాడు. భవిష్యత్ ప్రణాళికల గురించి అడగ్గా, తన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవడానికి విదేశాలకు వెళ్లే ఆలోచన ఉన్నప్పటికీ, అంతిమంగా మాతృభూమే తనకు తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశాడు. కొంతకాలం క్రితం రావుల్‌ను వందే భారత్ రైలులో కలిసిన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, అతని ప్రతిభపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇలాంటి యువ మేధస్సులే 21వ శతాబ్దంలో భారతదేశ వృద్ధి కథను నిర్దేశిస్తాయని కాంగ్రెస్ నేత శశిథరూర్ అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ, చిన్న వయసులోనే ఆవిష్కర్తగా, పారిశ్రామికవేత్తగా, శిక్షకుడిగా బహుముఖ పాత్రలు పోషిస్తున్నాడు. రావుల్ ఏఐ రియల్మ్ టెక్నాలజీస్ అనే సంస్థను స్థాపించి, దానికి సీటీఓగా వ్యవహరిస్తున్నాడు. కేవలం 12 ఏళ్ల వయసులోనే మీబాట్ పేరుతో తన సొంత డిజిటల్ క్లోన్‌ను, హ్యూమనాయిడ్ రోబోట్‌ను అభివృద్ధి చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తన స్టార్టప్‌లో సొంత తండ్రినే ఉద్యోగిగా నియమించుకుని మీడియాలో సంచలనం సృష్టించాడు. ఇప్పటివరకు సుమారు లక్షన్నర మంది విద్యార్థులు, నిపుణులకు ఏఐపై శిక్షణ ఇచ్చి ఈ రంగంపై అవగాహన కల్పిస్తున్నాడు. ప్రభుత్వ సేవల కోసం పలు ఏఐ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తున్నాడు. భారత న్యాయ వ్యవస్థ కోసం న్యాయసతి అనే లీగల్ ఏఐ అసిస్టెంట్‌ను, యూఏఈ కోసం అత్యవసర సహాయం అందించే జస్ట్‌ఈజ్ అనే ఏఐ బాట్‌ను రూపొందించాడు. మలయాళం, హిందీ వంటి భారతీయ భాషల కోసం వాయిస్ ప్రాసెసింగ్ సిస్టమ్‌లను కూడా అభివృద్ధి చేశాడు.

## బిడ్డకు తల్లే సర్వస్వం..

>> ఆ తర్వాత నిందితుడు 2022లో జరిగిన ఒక సెటిల్మెంట్‌లో బిడ్డతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాసిచ్చాడని ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ, స్కూల్ రికార్డుల్లో తండ్రి పేరు, ఆయన కులం (మరాఠా) ఉండటం వల్ల తన కుమార్తె సామాజికంగా ఇబ్బందులు పడుతోందని తెలిపారు. తన కుమార్తెకు తన కులమైన 'మహర్' (ఎస్సీ)ని వర్తింపజేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒంటరి తల్లిని బిడ్డకు పూర్తిస్థాయి సంరక్షకురాలిగా గుర్తించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది దయతో చేసే పని కాదని స్పష్టం చేసింది. బాధ్యతలేని తండ్రి కులాన్ని బిడ్డ మోయాల్సిన అవసరం లేదని, తల్లి సామాజిక హోదానే బిడ్డకు వర్తిస్తుందని తేల్చిచెప్పింది. స్కూల్ నిబంధనల పేరుతో ఈ మార్పులు చేయలేమని విద్యాశాఖ అధికారులు చెప్పడాన్ని కోర్టు తోసిపుచ్చింది. గతంలో సుప్రీంకోర్టు కూడా పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రాల విషయంలో తండ్రి పేరు లేకుండా తల్లి అనుమతితోనే జారీ చేయవచ్చని తీర్పు ఇచ్చింది. ఇప్పుడు బాంబే హైకోర్టు కులం విషయంలోనూ స్పష్టతనివ్వడం దేశవ్యాప్తంగా ఉన్న ఒంటరి తల్లులకు గొప్ప ఊరటనిచ్చింది.

## 1న రాహుల్ రాక

>> కోబోతున్నామని మహేష్ గౌడ్ తెలియజేశారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని అడిగినా కిషన్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని ప్రశ్నించారు. ఐఎఎస్, ఐపిఎస్ లు స్వతంత్రంగా పని చేస్తారని బండి సంజయ్ చెప్పినట్లు కాదు అని.. విమర్శిచారు. మున్సిపల్ ఫలితాలు చూసైనా బండి సంజయ్ బుద్ధి తెచ్చుకోవాలని మహేష్ గౌడ్ చురక లంటించారు.

## వారం - వర్జ్యం

21-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
చవితి ప.12.59
రేవతి రా.7.05
వర్జ్యం : మ.2.05-3.36
దు.ఉ.6.31-8.06
శుభసమయం : సా.6.00-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:**ఆత్మీయుల సహకారంతో సమస్యలు కొంతవరకు తీరతాయి. గృహనిర్మాణ యత్నాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. స్వంత నిర్ణయాలను తీసుకుంటారు. విదేశీయాన ప్రయత్నాలు.

**కర్కాటకం:**విలువైన వస్తువులు తనఖాలు విడిపిస్తారు. ఉద్యోగస్థుల ఉన్నతాధికారుల మెప్పును సాధించగలుగుతారు.

**సింహం:**ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్థులకు ఈ రోజు అనుకూలంగా ఉంది. వస్త్రలాభం.

**కన్య :** ఆస్తి తగాదాలకు సంబంధించిన వ్యవహారాలలో మధ్యవర్తిత్వం చేయవలసిన బాధ్యత నెత్తిన పడుతుంది.

**తుల :** డాక్యుమెంట్స్ పరంగా జాగ్రత్తలు వహించండి. తల్లి వైపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** ఒక సందర్భంలో వృత్తి, ఉద్యోగ బాధ్యతల వల్ల ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానం నిలుపుకోలేరు. వాహనసౌఖ్యం.

**ధనుస్సు:** పెద్దగా కృషి చేయకపోయినా ఓ వ్యక్తికి మీ లాభాలలో భాగం ఇస్తారు. స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటారు.

**మకరం :** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరానికి డబ్బు ఏదో విధంగా అందుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**కుంభం:**ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. అనుకున్న పనులలో విజయం సాధిస్తారు.

**మీనం:** తనఖాలు విడిపిస్తారు. వినూత్న రీతిలో రాజకీయాలు చేసి కొన్ని అంశాలు అనుకూలంగా మార్చుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం పెండింగ్ నిధులు

### - తాజాగా రూ.387.53కోట్లు - ఇప్పటి వరకు రూ.1034.42కోట్లు - పెండింగ్‌లో మరో 2వేలకోట్లు - త్వరగా విడుదల చేయాలని కేంద్రానికి మంత్రి సీతక్క వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కొనసాగుతోంది. తాజాగా మూడో విడత నిధులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ విడతలో తెలంగాణ రాష్ట్రానికి రూ.387.53 కోట్లు జమయ్యాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తవడంతో పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లను కేంద్రం విడుదల చేస్తోంది. ఆర్థికసంఘం నిధుల విడుదలతో గ్రామీణ స్థానిక సంస్థలకు ఊరట లభిస్తోంది. ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి తెలంగాణకు మొత్తం రూ.1034.42 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు ప్రధానంగా గ్రామ పంచాయతీల సామర్థ్యాన్ని పెంచడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, తాగునీరు, పారిశుధ్యం వంటి సేవలను బలోపేతం చేయడానికి వినియోగించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల ఎన్నికలు ఆలస్యమవడంతో 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన కొన్ని గ్రాంట్లు నిలిచిపోయాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో ఇప్పుడు విడతల వారీగా నిధుల విడుదల జరుగుతోంది.

రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపిన ప్రకారం ఇంకా సుమారు రూ.2000 కోట్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని కేంద్రానికిరాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. గ్రామీణాభివృద్ధి పనులు నిలిచిపోకుండా చూడాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంచాయతీలకు తక్షణ సాయం అవసరమని రాష్ట్రం కోరింది. ఇప్పటివరకు విడుదలైన నిధులను గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల మరమ్మత్తులు, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి సదుపాయాల విస్తరణ, అలాగే పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వినియోగించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగితే అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకుంటాయని భావిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామీణ స్థానిక సంస్థలకు కీలక ఆర్థిక వనర అని, పంచాయతీల స్వయం పాలన బలోపేతం, పారదర్శక ఖర్చు, గ్రామీణ మౌలిక వసతుల పెంపు లక్ష్యంగా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మిగిలిన నిధులు కూడా త్వరలో విడుదలైతే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి పనులు మరింత వేగవంతమయ్యే అవకాశముంది.

## సమ్మిట్ వద్ద నిరసనలా?

>> చేయకూడదని, ఈ సోయి కాంగ్రెస్ లీడర్లకు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. దేశాభివృద్ధిని ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాల్లో హుందాతనం ప్రదర్శించాల్సింది పోయి, రచ్చ చేయడం సిగ్గులేని చర్య అన్నారు. రాజ్యాంగం మార్చబోతున్నారని, రిజర్వేషన్లు తీసేయబోతున్నారని, ఇలా అనేక సందర్భాల్లో అన్ని రకాలుగా దిగజారి రాహుల్ గాంధీ విమర్శలు చేస్తున్నారు. వాస్తవాలకు విరుద్ధంగా, ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. దేశాలకు వెళ్లిన ప్రతీసారి రాహుల్ గాంధీ భారతదేశంలో ప్రజాస్వామ్యం లేదని, పౌర హక్కులను కాలరాస్తున్నారని దేశ గౌరవాన్ని మంటగలిపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి విమర్శలను, అర్థంలేని ఆరోపణలను పట్టించుకోకుండా ప్రధాని మోడీ దేశ గౌరవాన్ని పెంచుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని, అందుకే ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. మన ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపేందుకు ఎన్నో మార్గాలున్నాయన్నారు. వాటన్నిటినీ కాదని అనేక దేశాల ప్రతినిధుల ముందు రాహుల్ గాంధీ డైరెక్షన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దేశాన్ని అగౌరవ పరిచే చర్యకు దిగారు. ఏఐ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు ఏమాత్రం క్షమార్హమైన చర్య కాదన్నారు. శుక్రవారం జరిగిన సంఘటన కాంగ్రెస్ పార్టీలో ఉన్న నిరాశ, నిస్పృహకు అద్దం పడుతుందని, ఢిల్లీ విస్తీర్ణం ఉన్నంత మేరకు చైనా భారత భూమిని లాక్కొందని పార్లమెంట్ సాక్షిగా రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేశారు. దాన్ని ఎక్స్ఆర్మీ చీఫ్ నరవణె ఖండించారు. అలాంటి అంశం ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయాల కోసం దేశ గౌరవాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేస్తూనే ఉన్నది. దేశం కోసం పనిచేస్తున్న ఎంతో మందిని అగౌరవ పరిచేలా ఉందన్నారు. రాహుల్ గాంధీ తీరు కనిపిస్తున్నది. ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ చేసిన ఈ చర్యను దేశ ప్రజలందరూ కూడా ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉన్నది.

# హోటల్‌లో భారీ పేలుడు

>> సీఐ వినోద్ కుమార్ కథనం ప్రకారం... ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి రంగారెడ్డి కోర్టు భవనం పక్కన ఉన్న చట్నీస్ రెస్టారెంట్ లో ఇడ్లీ కుక్కర్ భారీ పేలుడు జరిగింది.ఈ శబ్దానికికస్టమర్స్ బయటకు పరుగులు తీశారు. మధ్యాహ్నం సమయం కావడంతో హోటల్ లో చాలామంది భోజనానికి రావడం వచ్చారు. పేలుడు దాటికి హోటల్ లో పని చేస్తున్న నలుగురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. గాయలైన వారిని ఎన్టీఆర్ నగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి చికిత్స నిమిత్తం తరలించారు. మధ్యాహ్నం సమయంలో ఇడ్లీ స్టీమర్ అక్కడ పనిచేసే వర్కర్ ఆన్ చేసి వాల్ ఓపెన్ చేయకుండా బయటకు వెళ్ళిపోయాడు. తిరిగి వచ్చేసరికి ఆది పేలింది. హాట్ వాటర్ అక్కడ పనిచేస్తున్న చత్తీస్ ఘడ్ రాష్ట్రం బలోడా బజార్ జిల్లాకు చెందిన జోగేశ్వర్ (20), దయ (23), సుమిత్(21), సునీల్ (21) మీద పడడంతో తీవ్ర గాయాలయ్యాయని వివరించారు.

దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు ఘటన స్థలానికి జిహెచ్ఎంసి అధికారులు సంఘటన స్థలానికి జిహెచ్ఎంసి సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంహెచ్ వో దీప్తి, శానిటేషన్ సూపర్వైజర్ బుచ్చయ్య చేరుకొని ప్రమాదానికి గల కారణాలను మేనేజర్ అశోక్ ను అడిగి తెలుసుకున్నారు.

## రాజ్యసభలో తెలంగాణ బిల్లు పాసై 12 యేళ్లు: హరీశ్‌రావు పోస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది ఫిబ్రవరి 20(శుక్రవారం)నాటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేతం సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

## నాంపల్లి సిబిఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు

### మూడు రోజుల్లో రెండోసారి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** నాంపల్లి సిబిఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ నెల 18వ తేదీన సిబిఐ కోర్టుతో పాటు కరీంనగర్, రాజమండ్రి కోర్టులకు బాంబు బెదిరింపులు రావడం తెలిసిందే. అయితే ఇవన్నీ ఉత్తుత్తి బెదిరింపులుగా తేలడంతో పోలీసులతో పాటు న్యాయవాదులు ఊపిరి పీల్చుకున్నా న్యాయస్థానాల్లో కొన్ని గంటల పాటు అన్ని కార్యకలాపాలు ఆగిపోయాయి. అదే తరహాలో శుక్రవారం ఉదయం నాంపల్లి సిబిఐ కోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో ఎప్పటిలాగే కోర్టులో రోజువారీ కార్యకలాపాలు మొదలైన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ ద్వారా సిబిఐ కోర్టులో బాంబు వుందని చెప్పారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో దీనిపై సమాచారం అందింది. ఇదే సమయంలో బాంబు ఎప్పుడైనా పేలవచ్చని, దీనికి టైమర్ అమర్చామని మెయిల్ పంపిన వ్యక్తులు చెప్పడంతో పోలీసులతో పాటు బాంబు పేలుడు నిరోధక సిబ్బంది, పోలీసు జాగిలాలతో రంగంలో దిగి రెండు గంటలకు పైగా కోర్టు అంతా గాలింపు చేబట్టారు. అయితే ఎక్కడా ఎలాంటి బాంబు లేదని నిర్ధారణ అవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా రెండు గంటలకుపైగా కోర్టు కార్యకలాపాలు ఆగిపోయాయి. దీనిపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.



శుక్రవారం జూబ్లీహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ముకుందా బంగారం, వజ్రాల ఆభరణాల దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఫొటోలో కార్పొరేటర్ వెంకటేశ్ దేరంగుల, షాపు డైరెక్టర్ నిఖిత

## ఇంటర్నేషనల్ ఆర్చరీలో ఆర్టీసీ ఉద్యోగుల సత్తా

### కాంస్య పతకం సాధించిన కూన కిషన్.. అభినందించిన సంస్థ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో తెలంగాణ ఆర్‌టీసీ ఉద్యోగులు తమ సత్తా చాటారు. యూఏఈ లోని అబుదాబిలో జరిగిన ఓపెన్ మాస్టర్ గేమ్స్ విలువిద్య(ఆర్చరీ) పోటీల్లో పాల్గొన్న కూన కిషన్ 50మీటర్ల టార్గెట్‌లో కాంస్య పతకం సాధించారు. ఆయన జోనల్ వర్క్ షాప్ కరీంనగర్‌లో పనిచేస్తున్నారు. ఆర్చరీ విభాగంలో 40 నుంచి 50 సంవత్సరాల 50 మీటర్ల టార్గెట్లో కాంస్య పతకం సాధించిన కూన కిషన్ ఆర్‌టిసి ఎండి వై నాగిరెడ్డితోపాటు, ఇతర ఆర్‌టీసీ ఉన్నతాధికారులు అభినందించారు.





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇబ్రహీంపట్నం కౌన్సిలర్ ఆకుల యాదగిరి తదితరులు

## బిసిలను రాజకీయంగా అణిచివేయాలనుకుంటే సహించం

### కౌన్సిలర్ యాదగిరిని కిడ్నాప్ చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో జనరల్ స్థానాల్లో కౌన్సిలర్‌గా గెలిచి మున్సిపల్ చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని బీసీ సమాజవర్గానికి చెందిన యాదగిరి అడిగినందుకు 'జనరల్ స్థానంలో నువు బిసివి, నీకెందుకు ఇస్తాం' అంటూ అవ మానపరచడమే కాకుండా యాదగిరిని కిడ్నాప్ చేసి శారీరకంగా మానసి కంగా హింసించిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీసీలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కౌన్సిలర్ ఆకుల యాదగిరితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మాజీఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీసీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం బీసీలు రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కాలని ప్రయత్నించడం ఎట్టి పరిస్థితులు సహించేది లేదని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 24 స్థానాలకు 21 స్థానాలలో బీసీ ఎస్సీ ఎస్టీ అభ్యర్థులే కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారని మెజార్టీగా బడుగులు కౌన్సిలర్‌గా గెలుపొందితే మైనార్టీగా ఉన్న రెడ్డిలకు మున్సిపల్ చైర్మన్ పదవి ఏవిధంగా కట్టబెడతారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బిసిలు మున్సిపల్ చైర్మన్లు కాకూడదా?**

**బాధిత కౌన్సిలర్ ఆకుల యాదగిరి**

మూడుసార్లు కౌన్సిలర్‌గా ఒకసారి ఎంపీటీసీగా, మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా సుదీర్ఘకాలం పాటు నిజాయితీగా ప్రజలకు సేవచేస్తూ రాజకీయాలలో ఉన్న తనను టిఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నగదొక్కడానికి మున్సిపల్ చైర్మన్ పదవి అడగగానే బీసీలకు ఎందుకు చైర్మన్ పదవి అంటూ అవమానించడమే కాకుండా శారీరకంగా మానసికంగా తీవ్ర వేధింపులకు గురి చేశాడని హైకోర్టు జోక్యంతో కిడ్నాప్ బారి నుండి బయటపడ్డానని ప్రస్తుత కౌన్సిలర్, బీసీ నాయకుడు ఆకుల యాదగిరి అన్నారు.

# పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా పదోన్నతులు

### సుదీర్ఘకాలం తర్వాత ఉద్యోగులకు న్యాయం

### ఫలించిన మంత్రి సీతక్క కృషి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధిశాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ శాఖ మంత్రి సీతక్క చొరవతో ఈ ప్రక్రియ వేగవంతమైంది. తాజాగా ఉద్యోగుల పదోన్నతుల తాలూకు ఉత్తర్వులను ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్ జారీ చేశారు. ఉత్తర్వుల మేరకు సిఇఒలుగా 27 మంది డిప్యూటీ సిఈఓలు పదోన్నతి పొందగా, డిప్యూటి సిఈఓలుగా 55 మంది ఎంపిడిఓలు పదోన్నతి పొందారు. సుదీర్ఘకాలంగా పదోన్నతులు కోసం ఎదురుచూస్తున్న అధికా రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పదోన్నతులు పొందిన అధికారులు ప్రజా భవన్‌లో శుక్రవారం మంత్రి సీతక్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాటా ్లడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీల భర్తీతోపాటు, అర్హత కలిగిన వారికి సమయానుకూలంగా పదోన్నతులు కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బలో పేతం ద్వారా ప్రజలకు మరింత చేరువగా, సమర్థ వంతమైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష ్య మన్నారు. అదేవిధంగా.. ఖాళీగా ఉన్న 28 ఎంపిడివొ పోస్టుల నుంచి డిప్యూటీ సిఇఒలుగా, 15 మంది డిప్యూటీ సిఇఒల నుంచి సిఈఓలుగా పదోన్నతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు.

ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల్లో దశలవారీగా పదోన్నతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో మొదటిసారిగా అత్యధికసంఖ్యలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పదోన్నతులు కల్పించడం ద్వారా శాఖను బలోపేతం చేసినట్టు పేర్కొన్నారు. ఈ చర్యలతో గ్రామీణ స్థాయిలో పరిపాలన మరింత మెరుగు పడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో టిజిఒ అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు, సిఈఓ, డిప్యూటీ సిఈఓ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొంపల్లి నర్సింహులు, ఎంపిడిఓ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పద్ధతుల ద్వారా పంటలు పండించాలి

### శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచన

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని వ్యవసాయరంగంలో నూతన పద్దతుల ద్వారా పంటలు పండించాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమతోపాటు చుట్టు ఉన్న రైతులు కూడా జీవించాలనే మంచి మనసుతో వ్యవసాయం చేస్తున్నారని, వ్యవసాయం చేస్తే నష్టాలు వస్తాయని చెప్పే మాటలు తప్పని అన్నారు. రైతు బడి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'అగ్రి షో'ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 200 స్టాల్స్‌ను చైర్మన్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి కనబరచాలి ్సన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందని గుర్తు చేశారు. రైతు బడి అగ్రి షో ఇంచార్జ్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ షో ద్వారా రైతులకు అత్యాధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయడమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు రోజులు పాటు జరిగే ఈ షోలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, తదతర రాష్ట్రాలకు చెందిన రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని స్వీకరి స్తున్నారని చెప్పారు. రైతు బడి అగ్రి షోలో ఒక స్టాల్ ఏర్పాటు చేసిన ప్రతిభ బయోటిక్ సంస్థ ఎండి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అధునిక సాంకేతిక పద్దతిలో లాభసాటి వ్యవసా యంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సేంద్రీయ పోషక పదార్థాల సమతుల్య వ్యవ సాయాన్ని దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు పరిచ యం చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్టీఆర్ స్టేడియంలో బెలూన్‌లు ఎగరవేస్తూ అగ్రిషోను ప్రారంభిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో రాజేందర్‌రెడ్డి తదితరులు

## యూ ట్యూబర్ నా అన్వేష్‌కు షాక్

### ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్యాన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భారత్ గురించి అనుచిత వివాదాస్పద కామెంట్లు చేస్తూ పోలీసు కేసుల్లో ఇరుక్కున హైదరాబాద్ యూట్యూబర్ నా అన్వేష్‌కు ఇన్‌స్టాగ్రాం యాజమాన్యం షాక్ ఇచ్చింది. అతని ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌ను బ్యాన్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. నా అన్వేష్ ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌ను బ్యాన్ చేయాలని సిసిఎస్ పోలీసులు ఇన్‌స్టాగ్రాం యాజమాన్యాన్ని కోరడంతో ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది. నా అన్వేష్‌పై సినీనటి కరాటే కల్యాణి సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దేశం గురించి అతను యూట్యూబ్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడంపైనా ఆమె మండి పడ్డారు. దీనిపై కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు నా అన్వేష్ ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌ను బ్యాన్‌పై నిర్ణయం తీసుకున్నారు.

**అన్వేష్ కామెంట్..**

తన ఇన్‌స్టా అకౌంట్‌ను పోలీసుల సూచనల మేరకు బ్యాన్ కావడంపై నా అన్వేష్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పోలీసుల సూచనల మేరకు ఇన్‌స్టా యాజమాన్యం తన ఖాతాను బ్యాన్ చేసిందని, అయితే ఒక ఖాతా పోతే మరొకటి ఓపెన్ చేశానని, దీనివల్ల తనకు ఆదాయం రాదని అతను తెలిపాడు. తనకు యూట్యూబ్ వల్లే ఆదాయం వస్తుందని, తాను దానినే నమ్ముకున్నానని అతను వెల్లడించాడు. నయాపైసా రాని ఇన్‌స్టా అకౌంట్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అతను తెలిపాడు.

## కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డికి స్వల్పఅస్వస్థత

### ఎన్ని ఆఫర్లు వచ్చినా ఆయన పార్టీలోనే..

### అవమానం జరగకుండా చొరవ తీసుకోండి

### మీనాక్షినటరాజన్, మహేశ్‌కుమార్‌కు జగ్గారెడ్డి విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిం చారు. వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలు స్తోంది. ఆయనకు ఫుడ్‌పాయిజన్ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమ్స్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అంశంలో జీవన్ రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి ఉండటాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి 20 టిక్కెట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి 30 టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంజయ్ కుమార్ వర్గానికి చైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి రాజకీయంగా ఎన్ని ఆఫర్లు వచ్చినా పార్టీలోనే కొనసాగారని, అలాంటి నాయకుడికి పార్టీలో అవమానం జరగకుండా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఇన్‌చార్జీ నటరాజన్, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చొరవ చూపాలని కోరారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా టిక్కెట్లు ఇచ్చి పార్టీ ఆయనను ప్రోత్సహించిందని, కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఆయన ఓడిపోయారని అన్నారు. కానీ ఆయన ఎప్పుడూ పార్టీ గీతను దాటలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులకు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతానని అన్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరగకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రా యాన్ని ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు, పిసిసి చీఫ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంచార్జిని, పిసిసి ప్రెసిడెంట్‌ను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

**జీవన్‌రెడ్డిని పరామర్శించిన మంత్రులు పొన్నం, అడ్లూరి**

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డిని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు శుక్రవారం పరామర్శించారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

## తిరుమల కల్తీ నెయ్యిపై ఏకసభ్య కమిటీ

### రిటైర్డ్ ఐఎఎస్ దినేష్‌కుమార్ నియామకం

**తిరుమల, పిబ్రవరి 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అసెంబ్లీలో, శాసన మండలిలో పెద్ద దుమారం రేపిన కల్తీనెయ్యి వ్యవహారంలో అసలు సూత్ర ధారు లెవరనే నిగ్గుతేల్చేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం విశ్రాంత ఐఎఎస్ అధికారి దినేష్ కుమార్‌తో ఏకసభ్యకమిటీ ఏర్పాటుచేసింది. ఆయన త్వరలోనే బాధ్యతలు చేపట్టి గతంలో సిబిఐ సిట్ ఇచ్చిన నివేదికపై పూర్తిస్థాయిలో మరింత సమగ్రంగా 45రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో ఇప్పుడు ఏం వెలుగుచూడనుందనేది మాత్రం సంచలనమే. 2019–24 మధ్యకాలంలో తిరుమలకు లడ్డూలకు కల్తీనెయ్యిసరఫరా జరిగిన కేసులో ఇదివరకే సుప్రీంకోర్టు కలుగజేసుకుని నిపుణులతో సిట్ పేరుతో కమిటీని నియమించింది. ఈ కమిటీ అధికారులు క్షేత్ర స్థాయిలో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కీలక విషయాలను నివేదికగా ప్రభుత్వానికి అందజేశారు. పాత్రధారులను తేల్చిన సిట్ అసలు సూత్రధారుల జోలికెళ్ళకపోవడంతో దీనిపై లోతుగా అధ్యయనం చేసి ఎవరి పాత్ర ఎంత అనేది తేల్చాలనేది ప్రభుత్వం నిర్ణయం. కల్తీనెయ్యి బాగోతంలో టెండర్ నిబంధనలు మార్చి వారికి అనుకూలంగా తయారు చేసుకోవడం, ఆపై కల్తీనెయ్యిగా గుర్తించినా రద్దుచేయకపోవడం వంటివి ఇప్పుడు కీలకంగా ఏకసభ్యకమిటీ దర్యాప్తు సాగనుంది. కల్తీ వ్యవహారంలో కర్త,కర్మ,క్రియ ఎవరున్నారనేది తేల్చాలనే దృఢనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఈ ఏకపక్ష కమిటీ దర్యాప్తు చేపడితే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయనేది కూడా అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. విశ్రాంత ఐఎఎస్ అదికారి దినేశ్‌కుమార్ సమర్ధవంతమైన పాలన అదికారిగా పేరుంది. ఆయన నాయకత్వంలో కల్తీనెయ్యి వ్యవహారంలో లడ్డూల తయారీకి 60లక్షల కిలోల కెమికల్స్ వాడారని సిట్ వెలుగులోకి తెచ్చిన నివేదికపై కీలకంగా విచారణ చేయన్నారు.



## అజ్ఞాత మావోయిస్టులకు లొంగుబాట తప్ప మరోదారి లేదు

### పార్టీని సాయుధ విభాగం నియంత్రించడం వల్లే ఈ పరిణామాలు

### గణపతి ఎక్కడున్నాడనేది తెలియదు: అగ్రనేత మల్లోజుల వ్యాఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మావోయిస్టుల లొంగుబాటుకు కేంద్రం విధించిన డెడ్ లైన్ దగ్గర పడుతుండడంతో అజ్ఞాతంలో ఉన్న పార్టీ నాయకులు, ఇతర కార్యకర్తలు లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని కొన్ని నెలల క్రితం పోలీసులకు లొంగిపోయిన అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి ఊరఫ్ సోను అన్నారు. మావోయిస్టు పార్టీకి నేడు ఈ దుస్థితి రావడానికి పార్టీ పూర్తిగా సాయుధ విభాగం నియం త్రణలో వెళ్లి పోవడమేనని ఆయన తెలిపారు. ఆలోచనలు ఆయుధాలను నియంత్రించాల్సి వుండగా మావోయిస్టు పార్టీలో దీనికి భిన్నంగా మిలటరీ విభాగం ఆధీనంలో యావత్ పార్టీ వెళ్లి పోయిందని, దీని పర్యవసానాలే నేడు పార్టీ చవిచూస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ గురించి, పార్టీలో మిగిలిన కొద్దిపాటి క్యాడర్ గురించి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. మారిన ప రిస్థితుల వల్లే తాను తన అనుచరులతో కలిసి సాయుధ పోరాటాన్ని వదిలేయాల్సి వచ్చిందని, 1980లో వున్న పరిస్థితులు ఇప్పుడు లేవని ఆయన తెలిపారు. పరిస్థితులను అర్థం చేసుకుని తాము బయటకు వచ్చామని, విప్లవ పార్టీగా మారాల్సిన మావోయిస్టు పార్టీ అందుకు తగినట్లుగా మారలేక పోవడం వల్ల విపత్కర పరిస్థితులను చవిచూడాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ చేసిన అతిపెద్ద తప్పు గురించి మల్లోజుల మా ట్లాడుతూ పార్టీని సాయుధ విభాగం పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకోవడమని అన్నారు. ఈ తప్పు నుంచి పార్టీ కోలుకోలేక పోయిందని ఆయ న తెలిపారు. ఇక మావో యిస్టు పార్టీకి ప్రజల మద్దతు తగ్గడానికి సరైన మార్గంలో వెళ్లక పోవడమేనని ఆయన వెల్లడించారు. సాయుధ పోరాటం తో ప్రజల్లోకి వెళ్లే పరిస్థితులు ఇప్పుడు లేవని, అందుకే తమతో పాటు చాలా మంది రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రజల వద్దకు వెళ్లేందుకు అడవులను వదిలామని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఆయుధాలు కలిగి వుండడం సరైనదే అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఆటంకంగా మారిందని ఆయ న పేర్కొన్నారు. భారతదేశంలో ఆర్థిక సరళీకరణ తరువాత పరిస్థితులు వేగంగా మారాయని, వీటిని అందరు ఆమోదించారని, తాము దీనిని పాటి ంచాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఇక సాయుధ పోరాటం వీడాల్సిన పరిస్థితులపై 2003 నుంచే ఆలోచనలు మొదలయ్యాయని, 2024... 2024 ప్రాంతంలో తుపాకి వదలాల్సిన సమయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గతంలోనే బసవరాజు, గణపతి వంటి నేతలతో చర్చ జరిగిందని మల్లోజుల తెలిపారు. తాను బయటకు వచ్చాక అనేక మంది వస్తున్నారంటే తన మార్గం సరైందని ఆయన వెల్లడించారు. బస వరాజు తరువాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేవ్‌జీని ఎంచుకున్నారా...? అనే ప్రశ్నకు ఆయన తనదైన శైలిలో సమా ధానం ఇచ్చారు. అక్కడ ఎవ రున్నారని ఎంచుకుంటారు...? ఒకరిద్దరు నాయకుల్లో ఎవరిని ఎన్ను కుంటారని ఆయన ప్రశ్నించారు. ఇదంతా మీడియా సృష్టేగా ఆయన తెలిపారు. ఇక కర్రెగుట్టలను మావోయిస్టులు సొత్ సబ్ జోన్‌గా పిలుస్తారని, ఇక్కడ ఆపరేషన్ 1 జరిగిన సమ యంలో 500 మంది వరకు వుండేవారని, అయితే కొన్ని కారణాల వల్ల ఇది ఆగిందని, దీంతో అక్కడున్న వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లారని ఆయన తెలిపారు. ఇప్పుడా ప్రాంతం పూర్తిగా పోలీసుల నియంత్రణలో వెళ్లిందని ఆయన తెలిపారు. పెద్దనోట్ల రద్దు ప్రభావం మావోయిస్టు పార్టీపై తీవ్రంగా పడిందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం వల్ల పార్టీ రూ. 20 కోట్లను నష్టపోయిందని వెల్లడించారు. ఎల్‌టిటిఈతో మావోయిస్టు పార్టీకి సంబంధం లేదన్నారు. పార్టీ అగ్రనేత గణపతి వయస్సు 70 యేళ్లు దాటిందని, ఆయన ఎక్కడున్నాడనేది ఎవరికీ తెలియదని మల్లోజుల తెలిపారు.


**भारतीय प्रौद्योगिकी संस्थान पटना**
**ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాట్నా**

**నియామక ప్రకటన**

IIT పాట్నాలోని స్పోర్ట్స్ యూనిట్‌లో కాంట్రాక్చువల్/పార్ట్-టైమ్ స్పోర్ట్స్ కోచ్‌ల తాత్కాలిక పోస్టుల కోసం భారతీయ పౌరుల నుండి నిర్దిష్ట ఫార్మాట్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అన్ని సర్టిఫికెట్లు/ [illegible] 2026 సా.5.00 గం.లోపు "డి స్పోర్ట్స్ ఆఫీసర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాట్నా, బిహ్తా, పాట్నా-801106" కు చేరాలి. దరఖాస్తు ఫారం మరియు వివరణాత్మక ప్రకటన కోసం దయచేసి www.iitp.ac.in వెబ్‌సైట్ చూడండి. [illegible]

Adv.: IITP/SPORTS/2025-26/31 CBC 21366/12/0002/2526 రిజిస్ట్రార్

తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘ కార్యాలయం-దుబ్బాక, జిల్లా: సిద్దిపేట**
**టెండర్ నోటీస్**

నెం. E1/28/MPLADS/2026, తేది: 20.02.2026

[illegible] 1) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 21.02.2026 ఉ.11.00 గం. 2) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చివరి తేది: 27.02.2026 సా.4.00 గం. 3) [illegible] ఫోన్ నెం: 9390988387, 9391495430. [illegible] www.eprocurement.telangana.gov.in [illegible]

సం/- కమీషనర్, పురపాలక సంఘం దుబ్బాక

DIPR.No.15736-PP/CL/Advt/1/2025-26, తేది: 20.02.2026

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక కొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

[illegible] ప్రజా వెలుగు పార్టీ [illegible] పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము: 5-21, గ్రా॥ పులుమామిడి, మం॥ నవాబ్‌పేట, వికారాబాద్ జిల్లా-501111, తెలంగాణ. సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను (15) రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రజా వెలుగు పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/- అధ్యక్షులు
ప్రజా వెలుగు పార్టీ

తేది : 20.02.2026

**FORM NO. 14 [See Regulation 33(2)]**
**OFFICE OF THE RECOVERY OFFICER - I/II**
**DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)**
**3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.**

**DEMAND NOTICE**

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/218/2025 11-02-2026

State Bank of India
Versus
V.S.R. Steel Traders Pinapreddy

To

(CD 1) **V.S.R. Steel Traders, Pinapreddy, Vanaja, Wife of P.Govardhan Reddy** Represented by its Partners **Smt. Pinapreddy Vanaja & Smt. Pinapreddy Shriya Reddy,** Female, Major, Shop, 2, 3 Defence Colony, Opp. Ayyappa Temple, Karmanghat, Ranga Reddy, Telangana-500079.

(CD 2) **Smt. Pinapreddy Vanaja, W/o. Sri P.Govardhan Reddy,** Female, Major, R/o. Flat No.201, White Field Apartments, RKR Enclave Arch, Hastinapuram Central RKR Arch, Saroornagar, Hyderabad-500079

(CD 3) **Smt. Pinapreddy Shriya Reddy, W/o. Sri. P.Bharath Reddy,** Female, Major, R/o. Flat No.201, White Field Apartments, RKR Arch, Hastinapuram Central RKR Enclave Arch, Saroornagar, Hyderabad-500079.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the **Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 1) in OA/383/2024** an amount of **Rs.38,76,392/- (Rupees Thirty Eight Lakhs Seventy Six Thousands Three Hundred Ninety Two Only)** along with pendentellite and future interest @ 10.55% Simple Interest Yearly w.e.f. 22/10/2024 till realization and costs of **Rs.82,110/- (Rupees Eighty Two Thousands One Hundred Ten Only)** has become due against you (Jointly and severally/ Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **06/03/2026 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
   (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
   (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: **11-02-2026.**

Sd/- Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)

**No. A-34015/4/2021-Estt**
**జాతీయ పౌర హక్కుల కమిషన్**

తేది : 20వ ఫిబ్రవరి 2026

**డిప్యుటేషన్ ఖాళీ ప్రకటన నం. 02/2026**

జాతీయ పౌర హక్కుల కమిషన్‌లో డిప్యుటేషన్ ప్రాతిపదికపై ముందుగా అనుకొనే క్రింది ఖాళీ భర్తీ నిమిత్తం దరఖాస్తులు కోరబడుతున్నవి.

| క్ర.సం. | ఉద్యోగం పేరు | పే స్కేల్ | ఉద్యోగం యొక్క సంఖ్య |
|---|---|---|---|
| 1. | రిజిస్ట్రార్ (లా) | లెవెల్-15 (రూ.182200-224100) | 01 |

2. సవివరణ అర్హత ప్రమాణం మరియు దరఖాస్తు ఫారం నమూనా NHRC యొక్క వెబ్‌సైట్ (www.nhrc.nic.in) పై అందుబాటులో ఉన్నది.
3. అర్హులైన అభ్యర్థులు, ఎంపికైన వెంటనే రిలీవ్ చేయగలిగినవారి యొక్క దరఖాస్తులను అండర్ సెక్రటరీ (ఎస్టాబ్లిష్‌మెంట్) NHRC మానవ అధికార్ భవన్, 'C' బ్లాక్, GPO కాంప్లెక్స్, INA, న్యూఢిల్లీ-110023 వారికి అవసరమైన పత్రాలతోపాటు తేదీ 31.03.2026కు పంపవలెను.

CBC 53101/11/0009/2526

సం/- (ముకేష్ కుమార్), అండర్ సెక్రటరీ (Estt)
ఫోన్: 011-24663278

వార్త


మేం భారతీయుల ముందు మోకరిల్లుతాం! వారు మాకు గణితాన్ని నేర్పారు. గణితమే లేకపోతే, ఎలాంటి శాస్త్ర పరిశోధనా జరిగేది కాదు.

- ఐన్‌స్టెయిన్

# ఇదేమి సంస్కృతి?


అనర్హులకు ఉచితాలు అందకుండా అదుపు చేసే వరకు సుప్రీం కోర్టు మరోవైపునకు దృష్టి మరల్చేటట్లు లేదు. సుప్రీం ధర్మాసనంలో ఏ న్యాయమూర్తులున్నా ఉచితంపై దృష్టి సారించినట్లే ఉంది. సాధారణ పరిభాషలో యుద్ధం ప్రకటించినట్లే నన్న మాట. అసలు ఉచితాలు వద్దని ఎందరో మేధావులు ప్రస్తావిస్తున్న మాటలు ఎవరికీ చెవికెక్కడం లేదు. అదలా ఉంచి కనీసం అర్హులైనవారికి మాత్రమే ఉచితాలు అందించగలగడం మేలు అనే భావన అందరిలోనూ ఉంది. ఆఖరికి ఉచితాలు కోసం అర్రులు చాచే అనర్హులు సైతం అదేదో తప్పుకాదని వాదిస్తారు. రెవెన్యూలోటు అధికంగా ఉన్న రాష్ట్రాలు ఎన్నికలనగానే ఉచితాల తాయిలాలను ఎరవేస్తున్నారు. లోగు పూడ్చడం లోగుట్టు పెరుమాళ్లకెరుక. లోటు లేని బడ్జెట్ ఉన్న రాష్ట్రాలు తమ నిధులను రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య అవసరాలకు మళ్లించుకోవాలని సుప్రీం బెంచ్ సూచించింది. అందరికీ ఉచితంగా ఆహారం, సైకిళ్లు ఇవ్వడం కన్నా ఉపాధి మార్గాలను అన్వేషించి మెరుగుపరచడానికి సదరు నిధులను వెచ్చించడం మంచిదని హితవు పలికింది. నిరుపేదలైన అర్హులతోపాటు బడా భూస్వాములకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హాస్యాస్పదమేనంది. ఏదో ఆశించి ఇలాంటివి చేయడం సరికాదని, పునరాలోచించుకోవాలని కోరింది. విచక్షణారహితంగా ప్రభుత్వ నిధులను పంచిపెట్టడం బుజ్జగింపులకేనని స్పష్టమౌతోందని విశ్లేషించింది. సంక్షేమ నిధులను పక్కదారికి మళ్లించడం సమంజసం కాదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనైనా ప్రభుత్వాల తీరు మారాలి. ఉచితాలపై సుప్రీంకోర్టు మరోసారి ఆందోళన వెలిబుచ్చింది. ఎన్నికల ముందు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుప్పిస్తున్న ఉచితాలు అర్హులతోపాటు అనర్హులను కూడా జత చేసే ప్రక్రియను ఎంత మాత్రం ఆమోదించేది లేదని నిర్ద్వంద్వంగా వివరించింది. ఉచిత ఆహారం, ఉచిత విద్యుత్తును ఇదే స్థాయిలో కొనసాగిస్తే ఆయా రాష్ట్రాలకు నిధులు సమస్య తలెత్తుతుంది. ఆ సందర్భంలో రాష్ట్రాల అభివృద్ధికి నిధులు సరిపోవు. దేశ ఆర్థికాభివృద్ధికి నిధుల కొరత ఏర్పడ్తుంది. ఇలా ఉచితాలపై ఖర్చు చేసే వ్యయాన్ని ఎక్కడి నుంచి తెస్తాం, అభివృద్ధికి నిధులెలా? అనే ఆలోచన చేయడం లేదని కోర్టు ఆవేదన చెందింది. ఉచితాలపై చర్చ జరగని సందర్భం ఉండదని తెలిసిందే. అదే ధర్మాసనం ముందుకుఇలాంటి అంశాలపై చర్చ రేగితే జనంలో కూడా ఆలోచన మొదలౌతుంది. ఏక మొత్తంగా ఉచితాలపై వెగటు పుట్టే పరిస్థితి రాదు. కానీ అవసరమైన వారికి అందించగలిగితే అందరూ గర్విస్తారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు రానున్న సందర్భంగా ఇటీవల అధికార డిఎంకె పార్టీ ప్రజల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణసందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయా మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం అంశంపై పలు వ్యాఖ్యలు చేసింది. కరెంటు బిల్లులు చెల్లించలేని నిస్సహాయస్థితిలో ఉన్న పేదలకు సహాయం చేయడం మంచిదేనని కానీ ఆర్థిక స్థోమత ఉన్న వారికీ లేని వారనే తేడా లేకుంటే సహాయమందించడం మంచి పద్ధతికాదని వ్యాఖ్యానించింది. ఉచితాలను విచక్షణా రహితంగా పంపిణీ చేసి పని చేయకుండా కాలక్షేపం చేసే వారి సంఖ్యను పెంచినట్లే ఉంటుందని అది పని సంస్కృతికి చెల్లుచీటి ఇచ్చినట్లేనని సిజెఐ బెంచ్ హెచ్చరికలు చేసింది. ప్రధానంగాయుటిలిటీలు సేవలకు చెల్లించగలిగితే ఆర్థిక స్థితి ఉన్నవారికి కూడా ఉచిత రాయితీలు ఇచ్చే సంస్కృతి ఎక్కడికి దారితీస్తుందో బేరీజు వేసుకోవాలని సూచించింది. ఎన్నికల సందర్భాల్లో భారీ కానుకలు పంచిపెట్టడం వంటి ఉచితాల ద్వారా లబ్ధిపొందగలమనే ఆలోచన కలుగ చేయనీయరాదని ఎన్నికల ముందు ప్రభుత్వాలు ప్రకటించే నజరానాలు, ఉచిత లబ్ధిపథకాలు ఎంతో బాధ్యతారహితంగా ఉన్నాయన్నది సర్వోన్నత న్యాయస్థానం విశ్లేషిస్తోంది. అలాంటి నిర్ణయాలు ప్రకటించే సమయం, సందర్భం అనుచితంగా ఉన్నాయన్నది న్యాయస్థానం అభిప్రాయం. ఇన్నాళ్లూ లేనిది ఇంత ఆకస్మికంగా ఉచిత విద్యుత్తును ఎందుకు ప్రకటించారని తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రకటించింది. ఎన్నికల ముందు మాత్రమే ఇలాంటి పథకాలను ప్రకటించడంలో ఔచిత్యాన్ని ఆపై ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు సామాజిక వేత్తలు, మేధావులు పునరాలోచించాల్సిన అవశ్యకత ఉందని సుప్రీం కోర్టు వివరించింది. ఈ విధానాలు ఇంకా ఎంతకాలం ఏవిధంగా కొనసాగాలన్నది నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉందని తీవ్రస్థాయిలో ఆర్థికలోటు ఉన్నా ఉచితాలు ప్రకటించడం అందు కోసం పన్నులను విధించడం వంటి భారాలన్నీ తుదకు పన్ను చెల్లింపుదారుల మీద పడుతున్నాయని ధర్మాసనంఆందోళన వ్యక్తంచేసింది. సరైన ముందస్తు ఆర్థిక ప్రణాళికలు లేకుండా రాష్ట్రాలు సబ్సిడీలిచ్చే వాగ్దానాలను ఎలా నెరవేర్చగలవో ఆలోచించాల్సిందేనని సుప్రీంబెంచ్ సూచించేది. విద్యుత్ సవరణ చట్టాలు 2024లోని నిబంధన 23ను సవాల్‌చేస్తూ తమిళనాడు పవర్‌డిస్ట్రిబ్యూషన్ కంపెనీ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఎంత లోతుగా చర్చిస్తూ విద్యుత్ సరఫరా సంస్థలు (డిస్కమ్‌లు) నుంకా లు, బడ్జెట్ లెక్కలు సర్దుబాటు చేయలేక సతమతమవుతున్న విషయం అందరూ అర్థంచేసుకోవాలని కోరింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఎంతో నిర్దిష్టంగా రూపొందించే బాధ్యత సుప్రీంకోర్టు తీసుకోవడమే ధర్మం.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మలెన్నవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని తిరిగి సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



## భాషల పట్ల గౌరవభావం

ఇటీవల కేరళ రాష్ట్ర గవర్నర్ హిందీ భాషలో ఉర్దూ, పార్శీక పదాలు ఎక్కువగా ఉన్నందున దక్షిణాది ప్రజలు హిందీనిసరిగ్గా అర్థంచేసుకోలేకపోతున్నారని, అదే హిందీ భాషలో సంస్కృత భాషా పదాలు చేర్చితే దక్షిణాది వారికి హిందీని దగ్గరికి చేర్చవచ్చనే భావన ఆయనకు భారతీయ భాషలపట్ల బొత్తిగా అవగాహనలేనట్లు తెలుస్తోంది. ఉదాహరణకు తెలుగుభాషలో అనేక ఉర్దూ, పార్శీక పదాలు వాడుకలోఉన్నాయి. తెలుగు, కన్నడ, మరాఠీ భాషలలో ఎక్కువగా ప్రాకృత భాషా పదాలు ఉన్నాయి. అలాగే తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో ద్రవిడ పదాలతో పాటు ఆయా భాషల సహజ స్థానిక పదాలున్నాయి. ఇంకా, తెలుగు, మలయాళ భాషలలో లెక్కకు మించి సంస్కృత పదాలు వాడుకలో ఉన్నాయి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## సంఘీభావం అంటే ఇది

పాకిస్థాన్ మాజీ ప్రధాని, ఆ దేశానికి క్రికెట్ కెప్టెన్‌గా అనేక విజయాలను సాధించి,దేశానికి అనంత కీర్తినార్జించి పెట్టిన, వయసుపైబడ్డ ఇమ్రాన్‌ఖాన్‌జైలు జీవితం గడుపుతున్నాడు. ప్రస్తుతం కంటిచూపు మందగించి అనారోగ్యంతో కాలం గడపడంకాలమహిమ,ఆయనకు సకలసౌకర్యాలు కల్పించామని ఆ దేశ కీలుబొమ్మ ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లను కాచి వడపోస్తోంది. ఇది పచ్చి అబద్ధమని ఆయన కుమారులు, కుమార్తె ఖండించారు. ఖాన్‌గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆయనతో క్రికెట్ ఆటను ఆడిన మన మాజీ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ వారు ఆందోళన చెంది పాక్ పాలకులకు ఓ సుదీర్ఘ లేఖను ఆయన ఆరోగ్య పరిరక్షణకు తక్షణచర్యలుతీసుకోవాలని రాసారు. ఇదిసంఘీభావం అంటే.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉద్యమకారులను గుర్తించాలి

ప్రభుత్వం ఉద్యమకారులకు ఇందిరమ్మఇండ్లు మంజూరు చేయాలి. ఇటీవల కాలంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వంనిర్వహించిన ఉద్యోగపరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. చాలామందికి వయోపరిమితి అతి సమీపంలో ఉండి తక్కువ కాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన తెలంగాణ ఉద్యమకారులను కూడా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

## కృత్రిమ మేధో యుగం

దక్షిణార్ధగోళంలోని ప్రపంచ దేశాల్లోనే తొలిసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి ఏఐ సదస్సు ఢిల్లీలో జరగడం భారత్‌కి తలమానికం. 100దేశాల ప్రతినిధులు, వందలాది మంది పారిశ్రామిక దిగ్గజాలు,దేశాధినేతలు పాల్గొంటున్న ఈసదస్సు కృత్రిమ మేధపై కూలంకషంగా చర్చలు జరుపుతుంది. ఐదురోజుల చర్చల అనంతరం ముగింపు రోజు వివిధ దేశాల అంగీకారంతో భవిష్యత్ దారుల్ని స్పష్టపరిచే అధికారిక ప్రకటన వెలువరిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా, అన్ని రంగాల్ని ప్రభావితం చేసే శక్తి కృత్రిమ మేధకు ఉంది. అదీ జెట్‌స్పీడ్‌లో .ఆ ప్రభావానికి తగినట్టువ్యక్తులూ,సమాజమూ తయారుకావాలి.రానున్న మార్పుల్ని పసిగట్టి అవకాశాల్ని ఒడిసిపట్టాలి. లేదంటే ఇంతవరకూ బలమైనవిగా భావించబడుతున్న దేశాలు బలహీనమోతాయి. సరిగ్గావినియోగించుకోగలవి బలంపుంజుకుంటాయి.ఈ మార్పుల్ని ముందే ఊహిస్తూ అమెరికా,చైనా దేశాలు కృత్రిమ మేధ పరిశోధనలపై అధికంగా ఖర్చు పెడుతున్నాయి.

-డా.డి.వి.జి శంకరరావు, విజయనగరం

## బంగ్లాదేశ్ జాగరూకతతో మెలగాలి

బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటు అది వేస్తున్న అడుగులు దక్షిణాసియాకు కొంతశాంతిని కలిగిస్తుంది. ముఖ్యంగా భారత్ వంటి దేశానికి అదిశాంతి కాముకంగా ఉంటుంది. ఖుషియ్యారా నది నుండి 153 క్యూసెక్కులు తీసుకోవడం నుండి మొదలు పెడితే భారతప్రభుత్వం ఇలా ఆలోచన చేయొచ్చేమో బెంగాల్, అస్సాంనుండి జనపనరా కారిడార్‌ను రూపొందించాలి. ఉపాధి హామీలోజనపనారా పంటలకు తగినవెసులుబాటు కల్పించాలి.

-భారత అవినాష్, జనగాం

## కుక్కలు లేని గ్రామాలు

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇటీవల సుమారు 500 వీధి కుక్కలను సామూహికంగా హతమార్చడం దేశవ్యాప్తంగా పెను సంచలనంసృష్టించింది.పోలీసు రికార్డులుసామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో ఆధారాల ప్రకారం, విషపు ఇంజక్షన్లు ఆహారంలో విషంకలిపి ఈ మూగజీవాలను అత్యంత క్రూరంగా అంతం చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు సర్పంచులు తమ గ్రామాలనుకుక్కలు లేనిగ్రామాలుగా మారుస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడంలో భాగంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

-రాపాక రవీందర్, జనగాం

మన వివి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పనిలేని, 'పనికి'రాని 'రోడ్ సేఫ్టీ'!

ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ విషయంపై కొంత దృష్టిసారించారు. సచివాలయంలో ఇందుకు సంబంధించిన అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రతిపాదనలు కూడా రూపొందించారు. కానీ ఎవరికి వారు తమ అధికారాలకు, ముఖ్యంగా ఆదాయాలకు గండిపడుతుందన్నట్లు వ్యవహరించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సమావేశాలను, వాయిదా వేయించగలిగారు. ఇప్పటికీ రెండు రాష్ట్రాల్లో రోడ్డు సేఫ్టీ ఆథారిటీ కొనసాగుతున్నా అదొకటి ఉందనే విషయం సామాన్యులకు ఎవ్వరికి తెలియదు. గత నాలుగు దశాబ్దాలుగా పని కల్పించకుండా యేటా లక్షలాది రూపాయల జీతభత్యాల రూపేణా ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. పని కల్పించని, పనిలేని ఈ విభాగాన్ని కనీసం రద్దుచేయడానికి కూడా పాలకులకు చేతులు రావడంలేదు.ఏటా లక్షలాది రూపాయలు ప్రజాధనం నిరుపయోగం అవుతున్నా పట్టించుకోక పోవడం దురదృష్టకరం.

దామెర్ల సాయిబాబ

దేశంలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువచ్చి ప్రాణాలు పోతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అన్నెం పున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు యేటా రోడ్డు ప్రమాదాల్లో బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికులురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఒకరోజు కాదు రెండు రోజులు కాదు యేడాది యేడాదికి ఈ మృత్యు ఘోష పెరిగిపోతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే గత దశాబ్దకాలంలో దాదాపు తొంభై లక్షలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకుంటే సుమారు ఇరవైఐదు లక్షల మందికిపైగా మృత్యువాతపడి నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగానే గత నాలుగేళ్లల్లో ముప్పై వేలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదలినవారెందరో ఉన్నారు.మరికొందరు విదేశాల్లో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఆర్థికంగా కూడా పెద్దఎత్తునే నష్టం జరుగుతున్నది. ఇక దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఈ ప్రమాదాల్లో అగ్రభాగంలోనే ఉన్నాయని చెప్పొచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా మితిమీరిన వేగంతోపాటు మద్యం మత్తులో కూడా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కుటుంబాలకు, కుటుంబాలే తుడిచిపెట్టుకుపోతున్నాయి. కొన్నిసార్లు వాహన వేగం 120 కిలో మీటర్లకుపైగా ఉండ డంతో బెలూన్లు తెరుచుకున్నా ఫలితం లేకుండాపోతున్నది. ఇలా నిత్యం రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. అసలు పోలీసులు రికార్డుల్లోకి రాని ప్రమాదాలు కూడా ఎన్నో ఉన్నాయి. చనిపోయిన వారిలో అధికశాతం ఇరవైఐదు ఏళ్ల నుంచి నలభై ఐదు యేళ్లవయసులో ఉన్న వారే. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడినో కోల్పోతే ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పడుతున్న వేదన వర్ణనాతీతం. ఆ కుటుంబాల విషాద గాథలు వింటుంటే ద్రవించని హృదయం ఉండదు. ప్రకృతి బీభత్సంతోనో, లేక ఇతర కారణాలతో వందో, రెండువందల మందో అసువులు బాస్తే భూమి ఆకాశం దద్దరిల్లేటట్లు కేకలు వేసే నాయకులు ఈ ప్రమాదాల్లో ఇంతపెద్ద ఎత్తున మరణించినా, మరణిస్తున్నా వారి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ప్రకృతి బీభత్సానికి గురవుతున్న వారిని ఆదుకోవద్దని చెప్పడం లేదు. ఆపన్న హస్తం అందివ్వద్దని అనడం లేదు. యేటా వేలాది మంది రోడ్డు ప్రమాదంలో అసువులు బాస్తుంటే పట్టించుకోకపోవడం క్షంతవ్యం కాదు. నివారణకు చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. చట్టాలు చేసి, నిబంధనలు విధించి, జరిమానాలు వసూల్ చేసుకొని చేతులు దులుపు కొంటె సరిపోదు. అలాఅని ప్రమాదాల నియంత్రణకు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ఎన్నో చేశారు, చేస్తున్నారు. కొన్ని చట్టాలు అమలుకు నోచుకోకపోతే మరికొన్నింటిని పాలకులు నిర్వీర్యం చేశారు, చేస్తున్నారు. అందుకు ఎన్నో సమీక్షలు, చర్చోపచర్చల అనంతరం ప్రమాదాల నివారణకు ఏర్పరిచిన రోడ్

ఒక్క మాట

సేఫ్టీ అథారిటీని ఉదహరించవచ్చు. గతంలో విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్రరావు మరణించినప్పుడు దాదాపు రాష్ట్ర యంత్రాంగం అంతా విజయవాడకు తరలివెళ్లింది. అక్కడే సమీక్షలు, సమావేశాలు చేశారు. ప్రమాదాల నివారణకు నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డుభద్రతా సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షించేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ హోదా కలిగిన అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు విభాగాలు ఏర్పడ్డాయి.ఇద్దరు డిజి స్థాయి అధికారులను నియమించారు. అయినా పని లేకుండా చేయడంతో సంతకం పెట్టివెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్నిసార్లు అయితే కనీసం క్యాంప్ క్లర్క్ కూడా ఇవ్వకుండా మూలన కూర్చోబెట్టారు. వ్యక్తుల మీద కోపంతో వ్యవస్థను కూలదోశారనేందుకు ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. తమ మాట వినని, నచ్చని అధికారులకు పనిష్మెంట్‌గా ఈ పోస్టుల్లో కూర్చోబెడుతున్నారు. సమర్థులుగా పేరు తెచ్చుకున్న ఎందరో అధికారులు రాష్ట్రంలో అధికార మార్పు జరగగానే ఇలాంటి పోస్టులకు బదలీ చేస్తున్నారు. అధికారాలు ఉండవు. వాహనాలు ఉండవు, సిబ్బంది ఉండరు. అలాంటి విభాగం ఒకటి ఉందనికూడా తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్ సేఫ్టీ ఆథారిటీ ప్రమాదాల నివారణకు ఇప్పటి వరకు ఒక్కచర్య తీసుకున్న దాఖలాలు లేవు. చేసేందుకు పనేమీ ఉండదు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అధికారితో మాట్లాడితూ వర్క్‌ఫ్రం హోమ్ అని పెట్టుకుంటే ఆఫీసుకు రావాల్సిన పని ఉండదు కదా అని ప్రశ్నిస్తే ఆఫీసుకు వచ్చినా పనిలేకుంటే వర్క్‌ఫ్రం హోమ్‌లో వర్క్ ఎక్కడుంటుంది, 'హోం వర్క్' తప్ప అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈవిషయంపైకొంత దృష్టిసారించారు. సచివాలయంలో ఇందుకు సంబంధించిన అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రతిపాదనలు కూడా రూపొందించారు. కానీ ఎవరికి వారు తమ అధికారాలకు, ముఖ్యంగా ఆదాయాలకు గండిపడుతుందన్నట్లు వ్యవహరించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సమావేశాలను, వాయిదా వేయించగలిగారు.ఇప్పటికీ రెండు రాష్ట్రాల్లో రోడ్డు సేఫ్టీ ఆథారిటీ కొనసాగుతున్నా అదొకటి ఉందనే విషయం సామాన్యులకు ఎవ్వరికి తెలియదు. గత నాలుగు దశాబ్దాలుగా పని కల్పించకుండా యేటా లక్షలాది రూపాయల జీతభత్యాల రూపేణా ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. పని కల్పించని, పనిలేని ఈ విభాగాన్ని కనీసం రద్దు చేయడానికి కూడాపాలకులకు చేతులు రావడం లేదు. ఏటా లక్షలాది రూపాయలు ప్రజాధనం నిరుపయోగం అవుతున్నా పట్టించుకోకపోవడం దురదృష్ట కరం. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్నోసార్లు ప్రయత్నాలు చేసింది. 2005లో కేంద్ర కేబినెట్ సూచనమేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్. సుందరం నేతృత్వంలోని కమిటీని నియమించింది. దేశ వ్యాప్తంగా ప్రమాదాలను సమగ్రంగా అధ్యయనం చేసిన కమిటీ 2007లో ఒక నివేదికను సమర్పించింది. ఎనభై శాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం ద్వారా జరుగుతుందని నివేదికలో పేర్కొంది. చాలామంది డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియడం లేదని, కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సు జారీ ఒక ప్రహసనంగా మారిందని, కనీసం సంతకం చేయలేనివారు లైసెన్సు పొందుతున్నారని ఆ నివేదికలో వెల్లడి అయింది. ఆ తర్వాత ఎన్నో కమిటీలు వచ్చాయి. చట్టాల్లో కొన్ని మార్పులు చేశారు. నిబంధనలను రూపొందించారు. భారీగా జరిమానాలు వేస్తున్నారు. నిఘా పెంచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. కానీ అవేమీ ఈ ప్రమాదాలను ఆపలేకపోతున్నాయి. చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. వీటన్నింటికంటే మించి మద్యం వాడకం ఈ ప్రమాదాలను బాగా పెంచుతున్నది. మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎక్కడపడితే అక్కడ షాపులను అనుమతిస్తున్నారు. రహదారుల వెంట ఉన్న మద్యం షాపులు వాహన డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తలడిల్లిపోతున్నాయి. లక్షల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకులీడిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యం సేవించో, లేక అలక్ష్యంతోనో వాహనాలు నడిపి ఎంత మందిని చంపినా జరిమానా చెల్లించో, మరో విధంగానో తప్పించుకోవచ్చుననే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్యదేశాల్లోలాగా మరణాలకు కారణమైన వాహన చోదకులకు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి. ●

# జనజీవనంపై ధ్వని కాలుష్య ప్రభావం

డాక్టర్. వై. సంజీవ కుమార్

ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలు, పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఎన్నో ఉన్నప్పటికీ, నేటి సమాజంలో ధ్వని కాలుష్యాన్ని సమర్థవంతంగా నియంత్రించలేకపోతున్నాం. ఎటు చూసినా, ఎటు విన్నా శబ్దాల మోతే. మనిషి కర్ణభేరిలకు తూట్లు పడుతున్నట్టుగా పరిస్థితి తయారైంది. రోడ్లపై అనవసరమైన హారన్‌లు, మోడిఫై చేసిన సైలెన్సర్లతో ద్విచక్ర వాహనాల ధ్వని, పల్లె నుంచి పట్నం వరకు తేడా లేకుండా వ్యాపిస్తున్న శబ్దకాలుష్యం ఇవన్నీ మన ప్రశాంతతను దోచుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రశాంతతకు మారు పేరైన పల్లెలు, పట్టణాల్లోని కాలనీలు నేడు శబ్ద రణరంగాలుగా మారిపోయాయి. పల్లెల్లో, కాలనీల్లో మైకుల మోత, చెత్త బండ్ల శబ్దాలు, తోపుడు బండ్లు, ఆటోలలో నిత్యావసర సరుకులు అమ్మే వారు పెట్టే మైకుల గోల ఇవన్నీ కలిసి మనసు ప్రశాంతతను, శరీర ఆరోగ్యాన్ని రెండింటినీ దెబ్బతీస్తున్నాయి. చిన్నపిల్లల చెవులు అత్యంత సున్నితమైనవి. నిరంతరం అధిక శబ్దాలకు లోనవడం వల్ల చిన్న వయస్సులోనే వినికిడి లోపాలు, దృష్టి లోపం, నిద్రలేమి,మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. పెద్దలకు అలవాటైపోయిన హారన్ శబ్దాలు, చిన్నారుల వినికిడిని శాశ్వతంగా దెబ్బతీయగలవు. ఇది కేవలం ప్రభుత్వ నియంత్రణతో మాత్రమే పరిష్కారమయ్యే సమస్య కాదు. ప్రతి పౌరుడిలో బాధ్యతా భావం పెరగాలి. అవసరం ఉన్నప్పుడే హారన్ వినియోగించడం, వాహనాలను



ను నిబంధనల ప్రకారం నిర్వహించడం, పల్లెల్లో, పట్టణ కాలనీల్లో మైక్ వినియోగాన్ని పరిమితం చేయడం, పిల్లలకు–పెద్దలకు ధ్వని కాలుష్యంపై అవగాహన కల్పించడం, కాలనీ, గ్రామ కమిటీల ద్వారా నియంత్రణ చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి. ఈ రోజు శబ్దాన్ని నియంత్రించకపోతే, రేపు చెవులే శబ్దాన్ని కోల్పోయి నిశ్శబ్దంగా మారే ప్రమాదం ఉంది. ధ్వని కాలుష్యం ప్రభావం కేవలం మనుషులకే పరిమితం కాదు. మాట్లాడలేని, తమ బాధను వ్యక్తపరచలేని మూగ జీవాలు కూడా తీవ్రమైన శబ్ద కాలుష్యానికిగురై వినికిడి శక్తిని కోల్పోతున్నాయి. పటాకులు, భారీ వాహనాల హారన్‌లు, మైకుల మోత, యంత్రాల శబ్దాలు ఇవన్నీ పక్షులు,పశువులు, కుక్కలు, పిల్లులు వంటి జీవుల చెవులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అధిక శబ్దాల వల్ల మూగ జీవుల్లో భయం, అయోమయం, ఆందోళన పెరుగుతాయి. దాంతో అవి దారి తప్పడం, ప్రమాదాలకు గురికావడం, ఆహారం వెతుక్కోవడంలో ఇబ్బంది పడటం, పరస్పర సంకేతాలు అర్థం కాకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటాయి. పక్షుల్లో గూళ్లు వదిలేసి పారిపోవడం, గుడ్లు పెట్టకపోవడం, దారితప్పడం, మరణించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. మనుషుల్లా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందే అవకాశం లేకుండా, మూగ జీవాలు మౌనంగా బాధను భరిస్తున్నాయి. ధ్వని కాలుష్య నియంత్రణ అనేది మానవ ఆరోగ్య రక్షణ మాత్రమే కాదు, సమస్త జీవరాశి సంరక్షణ బాధ్యత. ●

# మాతృభాషలో బోధనే ప్రగతికి దారి



ఆచార్య టి. గౌరీ శంకర్

ఒక భాష తన ఉనికిని కోల్పోకుండా మనగలిగి ఉండాలంటే ఆ భాష బోధనా భాషగా, పాలనా భాషగా,పత్రికా భాషగా కొనసాగాలి. తమ మాతృభాషను అధికార భాషగా కొనసాగించాలని ఒక ఉద్యమం నడిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలను సైతం పణంగా పెట్టిన చరిత్ర బంగ్లాదేశ్‌ది. మొదట భాష కోసం సమరం జరిపి, ఆ భాషా ప్రాతిపదికపైన ఒక ప్రత్యేక దేశాన్నే సాధించుకొన్న ఘనత బంగ్లాదేశ్ ప్రజలది. ప్రపంచ చరిత్రలోనే ఇది అపూర్వం. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని ఆయా భాషల ప్రజలు, అక్కడి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆలోచించి, వ్యవహరించవలసిన సందర్భం ఇది. 'మాతృభాష తల్లి పాల వంటిది పరాయి భాష పోతపాల వంటిది' అని కొమర్రాజు వేంకట లక్ష్మణరావు పంతులు సెలవిచ్చారు.'మాతృభాష కళ్ల వంటిది పరాయి భాష కళ్లజోడు వంటిది' అని కరుణానిధి అన్నారంటారు. తల్లి ఒడి నుడి కంటే పరమామృతం కలదె' అని రాయప్రోలు సుబ్బారావు నుడివారు. 1835లో లార్డ్‌మెకాలే భారతదేశంలోని విద్యాలయాలలో బోధనాభాషగా ఇంగ్లీషుని ప్రవేశపెట్టినప్పుడు ఫ్రెడరిక్ జాన్‌డోర లార్డ్ డ్రెమండ్ లార్డ్ విల్సన్ వంటి ఆంగ్లేయ మేధావులు బోధనా భాషలుగా దేశీయ భాషలు మాతృభాషలే ఉండాలని ఆనాటి పార్లమెంటులో వాదించారు. లార్డ్ కర్జన్ భారతదేశం వైస్రాయిగా ఉన్నప్పుడు మాతృభాషల ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు. 1920 నుండి 1947వరకు వచ్చిన చట్టాలు మాతృభాషలోనే బోధన విద్యావ్యాప్తి పరీక్షల నిర్వహణ జరగాలని స్పష్టం చేశాయి.వాస్తవానికి ఆంగ్లేయుల కాలంలో ప్రాథమిక విద్య అంటే? ఒకటి నుంచి అయిదవ తరగతివరకు మాతృభాషలలోనే విద్యాభ్యాసం కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం చాలా వరకు మాతృభాషా మాధ్యమంలోకి వచ్చాం అనుకుంటున్న తరుణంలో మళ్లీ ఆంగ్ల మాధ్యమంలోకి కూరుకొని పోయాం. గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మేధావులతో కూడిన కమిటీలు కూడా మాతృభాష ల్లోనే విద్యాబోధన జరగాలని సూచించాయి. రష్యా,జర్మనీ, జపాన్ వంటి పాశ్చాత్య దేశాలు వైజ్ఞానికంగా నేడు అభివృద్ధి చెందడానికి వారివారి మాతృభాషలే బోధనా భాషలుగా ఉండడమే కారణం అన్నారు. 1854లో సర్ ఛార్లెస్ ఉడ్‌అనే ఉన్నతాధికారి ఎడ్యుకేషన్ డిస్‌పాచ్ (విద్యాపత్రం) ద్వారా భారత సమాజంలోని మధ్య తరగతి ప్రజలలో విద్యావ్యాప్తి జరగాలంటే మాతృభాషలలోనేవిద్యా బోధన జరగాలి అని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి సూచిం చారు. భారతదేశంలోని మాతృభాషలు బలమైన పునాదులపై



నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

వృద్ధిచెంది వికాసం పొందితేనే గానీ సామాజికంగాఅభివృద్ధి సాధింపజాలమని ఆనాడే తెలిపాడు.1964–66లో కొఠారి విద్యాకమిషన్ ఉన్నత పాఠశాలస్థాయి దాకా మాతృ భాషలోనే విద్యాబోధన జరగాలని సూచించింది.భారత రాజ్యాంగంలోని అధికరణం–350 ఎ ప్రకారం త్రిభాషా సూత్రం అమలులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య వరకు అంటే పది,పదకొండు వరకు తెలుగు మాధ్యమంలో బోధన ఉండేది. పదకొండేళ్లు ఉన్నత విద్యను హెచ్‌ఎస్‌సి (హైయ్యర్ సెకండరీ స్కూల్) అనేవారు. ఆ తరువాత ఒక యేడాది పియూసి (ప్రి యూనివర్సిటీ కోర్సు) ఉండేది. ఇది ఇంగ్లీషు మీడియంలో కొనసాగేది. 1967లో ఆనాటి రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు చేసిన నిర్ణయంమేరకు ప్రభుత్వం చేత 1969లో ఇంటర్మీడియేట్ రెండేళ్ల కోర్సు ప్రవేశపెట్టబడింది. అప్పుడు ఉన్నత పాఠశాలవిద్య మునుపటి పదకొండేళ్లు కాకుండా పదేళ్లకు తగించబడింది. దానిని ఎస్.ఎస్.సి (సెకండరీ స్కూల్ సర్టిఫికేట్) అంటున్నారు. ఇంటర్మీడియేట్ స్థాయిలో బోధనాభాషగా తెలుగుమాధ్యమం ప్రవేశపెట్టబడింది.ఆ తరువాత డిగ్రీస్థాయి విద్య తెలుగు మీడియంలో కొనసాగింది. ఇంటర్మీడియేట్, డిగ్రీస్థాయి చదువుకు కావలసిన తెలుగు మీడియంలోని పాఠ్యపుస్తకాల తయారీ కోసం1969ప్రాంతంలో ప్రభుత్వం తెలుగు అకాడమీని ఏర్పాటు చేసింది. విశ్వవిద్యాలయ స్థాయిలో స్నాతకోత్తర కోర్సుల బోధన మాతృభాషలోనికి రాలేదు. యు.జి.సి (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) వారి పరిధిలోకి వచ్చే కోర్సులివి. కాబట్టి యుజిసి వారు ఈ విషయంలో అంటే బోధనా భాషా విషయంలో నిర్ణయాధికారాన్ని ఆయా విశ్వవిద్యాలయాలకే వదిలివేసినా,ఈవిషయంలో ప్రభుత్వంచొరవ చూపలేదు. పూర్వం నిజాంకాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మెడిసన్, ఇంజినీరింగ్ వంటి వృత్తి విద్యాకోర్సులు సైతం ఉర్దూమీడియంలో జరిగేవి. ఇందుకు తగిన పాఠ్య పుస్తకాలు కూడా ఆమీడియం భాషలోనే ఉండేవి. ప్రాథమిక స్థాయినుంచే పిల్లలు తమమాతృభాషపై ప్రత్యేక దృష్టిసారించడంవల్ల వాళ్ల ఆలోచనాపరిధి మరింత విస్తృతమవుతుందని శాస్త్రీయంగా నిరూపించబడినట్లు నూతన విద్యావిధానం (ఎన్ఇపి–2020)నొక్కివక్కాణించింది. ఒకప్పుడు పరిమిత ప్రయోజనం కలిగిన భాష నేడు బోధనా భాషగా పాలనా భాషగా,పత్రికా భాషగా వినియోగంలోకి వచ్చింది. శాస్త్ర,సాంకేతికాది రంగాలలో భాషావినియోగం పెరిగినప్పుడు నూతన పద పరికల్పన పారిభాషిక పదసృష్టి అవసరం పెరుగుతున్నది. అప్పుడు భాష మరింతగా సుసంపన్నమవుతుంది. సమాజాభివృద్ధికి కొత్తకొత్త ప్రణాళికలు రూపొందించినట్లుగానే భాషల అభివృద్ధికి కూడా ప్రణాళికా రచన అనివార్యం.1905లో లార్డ్ కర్జన్ బెంగాల్ విభజన చేసినప్పుడు ఎదురైన ప్రతిఘటన ఆంధ్రలోభాషోద్యమంగా,జాతీయోద్యమంగా రూపుదాల్చింది. 1911వ సంవత్సరంలో బెంగాల్ మళ్లీ ఒకటి కావడానికి మూలసూత్రం ప్రజల భాషా ప్రాతిపదికే.మన తెలుగురాష్ట్రంలో 1911లో ప్రథమాంధ్ర గ్రంథాలయ మహాసభలు,1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ, 1921లో 'ఆంధ్ర జనసంఘం, స్థాపన, 1900లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం,1943లో 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటివి ఏర్పాటుకావడానికి భాషోద్యమాలే ప్రధానకారణం.మాతృభాషలను పరిరక్షించుకోవడానికిప్రజలు ఉద్యమించడమేకాదు, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రజల భాషను కాపాడడానికి తగు చర్యలు చేపట్టాలి. ●

# ‘సర్’ విధులకు న్యాయాధికారులు



## కోల్‌కతా హైకోర్టుకు సుప్రీం సూచన

### బెంగాల్ సర్కార్ - ఇసి విభేదాలు దురదృష్టకరం

### 28న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు అనుమతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సజావుగా కొనసాగించేందుకు పర్యవేక్షించడానికి పదవీ విరమణ చేసిన న్యాయ అధికారులతో పాటు, సేవలందిస్తున్న వారిని నియమించాలని కోల్‌కతా హైకోర్టును సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం (ఇసి) మధ్య “విశ్వాస లోటు“ ఎస్ఐఆర్ ప్రక్రియను కీలకమైన దశలో నిలిపివేసిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్యా బాగ్చి, విపిన్ పంచోలిలతో కూడిన ధర్మాసనం గమనించింది. “ఇద్దరు రాజ్యాంగ కార్యకర్తల మధ్య విశ్వాసం లోటును చూపించే ఆరోపణలు, ప్రతిఆరోపణల దురదృష్టకరం“ అని సుప్రీం కోర్టు పేర్కొంది. “తార్కిక వ్యత్యాస జాబితా“ కింద నోటీసులు అందుకున్న వేలాది మంది ఓటర్లు ఇప్పటికే తమను ఓటర్ల జాబితాలో చేర్చడానికి మద్దతు ఇచ్చే పత్రాలను సమర్పించారని పేర్కొంటూ, సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వాదనలకు ఇప్పుడు న్యాయమైన తీర్పు అవసరమని నొక్కి చెప్పింది. “అసాధారణ పరిస్థితుల“ దృష్ట్యా, న్యాయబద్ధంగా సవరణ ప్రక్రియ పూర్తి కావడానికి న్యాయవ్యవస్థను చేర్చుకోవడం తప్ప వేరే మార్గం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. జిల్లాల అంతటా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల పరిష్కారానికి, పునఃపరిశీలనకు సహాయం చేయడానికి అదనపు జిల్లా న్యాయమూర్తి లేదా జిల్లా న్యాయమూర్తి హోదాలో ఉన్న పదవీ విరమణ చేసిన అధికారులతో పాటు, పనిచేస్తున్న న్యాయ అధికారులను కూడా విడిచిపెట్టాలని కోలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది. “సమర్పించిన పత్రాల వాస్తవికతను నిర్ధారించడంలో, తత్ఫలితంగా ఓటరు జాబితాలో చేర్చడం లేదా తొలగించడం వంటి వాటిపై న్యాయబద్ధతను నిర్ధారించడానికి, కొంతమంది మాజీ న్యాయ అధికారులతో పాటు కొంతమంది పనిచేస్తున్న న్యాయ అధికారులను నియమించాలని సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశం ప్రకారం, ప్రతి న్యాయ అధికారికి ఇసిఐ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నియమించిన అధికారులు సహాయం చేస్తారు. ఇప్పటికే పూర్తయిన వ్యాయామంలో భాగంగా ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితాను ప్రచురించడానికి కూడా సుప్రీంకోర్టు అనుమతించింది. ఆ తర్వాత ఇసిఐ అనుబంధ ఓటర్ల జాబితాలను ప్రచురించడానికి అనుమతించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు ఎదుర్కొంటున్న బెదిరింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అనుబంధ అఫిడవిట్ దాఖలు చేయాలని పశ్చిమ బెంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)ని కోరింది. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, మేనకా గురుస్వామి వాదనలు వినిపించగా, ఇసిఐ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదించారు.

# భారత్‌కు వీసా సేవలు పునరుద్ధరించిన బంగ్లా

### రెండు దేశాల మధ్య రెండు నెలలుగా నిలిచిన వీసాల జారీ



**ఢాకా, ఫిబ్రవరి 20:** బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తారిఖ్ రహమాన్ ఇండియాకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు భారతీయులకు జారీ చేసే వీసా సేవల్ని పునరుద్ధరించారు. ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో ఈ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. రెండు దేశాల మధ్య వీసాల జారీ రెండు నెలలక్రితం నిలిచిపోయింది. మూడు నెలల క్రితం బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగాయి. ఇండియాలో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లా డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. దీంతో గత ఏడాది డిసెంబర్ నుంచి రెండు దేశాల మధ్య రాయబార కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా రెండు దేశాల మధ్య వీసాల జారీ ఆగిపోయింది. ఇటు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో, అటు ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో వీసాల జారీ నిలిచిపోయింది. అయితే, తాజాగా బంగ్లా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తారిఖ్ రహమాన్ మూడు రోజుల్లోనే ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూలంగా స్పందించాడు. వీసాలు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో ఢిల్లీలో శుక్రవారం ఉదయం నుంచి బంగ్లా రాయబార కార్యాలయంలో అన్ని రకాల వీసాల మంజూరు సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఢాకాలో కూడా బంగ్లా నుంచి ఇండియాకు వచ్చేందుకు వీసాల సేవల్ని పునరుద్ధరిస్తామని అనిరుద్ధా దాస్ అనే బంగ్లాలోని భారత రాయబార కార్యాలయ అధికారి తెలిపారు. మెడికల్, టూరిజం వంటి అన్ని రకాల వీసా సేవలు అందుబాటులోకి వస్తాయి. బంగ్లాలో తారిక్ ప్రమాణ స్వీకారానికి ఇండియా నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. తాజాగా తారిక్ ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నాడు. దీంతో త్వరలో రెండు దేశాల మధ్య సంబంధాలు తిరిగి మెరుగవుతాయని విశ్లేషకుల అంచనా.



# పరువునష్టంకేసులో కోర్టుకు హాజరైన రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పరువు నష్టం కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరయ్యారు. గతంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు గాను పరువు నష్టం దావా వేశారు. తన స్టేట్‌మెంట్‌ను కోర్టులో నమోదు చేయడం కోసం ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి ఉదయం వచ్చి నేరుగా విచారణ కోసం సుల్తాన్‌పూర్ వెళ్లారు. పరువు నష్టం కేసులో కోర్టు విచారణ కోసం రాహుల్ గాంధీ సుల్తానాబాద్ వచ్చారని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ వెల్లడించారు. విచారణ కోసం వచ్చిన రాహుల్ గాంధీ, కోర్టు పని పూర్తి కాగానే ఢిల్లీకి తిరిగి వెళతారని తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు సుల్తాన్‌పూర్‌లో సత్యమేవ జయతే అంటూ రాసిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో అమిత్ షాపై రాహుల్ గాంధీ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. 2024 జులై 26న కూడా రాహుల్ గాంధీ తన వాంగ్మూలాన్ని కోర్టులో నమోదు చేశారు. తనపై రాజకీయ కుట్రలో భాగంగా పరువు నష్టం దావా వేశారని ఆరోపించారు. ఈ క్రమంలో ఆధారాలను సమర్పించాలని ఫిర్యాదుదారు విజయ్ మిశ్రాను కోర్టు నాడు ఆదేశించింది.

# సునీత యాత్ర.. ‘కల్పనా చావ్లా’ తరహా

## ప్రాణాంతక వైఫల్యమే

### నాసా సంచలన నివేదిక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ వారం రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. అనివార్య కారణాల వల్ల నెలల పాటు గడిచింది. యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూసిన ఆ రోదసియాత్రపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ ‘ప్రాణాంతక వైఫల్యమేనని’ అంగీకరించింది. దానిని ‘టైప్-ఎ’ ప్రమాదంగా అభివర్ణించింది. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మ్యాన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని వెల్లడించారు. ‘2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు’ అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రొటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను టైప్-ఎ వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్లయ్యింది. ఏమిటీ టైప్-ఎ ప్రమాదం? ఈ మిషన్‌ను నాసా ‘టైప్-ఎ’ ప్రమాదంగా ప్రకటించడం ఎయిరోస్పేస్ ఇండస్ట్రీని షాక్‌క గురిచేసింది. సాధారణంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లకు దీన్ని పేర్కొంటారు. 2003లో జరిగిన కొలంబియా షటిల్ డిజాస్టర్‌ను ‘టైప్-ఎ’ ప్రమాదంగా పిలుస్తారు. ఆ ప్రమాదంలోనే భారత అమెరికన్ వ్యోమగామి కల్పనాచావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో ఆ విషాదం చోటుచేసుకుంది. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక ‘స్టార్‌లైనర్’లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది.

# గోడవెనుక రహస్య కేంద్రం

### రూ.100 కోట్ల నగదు, నగలు, డాక్యుమెంట్లు సీజ్

### కన్హా గ్రూప్‌పై ఐటి దాడుల్లో విస్తుపోయే నిజాలు




**జైపూర్, ఫిబ్రవరి 20:** ఆగంతకులనుంచి వచ్చిన సమాచారం ఆధారంతో ఆదాయపు పన్నుశాఖ అధికారులు లక్నోలో ఒక మనీలాండరింగ్‌కేసును ఛేదించారు. ఐటి ఇన్‌స్పెక్టర్ అమయ్‌పట్నాయక్ ఆ ఇంట్లోని గోడల్లో బ్లాక్ మనీ, బంగారం దాచినట్లు గుర్తించారు. ఫాల్స్‌సీలింగ్స్‌లోను, నేలమాళిగ తరహాలో ఈ రహస్య కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. బాలివుడ్ చిత్రం రైడ్ తరహాలో ఉన్న ఈ రహస్య గనినిచూసి అధికారులు విస్తుపోయారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక వ్యాపారి ఇంట్లోనే ఒక రహస్య గోడను గుర్తించి దాని వెనుక ఒకస్ట్రాంగ్‌రూమ్‌ను కూడా వెలుగులోకి తెచ్చారు. ఈ స్ట్రాంగ్‌రూమ్ నిండా కోట్లాదిరూపాయల విలువైన బంగారు ఆభరణాలున్నాయి. గడచిన మూడురోజులుగా రాజస్థాన్‌లోని కన్హా గ్రూప్ వాణిజ్య సంస్థలపై దాడులు కొనసాగిస్తున్నారు. ఐటి అధికారులు మరింతగా నగదు, బంగారం, ఇతర కీలక పత్రాలను కూడా స్వాధీనంచేసుకున్నారు. భారీ ఎత్తున పన్ను ఎగవేతకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఐటిశాఖ మొత్తం మూడు నగరాల్లోని 33 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులుచేసారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభించిన ఈ ఆపరేషన్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. జైపూర్‌లోనే 26 ప్రాంతాల్లో తనిఖీలుచేసారు. ఉదయ్‌పూర్, శ్రీగంగానగర్, కోట, కరౌలి, హిండౌన్, ముంబయిలలోకూడా దాడులుజరిగాయి. కన్హా గ్రూపును 2008లో నట్వర్‌లాల్ శార్దా స్థాపించారు. జైపూర్‌కేంద్రంగా ఆహార శీతలపానీయాలకంపెనీగా పేరుంది. మిఠాయిలు, నమ్‌కీన్‌లు, బేకరీ ఉత్పత్తులకు పేరు. కాగా తాజాగా జరిపిన దాడుల్లో 50 లక్షల నగదు లభించింది. పది బ్యాంకు లాకర్లు, బంగారం మొత్తం రూ.100 కోట్ల విలువ కలిగిన నగదు, నగలు, ముఖ్యపత్రాలు స్వాధీనంచేసుకున్నారు.

# నటుడు రణవీర్‌సింగ్‌కు బిష్ణోయ్‌గ్యాంగ్ బెదరింపులు

### రూ.10 కోట్లు ఇవ్వకుంటే సిబ్బందిని చంపేస్తామని హెచ్చరికలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ రూ.10 కోట్లు ఇవ్వాలంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి మరోసారి బెదిరింపులు వచ్చాయి. అమెరికాలో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ నుంచి రణ్‌వీర్ సింగ్ మేనేజర్ వాట్సాప్ ఖాతాకు బెదిరింపు వాయిస్ నోట్ వచ్చింది. దీనిపై ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ ప్రముఖులకు ఇటీవల వరుస బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది. తనను తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి బాలీవుడ్ ప్రముఖులకు ఈ బెదిరింపు సందేశం పంపించాడు. తాను కోరినంత డబ్బులు ఇవ్వాలని లేదంటే సిబ్బందిని హత్య చేస్తానని బెదిరించాడు. మీ మేనేజర్ నుంచి మీ వద్ద పని చేసే ప్రతి ఒక్కరి వివరాలు మాకు తెలుసని, వారు తమ కుటుంబాలతో ఎక్కడ నివసిస్తున్నారో కూడా తెలుసని, వాళ్లకు ఏమీ కాకముందే మీరు డిమాండ్లకు అంగీకరించాలని ఆ వాయిస్ నోట్‌లో పేర్కొన్నాడు. ఇంతకుముందు నటుడు రోహిత్ శెట్టి ఇంటి వెలుపుల ముగ్గురు వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు శుభమ్ లోంకర్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదివరకు నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వెలుపల కాల్పులకు పాల్పడిన ఘటనలోనూ లోంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# సంక్షిప్తంగా..

## ఢిల్లీలో మరో ‘లేడీ డాన్’..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశ రాజధాని ఢిల్లీలో మరో ‘లేడీ డాన్’ వ్యవహారం వెలుగు చూసింది. పగలు బ్యూటీ పార్లర్ నడుపుతూ సాదాసీదాగా కనిపించే ఆమె రాత్రిపూట భారీ డ్రగ్ సిండికేట్‌ను శాసిస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా కోసం పనిచేస్తోన్న లేడీ డాన్ ఖుస్నుమా అన్సారి అలియాస్ నేహను ఢిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టి ఆమె ఆట కట్టించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఢిల్లీలోని మహిపాల్‌పుర్ ఫ్లైఓవర్ ప్రాంతంలో పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసు దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు ‘మేడమ్ జహర్’ పదం వినిపించింది. దీంతో తీగ లాగితే ఈ లేడీ డాన్ వ్యవహారం బయటపడింది. ఈశాన్య ఢిల్లీలో బ్యూటీపార్లర్ నడిపే ఖుస్నుమానే ఈ మేడమ్ జహర్ అని పోలీసులు గుర్తించారు.

## కర్ణాటక సిఎంపై పిటిషన్ వేసిన సామాజిక కార్యకర్త అరెస్ట్




**బెంగళూరు, ఫిబ్రవరి 18:** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపు కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై పిటిషన్ దాఖలు చేసి వాదించిన సామాజిక కార్యకర్త చిక్కుల్లో పడ్డాడు. స్నేహమయి కృష్ణను బెంగళూరు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్ట్ కారణాలు తెలియలేదు. సిద్ధ రామయ్య, ఆయన భార్య పార్వతి, కొంతమంది సహచరులు మైసూరులోని నివాస స్థలాల కేటాయింపులో అవకతవకలకు పాల్పడినట్లు కృష్ణ ఆరోపించాడు. కేసారే గ్రామంలో వివాదాస్పద భూమికి బదులుగా పరిహార ప్లాట్లను పార్వతికి కేటాయించడం, ఆ భూమి హక్కు చట్టబద్ధతను అతడు ప్రశ్నించాడు. ఈ కేయింపుల వల్ల రాష్ట్ర ఖజానాకు ఆర్థిక నష్టం కలిగించిందని ఫిర్యాదు చేశాడు.

## ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు డొనాల్డ్ ట్రంప్ పేరు!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరు మారనుంది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ త్వరలోనే దీనిపై సంతకం చేయనున్నారు. తర్వాత ఈ విమానాశ్రయం పేరు మార్పునకు ఫెడరల్ ఏవియేషన్ ఆమోదం కూడా అవసరం. ట్రంప్ నివాసం ‘మార్ ఎ లాగో’కు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతం ఇసుక బీచ్‌లు, లగ్జరీ ఎస్టేట్‌లకు ప్రసిద్ధి. స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న ట్రంప్‌నకు.. ఆయన పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక భవనాలున్నాయి. అయితే, అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలకు తన పేరు ఉండాలని భావిస్తున్న ట్రంప్.. ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

## జబల్‌పూర్ దుర్గామాత ఆలయంపై దాడి!



**జబల్‌పూర్, ఫిబ్రవరి 20:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న దుర్గామాత ఆలయం పై గురువారం రాత్రి దాడి జరిగింది. దుర్గాపూజ జరుగుతున్న సమయంలో ఆ గుడిపై కొందరు అటాక్ చేశారు. సిహోరా ఆజాద్ చౌక్‌లో ఉన్న ఆలయం గ్రిల్‌ను ఓ వ్యక్తి విరగొట్టాడు. ఆ తర్వాత గుడిని ధ్వంసం చేశారు. మరో వర్గానికి చెందిన వ్యక్తులు రాళ్లు రువ్వారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గుడి గ్రిల్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిని చితకబాదారు. స్థానిక పోలీసులు, సీనియర్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.గుంపులను చెదరగొట్టే ప్రయత్నంలో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. గుడిలో పూజ జరుగుతున్న సమయంలోనే సమీపంలో ఉన్న మసీదు లౌడ్‌స్పీకర్ నుంచి నమాజ్ వచ్చినట్లు తెలిసింది. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది.



# సిఎం స్టాలిన్‌ను కలిసిన పన్నీర్ సెల్వమ్

**చెన్నై, ఫిబ్రవరి 20:** తమిళనాడులో ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో రోజురోజుకీ ఆ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారిపోతోంది. ఇప్పటివరకు డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ద్విముఖ పోరు మాత్రమే ఉండేది. ఇప్పుడు సినీ నటుడు విజయ్ రాజకీయ ఆరంగేట్రంతో ఈ పోరు త్రిముఖ పోటీగా మారింది. తాజాగా మరో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంను అన్నాడీఎంకే నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఈరోజు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ ను పన్నీర్ సెల్వం కలిశారు. స్టాలిన్, పన్నీర్ సెల్వం కలయిక తమిళనాట సంచలనం రేపుతోంది. డీఎంకేలోకి పన్నీర్ సెల్వం చేరికకు సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. దీనికి సంబంధించే వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. ఈ చర్చల్లో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, పన్నీర్ సెల్వం కుమారుడు కూడా పాల్గొన్నారు. ఇప్పటికే డీఎంకే నేతృత్వంలోని కూటమిలో దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే చేరిన విషయం గమనార్హం. మరోవైపు, వీరి సమావేశం జరిగిన తర్వాత అన్నాడీఎంకే ఎమ్మెల్యే అయ్యప్పన్ అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టాలిన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# డీగోగార్షియాకోసం ట్రంప్ తహతహ

### అయితే ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంచిన బ్రిటన్

**లండన్, ఫిబ్రవరి 20:** అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఈ వారాంతంలో ఇరాన్ పై అమెరికా దాడి చేయనుందనే ప్రచారం జరుగుతోంది. ఇరాన్ సమీపంలోకి అమెరికా భారీ సంఖ్యలో యుద్ధ విమానాలను తరలించడం ఈ ప్రచారానికి ఊతమిస్తోంది. ఈ నేపథ్యంలో బ్రిటన్ కు చెందిన చాగోస్ దీవుల్లోని డియెగో గార్సియా సైనిక స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమతి కోరారు. ఇరాన్ పై దాడి చేయాల్సి వస్తే డియెగో గార్సియా స్థావరం అత్యంత కీలకమని ట్రంప్ భావిస్తున్నారు. అంతర్జాతీయ చట్టాలు మరియు ఇతర కారణాల దృష్ట్యా ఈ స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి బ్రిటన్ ఇంకా అనుమతి ఇవ్వలేదు. స్టార్మర్ తీరుతో విసిగిపోయిన ట్రంప్ చాగోస్ దీవుల విషయంలో మాటమార్చారు. వాస్తవానికి ఈ దీవిని 99 ఏళ్ల పాటు మారిషస్ కు అప్పగించాలని బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నంలో ఉంది. రెండు వారాల క్రితం ఈ డీల్ ను ట్రంప్ మెచ్చుకున్నారు. తాజాగా ఈ డీల్ అత్యంత చెత్త ప్రయత్నమంటూ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రధాని స్టార్మర్ ఏ కారణం చేతనైనా డియెగో గార్సియాపై పట్టు కోల్పోకూడదు. ఈ భూమిని యూకే నుండి వేరు చేయకూడదని అన్నారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ కూడా ఈ విషయంలో ట్రంప్ తాజా పోస్ట్ ను అమెరికా స్టాండ్ గా భావించాలని స్పష్టతనిచ్చింది. యూకే ప్రభుత్వం ఏమంటోందంటే కోర్టు తీర్పుల వల్ల దీవులపై తమ చట్టపరమైన హక్కులకు విఘాతం కలిగే అవకాశం ఉందని, అందుకే ఈ ఒప్పందం ద్వారానే సైనిక స్థావరం యొక్క భవిష్యత్తును కాపాడుకోగలమని యూకే విదేశాంగ శాఖ చెబుతోంది. ఈ ఒప్పందం ప్రకారం, 99 ఏళ్ల పాటు డియెగో గార్సియా రక్షణ మరియు భద్రతా బాధ్యతలను మారిషస్ బ్రిటన్‌కు అప్పగిస్తుంది. ప్రస్తుతం బ్రిటన్ పార్లమెంటులో ఈ ఒప్పందానికి సంబంధించిన బిల్లు ఇంకా ఆమోదం పొందాల్సి ఉంది.

# ఆరు ఈకామర్స్ సంస్థలకు సిసిపిఎ నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశంలో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ జామర్లు, ఇతర వైర్‌లెస్ పరికరాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఆరు ఈకామర్స్ సంస్థలకు కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా డ్రోన్ జామర్లు, జీపీఎస్ జామర్లు, యాంటీడ్రోన్ సిస్టమ్స్ వంటి నిషేధిత పరికరాలను విక్రయించడంపై సీసీపీఏ తీవ్రంగా స్పందించింది. ఎవర్‌సే, ఇండియామార్ట్, ఎక్స్ బూమ్, జావియట్ ఏరో స్పేస్, ఎయిర్‌వన్ రోబోటిక్స్, మావెరిక్ డ్రోన్స్ టెక్నాలజీస్ ఉన్నాయి. వినియోగదారుల పరిరక్షణ చట్టం2019తో పాటు, టెలికాం, వాణిజ్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

# గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా : ట్రంప్



**న్యూయార్క్, ఫిబ్రవరి 20:** అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారం ఉన్న ప్రభుత్వ ఫైళ్ల గుర్తించి, విడుదల చేయాలని ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గ్రహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఎ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏమిటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గత వారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం ‘ఏరియా 51’లో యుఎస్ ప్రభుత్వం నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంత వరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవని అన్నారు.

# మేడారం జాతరకు అంతర్జాతీయ వారసత్వ గుర్తింపునకు కృషి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
## జాతరపై కాఫీ టేబుల్ పుస్తకం ఆవిష్కరణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఆదివాసుల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రపంచ వరల్డ్ హెరిటేజ్ కట్టడంగా రామప్ప దేవాలయానికి గుర్తింపు దక్కడం తెలంగాణకు గర్వకారణమని, ఆ గుర్తింపు సాధనలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అదే విధంగా లివింగ్ హెరిటేజ్ విభాగంలో ఇప్పటికే బెంగాల్‌లో దుర్గాపూజ, దీపావాళి పండుగలకు హెరిటేజ్ హోదా లభించిన నేపథ్యంలో మేడారం జాతరకు కూడా అంతర్జాతీయ వారసత్వ గుర్తింపు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అ దిశగా ప్రభుత్వం తో చరిత్రకారులు, సామాజికవేత్తలు, అనుభవజ్ఞులు, అంత్రో పాలజిస్టులు కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో శుక్రవారం మేడారం జాతర కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మల వీర గాథ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని, ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీర వనితలను భావి తరతరాలు స్మరించుకుంటాయన్నారు. ప్రతి పండుగ ప్రత్యేకత కలిగి ఉన్నప్పటికీ మేడారం జాతర తన ప్రత్యేక వైభవంతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. కోయ జాతి బిడ్డగా మేడారం చరిత్రలో భాగస్వామ్యం కావడం తనకు గర్వకారణమని తెలిపారు. మేడారం జాతర అరుదైన చిత్రాలను సంకలనం చేసి కాఫీ టేబుల్ బుక్ రూపంలో తీసుకువచ్చిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ పుస్తకంలోని ప్రతీ చిత్రం ఒక చరిత్రను ప్రతిబింబిస్తోందని, ప్రపంచ పటంలో మేడారాన్ని నిలబెట్టిన ఫోటోగ్రాఫర్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జాతర వైభవాన్ని పుస్తకంలోని ఫోటోలు సజీవంగా ఆవిష్కరించాయని ప్రశంసించారు. కాకతీయ హెరిటేజ్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లను మంత్రి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు కాఫీ టేబుల్ బుక్ ఎడిటర్ బి. నర్సింగ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బి.వి. పాపారావు, బి.పి. ఆచార్య, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎం. రతన్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ట్రస్టీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, జె. శ్రీధర్‌రావు తదితరులు హాజయ్యారు.

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

### బాగ్‌లింగంపల్లి గోదాములో ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాజీ పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతీ బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా పౌరసరఫరాలశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్-అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ మాట్లాడారు. పని వాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసమే తమ బలమని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలని, రేషన్ బియ్యం నాణ్యత విషయంలో చిన్న తప్పిదాన్ని కూడా సహించమని పునరుద్ఘాటించారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయిఅరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి బకాయి బిల్లులను చెల్లించండి

## సర్పంచ్‌ల సంఘం జెఏసి వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ కోరారు. ఈ విషయమై శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాజాగా తెలంగాణకు కేంద్రం నుంచి రూ.387 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని, వాటిని గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు వినియోగించాలని ఆదేశించిందన్నారు. మాజీ సర్పంచ్‌లకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను ఆయన కోరారు. గుంటి మధుసూదన్‌రెడ్డి, రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య, సముద్రాల రమేష్, నెక్కొండ రవి పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై సర్కారు ప్రత్యేక దృష్టి

## గురుకులాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు, చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గురుకుల విద్యార్థులకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించ దానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేయాలని స్పష్టం చేసింది. జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా, సంబంధిత అన్ని విభాగాలకు వాటిని అందజే యాలని స్పష్టం చేసింది.

నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.



# ఐఎస్ 374:2019 ప్రమాణాలపై విజయవంతంగా రెండు రోజుల కోర్సు

## బిఐఎస్ హైదరాబాద్ విభాగం నిర్వహణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఐఎస్ 374:2019 ప్రమాణాలపై రెండు రోజుల క్యాప్సూల్ కోర్సును బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ విభాగం విజయవంతంగా నిర్వహించింది. శిక్షణలో తయారీదారులు, లైసెన్సుదారులు, దరఖాస్తుదారులు, నాణ్యత నియం త్రణ సిబ్బందితోపాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొ న్నారు. వారికి ఎలక్ట్రిక్ సీలింగ్ టైప్ ఫ్యాన్లు, రెగ్యులేటర్ల స్పెసిఫికేషన్ (నాలుగో సవరణ)పై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 19 నుంచి 20 వరకు శిక్షణ విజయవంతంగా కొనసాగింది. మొదటి రోజు శిక్షణార్థులు జీనోమ్ వ్యాలీలోని విమ్టా ల్యాబ్స్‌ను సందర్శించారు. అక్కడ ఐఎస్ 374:2019కు సంబంధించిన పరీక్షా విధానాలు, ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రిక్ సీలింగ్ ఫ్యాన్లు, రెగ్యులేటర్లకు సంబంధించిన వివిధ పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించారు. రెండోరోజు బీఐఎస్ హైదరాబాద్‌శాఖ కార్యాల యంలో బీఐ ఎస్ అధికారులు సమగ్ర సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఐఎస్ 374:2019 ప్రమాణాల వివరాలు, పరీక్షా విధానాలు, మార్కింగ్ అవసరాలు, సర్టిఫికేషన్ ప్రక్రియలు, నాణ్యత నియంత్రణ చర్యలపై విపులంగా వివరించారు. కార్యక్రమ ముగింపులో నిర్వహించిన ప్రశ్నోత్తర సమా వేశంలో తమ సందేహాలను శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు నివృత్తి చేసుకున్నారు. ఈ క్యాప్సూల్ కోర్స్ శిక్షణ తీసుకున్న వారిలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతోపాటు భారతీయ ప్రమాణాల అమలులో మరింత మెరుగైన అవగాహన కలుగుతుందని అధికారులు తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

# ఎన్నికల హామీ ప్రకారం బిసిలకు బడ్జెట్ కేటాయించాలి

## బిసి నేతల డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు కా ంగ్రెస్ పార్టీ బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బిసిలు శుక్రవారం గన్‌పార్కులో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రెండేళ్లుగా కేటాయించాల్సిన బడ్జెట్ 55 వేల కోట్లు కేటాయించాలని, బిసిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి మోసం చేసిందని ఆరోపించారు. సబ్‌ప్లాన్ అమలుపై బిసి ప్రజా ప్రతినిధులు నోరువిప్పకపోవడం సిగ్గుచేటని, చేతగాక పోతే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని తీన్మార్ మల్లన్న చెప్పారు. గత రెండేళ్లలో బడ్జెట్‌లో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.



గన్‌పార్కులో ధర్నా చేస్తున్న బిసిలు. చిత్రంలో తీన్మార్ మల్లన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర సత్యనారాయణ, గుజ్జ సత్యం తదితరులు

ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావే శాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ బిసి సబ్ ప్లాన్‌పై ప్రభుత్వం తన అభిప్రాయాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ మేధావులు ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, టిజెఏసి వైస్-చైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిసి నేతలు, కార్యకర్తలు అసెంబ్లీని ముట్టడిం చడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డు కోవడంతో రోడ్డుపైన బైఠాయించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టే ఆనాటి రోజులు తేవడమేనా మీరు చెప్పిన మార్పు..? అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు. నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేని లక్షలాది మంది రైతులు ఏ విధంగా యాప్‌ను వినియోగిస్తారన్న కనీస సోయి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. షాపుల్లో అమ్మాల్సిన యూరియాను, యాపుల్లో ఇస్తామని ఆర్భాటం చేసిన రేవంత్ రెడ్డి.. ఈ రైతు ఆక్రందన మీకు వినిపిస్తుందా..అని ప్రశ్నిస్తూ యూరియా కోసం ఓ రైతు పడుతున్న ఆందోళనకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారుర. గుండెలు మండి ప్రభుత్వంపై తిరగబడుతున్న అన్నదాత రోధన అర్థమవుతుందా..? అని నిలదీశారు. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరిదీ ఇదే పరిస్థితి అని పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల పట్ల ఇంత కర్కషంగా, కఠినంగా వ్యవహరిస్తున్న తీరును యావత్ తెలంగాణ సమాజం గమనిస్తున్నదని అన్నారు. యూరియా యాప్‌ను రద్దు చేసి, పాత విధానంలో, ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతాంగం పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే యూరియా కష్టాలు భరించని రైతులు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌ను ముట్టడించే రోజులు వస్తాయని హెచ్చరించారు.

# డిగ్రీ, పిజిల్లో కొత్త కోర్సులు

## 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు.. నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రానున్న విద్యా సంవత్సరం 2026-27లో డిగ్రీతోపాటు పీజీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీలో కొన్ని పీజీలో కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. డిగ్రీలో కొత్త కోర్సులుగా బీఏ(ఒక కోర్సుగా) డిఫెన్స్, సెక్యూరిటీ, పొలిటికల్ సైన్స్‌ను ప్రారంభించ నున్నారు. బీకాంలో 4 కోర్సులను ప్రారంభించనున్నారు. ఫిన్‌టెక్- బిజినెస్ ఇంటెలిజెన్స్ అండ్ ఎనలిటిక్స్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎకౌంట్స్, డిజిటల్ మార్కెటింగ్. బీబీఏలో 3 కోర్సులు ప్రారంభిస్తారు. ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్స్, ఏరోస్పేస్ మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్. ఇక బీఎస్సీలో మల్టీ మీడియా డిజైన్ అండ్ యానిమేషన్‌తోపాటు ఫుడ్ సెక్యూరిటీ, ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ రెండు కోర్సులను ప్రారంభించనున్నారు. ఇక పీజీలో... ఎంఏలో ఏవియేషన్ మేనేజ్‌మెంట్, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ రెండు కోర్సులను ప్రారం భించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రైవేటు కళాశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులను మార్చి 10 వరకు స్వీకరించనుంది.

# ఎస్ఐఆర్‌కు సన్నాహాలు ముమ్మరం

## ఎఇఆర్ఒలకు సిఇఒ సుదర్శన్‌రెడ్డి శిక్షణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్‌చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు (ఏఈఆర్‌ఓలు) ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు. మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు.

అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

# బడ్జెట్‌లో బిసిలకు అన్యాయంపై 27న నిరాహార దీక్ష

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బడ్జెట్‌లో బిసిలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 27న వేలాది మందితో ఇందిరా పార్కు ఎదుట నిరాహారదీక్ష నిర్వహిస్తున్నామని బిసి మేధావుల ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్ రాజ్‌గౌడ్, పలువురు బిసి నేతలు నిరాహారదీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, నిరాహారదీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయంచకుండా తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిసిలకు బడ్జెట్‌లో 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, కొత్తగా నియమించబోయే 40 కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లలో బిసిల జనాభా ప్రకారం ఛైర్మన్‌లను నియమించాలని, లేకపోతే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో బిసిలకు అవకాశం కల్పించాలని కోరుతూ ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు లేఖలు రాయడం జరిగిందని చెప్పారు. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలను బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎదగనీయకుండా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయరంగాల్లో అణిచి వేస్తున్నాయని ధ్వజమెత్తారు.

## అప్పులు తెచ్చి సాగుచేసిన వైనం
## 23న కేబినెట్ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం

### యాసంగి సాగు ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా..

# రైతు భరోసా కోసం తప్పని అన్నదాతల నిరీక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** యాసంగి (రబి) సీజన్ రైతు భరోసా కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా యాసంగి సిజన్ నాట్లు పూర్తయ్యాయి. విత్తనాలు, నాట్లు, పురుగుమందులు, ఎరువుల కోసం రైతులు అప్పులు తెచ్చి సాగు చేశారు. ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేస్తే ఆ డబ్బుతో అప్పులు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. ఏటా రాష్ట్రంలో యాసంగి సీజన్ డిసెంబర్ మూడోవారంతో ప్రారంభవుతుంది. సీజన్ ముందు డిసెంబరు చివరి వారం లేదా జనవరి మొదటివారంలో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా ప్రస్తుతం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.6వేల పంట పెట్టుబడిసాయం పంపిణీ జరగడంలేదు. తొలుత సంక్రాంతి పండగకు రైతు భరోసా నిధులు పంపిణీ అవుతాయని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు నెరవేరలేదు.

ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు పంపిణీ చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. ఈ రబి సీజన్‌లో వరి నాట్లు, ఇతర పంటలు సాగు చేసి దాదాపు రెండు నెలలు దాటింది. అత్యధిక విస్తీర్ణంలో సాగైన వరి పంట కొన్ని ప్రాంతాల్లో పొట్టదశకు కూడా వచ్చింది. మందులు, ఎరువుల కోసం రైతులు వ్యాపారుల వద్ద అప్పులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. యేడాదిలో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు మొత్తం రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారమే వానాకాలం పంటలకు సాయం మంజూరు చేసింది. రబీ సీజన్‌కు ముందు అంటే డిసెంబరు నెలలోనే రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తే విత్తన, కూలీ ఖర్చులకు చాలా వెసులుబాటు కలిగేది.

కానీ ఫిబ్రవరి మూడోవారం గడుస్తున్నా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం ఊహించని విధంగా కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చింది. శాటిలైట్ సర్వే (సింథటిక్ ఎపర్చర్ రాడార్ టెక్నాలజీతో శాటిలైట్ మ్యాపింగ్ సర్వే) ఆధారంగా కేవలం సాగుచేసిన భూములకే సాయం అందజేయనున్నట్టు ప్రకటించింది. అయితే శాటిలైట్ సర్వే పూర్తయినప్పటికీ రైతు భరోసా నిధుల పంపిణీకి మాత్రం మోక్షం కలగలేదు. కాగా ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనున్న నేపథ్యంలో రైతు భరోసా విడుదలపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుభరోసా నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం తెలుస్తోంది. 23న జరిగే కేబినెట్ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా పంపిణీ చేయడానికి దాదాపు రూ.9,000 కోట్లు అవసరమని ఆర్థిక శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి సాగుకు రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సాయం అందిస్తోందని ప్రభుత్వం చెబుతోంది.

# కూరగాయల సాగులో నూతన పరిశోధనలు

## ఆ ఫలితాలతో అధిక దిగుబడులు
## జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు, నిపుణులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా చేపడుతున్న ముమ్మర పరి శోధనలు, ఆవిష్కరణలతో కూరగాయ పంటల్లో అధిక దిగుబడులు సాధ్యమవుతున్నాయని, నూతన పరిశోధనా ఫలితాలను అన్నదాతలకు అధికారులు ఎప్పటికప్పుడు చేరవేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పిలుపు నిచ్చా రు. ఈ మేరకు హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా కూరగాయల పంటలపై అఖిలభారత సమ న్వయ పథకం 44వ వార్షిక సమావేశం జరుగుతోంది. తొలిరోజు శుక్రవారం జరుగుతున్న 300 మంది శాస్త్రవేత్తలు పలు పరిశోధన అంశాలు పంచుకు న్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కొరతగా ఉన్న కూరగాయల సమస్యను పరిష్కరించడానికి 908కిపైగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో ఎనిమిది వందలకుపైగా రైతులను ఉత్తమ కూరగాయల సాగు వలంటీర్లుగా రైతులను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకున్న రైతులతో ఇతరులకు శిక్షణ కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రైతుల ఆదాయం రెండింతలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రైతులకు అందుబాటులో మార్కెటింగ్ వ్యవస్థను తీసుకొస్తామని, అలాగే ప్రత్యేకించి కూరగాయల ఉత్పాదకతను పెంచడానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తామన్నారు.

దేశంలో ఉద్యానరంగం ప్రాముఖ్యత రోజు పెరగడం సానుకూల పరిణామమని, ఉద్యాన పంటల విలువ సాలిన 7.6 లక్షల కోట్లుగా ఉందని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే అన్నారు. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి, వినియోగం నెలకు 11 కిలోల నుండి 9 కిలోలకు తగ్గిందని, అదేసమయంలో ఉద్యాన ఉత్పత్తుల వినియోగం ఐదు కిలోల నుండి 9.7 కిలోలకి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

గతంలో మూడు లక్షల ఎకరాల్లో ఉన్న కూరగాయ సాగు లక్ష ఎకరాలకు పడిపోయిందని, వెంటనే మరో రెండింతల మేర ఈ విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉందని ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ డి. రాజిరెడ్డి అన్నారు. రెండు నెలల్లో రాష్ట్రంలో ఉన్న 400 రైతు ఉత్పత్తి కంపెనీ సభ్యులకు కూరగాయ ఉత్పత్తిలో మేలైన శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదిక, ఉద్యానవర్సిటీ వార్షిక నివేదిక, బెండ, బీరలో డ్రోన్ పరిశో ధనపై రచనలను విడుదల చేశారు. కార్యక్రమంలో బెంగళూరులోని ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, ఎన్‌బీపీజీఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపిసింగ్, మాజీ వీసీ డాక్టర్ లవండి, ఎన్ఐఆర్‌సి ఏ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, పరి శోధన సంచాలకులు లక్ష్మీనారాయణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనితకుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశవ్యాప్తంగా కూరగాయల్లో పరిశోధన చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సిఎం కప్‌తో మంత్రి వాకిటి శ్రీహరి, క్రీడాకారులు

# గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన సిఎం కప్ ఫైనల్స్

### పోటీలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2వ ఎడిషన్ ముఖ్యమంత్రి కప్–2025 ఫైనల్స్ పోటీలు శుక్రవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖమంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవిలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన 21,500మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. శుక్రవారం ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీల్లో మొత్తం 44 విభాగాల్లో క్రీడాకారులు పోటీపడనున్నారు. ఫైనల్స్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతో ముఖ్యమంత్రి కప్ పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా మార్గదర్శనం చేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశ్యమని అన్నారు. ఈ సంవత్సరం సీఎం కప్ పోటీల కోసం మొత్తం 5.15లక్షల మంది నమోదు చేసుకున్నారని అన్నారు. అందులో మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి 21,500మందిని ఫైనల్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఫైనల్స్‌లో గెలుపొందిన క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం కల్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, క్రీడాకారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# హిందీ ఏ భాషకూ ప్రత్యామ్నాయం కాదు

### జాతీయ ఐక్యతకు బలమైన వారిధి

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** హిందీ ఏ భాషకు ప్రత్యామ్నాయం కాదని, భారతీయుల పరస్పర అవగాహన, సహకారానికి ఒక సాధనంగా నిలుస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. జాతీయ ఐక్యతకు బలమైన వారధిగా నిలిచిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ భావనను సాకారం చేసే శక్తివంతమైన సాధనంగా హిందీ భాష మారిందన్నారు. భాష అడ్డంకిగా కాకుండా వారధిగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. మాతృభాషలో పొందిన జ్ఞానం లోతుగా, నిలకడగా ఉంటుందని, అదే సమయంలో ఇతర భాషలు మనల్ని ప్రపంచంతో అనుసంధానం చేస్తాయని తెలిపారు. త్రిపుర రాష్ట్రంలోని అగర్తలలోని ఇంటర్నేషనల్ ఇండోర్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన పూర్వ ఈశాన్య, ఉత్తర ప్రాంతాల సంయుక్త ప్రాంతీయ రాజభాషా సదస్సులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తోపాటు సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహో, ఎంపీలు రాజీవ్ భట్టాచార్య, బిప్లవ్ కుమార్ దేవ్, మహారాణి క్రుతి సింగ్‌దేవ్ బర్మన్ తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ పవిత్రమైన, సాంస్కృతిక, సుసంపన్న త్రిపుర భూమిపై జరుగుతున్న పూర్వ ఈశాన్య, ఉత్తర ప్రాంతాల సంయుక్త ప్రాంతీయ రాజభాషా సదస్సులో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# భార్యను చెంపదెబ్బ కొట్టడం క్రూరత్వం కాదు

### గుజరాత్ హైకోర్టు విస్పష్ట తీర్పు

### సెషన్స్‌కోర్టు తీర్పు కొట్టివేత

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 20:** క్రూరత్వ సంఘటనలు కొనసాగినట్లు రుజువు లేకుండా ఒక చెంపదెబ్బ కొట్టడం, వైవాహిక క్రూరత్వం, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి నేరాలకు భర్త శిక్షను నిలబెట్టలేమని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 498ఎ (దిలీప్‌బాయ్ మంగళభాయ్ వర్లి వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్) కింద భర్త తన భార్యను కొట్టిన సంఘటన వైవాహిక క్రూరత్వ నేరంగా పరిగణించకూడదని గుజరాత్ హైకోర్టు తీర్పు చెప్పింది. తన భార్య పట్ల క్రూరంగా ప్రవర్తించి ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు గతంలో దోషిగా తేలిన ఒక వ్యక్తిని నిర్దోషిగా ప్రకటిస్తూ జస్టిస్ గీతా గోపి ఈ వ్యాఖ్యలు చేశారు.వైవాహిక క్రూరత్వ ఆరోపణలను ప్రస్తావిస్తూ, తనకు తెలియజేయకుండా తన తల్లిదండ్రుల ఇంట్లో రాత్రి బస చేసినందుకు భార్యను చెంపదెబ్బ కొట్టిన ఒకే ఒక సంఘటనను నేరపూరిత క్రూరత్వంగా పరిగణించలేమని న్యాయమూర్తి పేర్కొన్నారు.

"తనకు సమాచారం ఇవ్వకుండా తన తల్లిదండ్రుల ఇంట్లో రాత్రి బస చేశాడనే కారణంతో భర్త భార్యను కొట్టిన సంఘటన క్రూరత్వంగా పరిగణించబడదు" అని ఉత్తర్వులో పేర్కొంది.నిరంతరం కొట్టడంపై ఆరోపణలు ఉన్నప్పటికీ, పోలీసులకు లేదా ఏ సమాజ పెద్దల ముందు ముందస్తు ఫిర్యాదు దాఖలు చేయలేదని జస్ట్ గోపి ప్రస్తావించారు. అలా కొట్టడం వల్ల జరిగిన గాయాలకు వైద్య చికిత్సకు సంబంధించిన డాక్యుమెంటరీ రుజువు కూడా లేదు.2003లో వల్సాద్‌లోని సెషన్స్ కోర్టు ఐపిసి సెక్షన్లు 498ఎ (క్రూరత్వం), 306 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) కింద నేరాలకు పాల్పడినందుకు నిందితుడు తనపై విధించిన శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను కోర్టు అనుమతించింది.ఈ కేసు మే 1996 నాటిది. మరణించిన ప్రేమిల అనే మహిళ అప్పీలుదారు దిలీప్‌ను వివాహం చేసుకుని దాదాపు ఏడాదిపాటు సంసారం చేసింది. మే 11, 1996న, ఆమె సరిగం గ్రామంలోని తన భర్త పొలంలో చెట్టుకు వేలాడుతూ కనిపించింది.ప్రేమిల తండ్రి ఫిర్యాదు చేస్తూ దిలీప్ తనను కొట్టి వేధించేవాడని, అలాంటి క్రూరత్వమే ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపించారు. దీని ఆధారంగా, దిలీప్ పై సెక్షన్ 498ఎ, 306 ఐపిసి కింద అభియోగాలు మోపారు. 2003లో, సెషన్స్ కోర్టు అతన్ని దోషిగా నిర్ధారించి, క్రూరత్వానికి పాల్పడినందుకు ఒక సంవత్సరం, ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

# డైలీ వేజెస్ ఉద్యోగుల నియామకంపై నిషేధం

### తాత్కాలిక నియామకాలకు బ్రేక్.. ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో రోజు వారీ వేతనం (డైలీ వేజెస్) ప్రాతిపదికన నియామకాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఏ ప్రభుత్వ సేవలోనైనా తాత్కాలిక నియామకం చేయరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి శుక్రవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. 1994 నాటి తెలంగాణ (ప్రభుత్వ సేవలకు నియామకాల నియంత్రణ, సిబ్బంది విధానం మరియు వేతన నిర్మాణం యొక్క హేతుబద్ధీకరణ) చట్టం2, ప్రకారం ఏ ప్రభుత్వ సేవలోనైనా ఏ వ్యక్తిని ఏ పదవిలోనైనా రోజు వారీ వేతన ఉద్యోగిగా నియమించడాన్ని నిషేధిస్తుందని వెల్లడించింది.

# డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్‌మోడల్‌గా తెలంగాణ

### 'తెలంగాణ రైజింగ్'లో ట్రాన్స్‌ఫార్మేషన్ టూల్‌గా టెక్నాలజీ

### కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సామాన్యుడికి చేరువ చేయాలన్నదే మా తపన

### ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను సామాన్యుడికి చేరువ చేసి డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం ఓ సాఫ్ట్ వేర్‌గా మాత్రమే కాకుండా ఓ ట్రాన్స్ ఫార్మేషన్ టూల్‌గా మార్చుకుంటున్నామన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రణాళికలను న్యూఢిల్లీ భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో భాగంగా శుక్రవారం ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్- ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్ అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటి, ఐకం, ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి లాంటి విప్లవాత్మక సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణ బ్రాండ్‌ను సుస్థిరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను కేవలం ఒక ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయ కుండా అందరికీ చేరువ చేసేలా ఏజెంటిక్ ఏఐ విని యోగంపై ప్రధా నంగా దృష్టి సారించామన్నారు. టెక్నా లజీని కేవలం గవ ర్నెన్స్‌కు మాత్రమే పరిమితం చేయ కుండా వ్యవ సాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర రంగాలకూ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**తెలంగాణ అవకాశాల గని అపారమైన టాలెంట్ పూల్ మా బలం**

తెలంగాణాలో ఏఐ పరిశోధలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్‌గా ఉందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఏఐ సమ్మిట్‌లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అది తీసుకువచ్చే అవకాశాలను అంది పుచ్చుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందే సంసిద్ధమైంది. దానికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ నిపుణుల నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపారమైన అవకాశాలను సృష్టిస్తుందన్నారు.

# నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా ఉమారాణి బాధ్యతల స్వీకరణ

### హాజరైన పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కూరగాయాల ఉమా రాణి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నిజామాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన మేయర్‌ను అభినందించారు. రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు అందరు కలిసి 40 రోజుల్లో మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.2047 విజన్ పేరుతో తెలంగాణ ముందుకు వెడతామని, నీళ్ల నిధులు నియామకాల పేరుతో ఏదైతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందో దాని ప్రకారం ముందుకు వెడతామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని రకాలుగా సహకరించాల్సిన అవసరం ఉంది, ఇక్కడ ఉన్న కేంద్ర మంత్రులు ఎంపీలు అందరూ తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈరోజు ఒక్క ముదిరాజ్ బిడ్డను ఇక్కడ మేయర్ చేశామని, కాంగ్రెస్ పార్టీని ఆదరించిన నిజామాబాద్ నగర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. నిజామాబాద్ ఇన్చార్జిగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకురావాల్సిందిగా కోరుతున్నామని, నిజాంబాద్ అభివృద్ధికి కావలసిన నిధులను రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్,ఎన్నికలు ముగిసినందున ఇక అన్ని పార్టీలు కలిసి పార్టీలకు అతీతంగా నిజామాబాద్ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూనూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్‌లందరికీ అభినందనలు తెలిపారు. బిజెపి ఎంపీ అరవింద్ కులం పేరుతో మతాల పేరుతో మాట్లాడడం బంద్ చేయండి, ఇప్పుడైనా నిజాంబాద్ అభివృద్ధి తోడ్పడాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

# పోలీసు భద్రత, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శి గోపాల్‌రెడ్డి మృతి

### డిజిపి శివధర్‌రెడ్డి సంతాపం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శి విశ్రాంత ఐపిఎస్ అధికారి గోపాల్ రెడ్డి (80) శుక్రవారం మరణించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గచ్చిబౌలిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వి డిచారు. పోలీసు శాఖలో ఎస్ఐగా చేరి ఎస్‌పి వరకు ఎదిగి ఐపిఎస్ హోదా అందుకున్న తొలితరం అధికారిగా ఆయన పేరు గడించారు, పదవీవి రమణ చేశాక 20 ఏళ్లుగా పోలీసు భద్రత, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. ఆయన హయాంలో పోలీసు భద్రత, ఆరోగ్య భద్రత ఎంతో పురోగతి సాధించింది.



గోపాల్‌రెడ్డి

కాగా గోపాల్ రెడ్డి మృతి పట్ల డిజిపి శివధర్ రెడ్డి సంతాపం తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం గోపాల్ రెడ్డి ఎనలేని సేవలు చేశారని డిజిపి కొనియాడారు.

# ఆయిల్ పామ్‌తో రైతాంగానికి మహర్దశ

### 1.25 లక్షల ఎకరాలకు రూ.456 కోట్లు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పామాయిల్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ పడుతోందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కామారెడ్డి జిల్లా పాల్వంచమర్రి లో శుక్రవారం నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందన్నారు. ఈ పంట రైతుల కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉందని, తమ ప్రభుత్వ హయంలో ఇప్పటివరకు 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో దీన్ని సాగును చేపట్టారని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రూ.456 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో 2 ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లాలో త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు.

ఈ పంట 30 నుంచి 40 సంవత్స రాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, డ్రిప్ సౌకర్యాల నిమిత్తం ఎకరాకు రూ.51 వేల సబ్సిడీ అందచేస్తామని తెలిపారు.

**సాంకేతికత ఆధారంగా సంస్కరణలు**

**ఎఐ మోడలింగ్ ద్వారా విశ్లేషణ : మంత్రి తుమ్మల**

భవిష్యత్తులో సాంకేతికత ఆధారిత వ్యవసాయ సంస్కరణల అమలులో రాష్ట్రం ముందుండి నాయకత్వం వహిస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

వ్యవ సాయానికి సాం కేతికతను జోడించడంలో రాష్ట్రం ఎప్పుడూ ముందుం టుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఏఐ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ సాంకేతికత ఈ సమ్మిట్‌లో ప్రస్తావన రావడం రాష్ట్రానికి గౌరవని పేర్కొన్నారు.

వ్యవ సాయరంగంలో సాంకేతికత ఆధారిత సంస్కరణలు వేగంగా అమలవుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ రంగంలో పలు సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. రైతులకు సమయానికి ఎరువులు అందించేందుకు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ప్రవేశపెట్టడం ద్వారా బ్లాక్ మార్కెటింగ్, అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు.

# ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలు, ప్రత్యేక శిక్షణకు చర్యలు

### కానిస్టేబుల్ సౌమ్య బలిదానం వృథా పోనివ్వం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి20:** మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ... డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోంది.. ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయి. తలిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాలి. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే మన లక్ష్యం కావాలి అని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు.స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉంది. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తాం అని జూపల్లి ప్రకటించారు.అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అభినందించారు.

# అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరడా

### రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక దాడులు

### భారీగా వాహనాలు, యంత్రాలు సీజ్, 19 మంది అరెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అక్రమ ఇసుక తవ్వకాలపై తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్‌విభాగం కొరఢా ఝుళిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు వరుస ఆకస్మిక దాడులు నిర్వహించింది. గురు, శుక్రవారాల్లో జగిత్యాల, హనుమకొండ, నిజామాబాద్ జిల్లాల్లో జరిపిన దాడులు భారీ స్థాయిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా నెట్‌వర్క్‌లను విజయవంతంగా అడ్డుకున్నాయి. దాడుల్లో పెద్ద సంఖ్యలో యంత్రాలు, భారీ వాహనాలను అధికారులు సీజ్ చేశారు. కరీంనగర్, వరంగల్, ఆర్.సి.పురంకు చెందిన విజిలెన్స్ బృందాలు 3 జిల్లాలు, 5 మండలాల్లో విస్తరించి ఉన్న కీలక ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాయి.

జగిత్యాలలోని బొమ్మెన గ్రామం, హనుమకొండలోని కక్కిరాలపల్లి ఎక్స్ రోడ్డు ఆకేరువాగు, నిజామాబాద్‌లోని సిరికొండ ప్రాంతాల్లో దాడులు జరిగాయి. అక్రమ ఇసుక తవ్వకాలు, ఇసుక రవాణా కోసం ఉపయోగిస్తున్న మొత్తం 24 వాహనా లను సీజ్ చేశారు. ఇందులో 6 ఎక్స్‌వ వేటర్లు, 2 లారీలు, 1 టిప్పర్, 15 ట్రాక్టర్లు ఉన్నాయి.చట్టవిరుద్ధంగా తవ్విన సుమారు 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న 30 మంది నిందితులను గుర్తించి వారిలో 19 మందిని అరెస్టు చేశారు.

అక్రమార్కులు అక్రమ ఇసుక దందాను పకడ్బంధీగా ఆకేరువాగు, దొండ్ల వాగు వంటి నదీ గర్భాల నుంచి నిశ్శబ్దంగా ఇసుకను తవ్వి, తాత్కాలికంగా నిల్వ చేయడానికి సమీపంలోని ప్రైవేట్ వ్యవసాయ భూములు లేదా పొలాలకు తరలించారు.చీకటి పడిన తర్వాత అధికారులకు పట్టుబడకుండా ఉండేందుకు, చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన ఇసుకను పెద్ద లారీలు, టిప్పర్‌లలో వేగంగా లోడ్ చేయడానికి భారీ జేసీబీలను ఉపయోగించారు.

దాడుల్లో పట్టుబడిన వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే అధికారులకు సమాచారం అందించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పిలుపునిచ్చింది. సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14,432 ద్వారాఅందజేయాలని సూచించింది.

# హైదరాబాద్ వేదికగా..

## ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ బోర్డ్ సమావేశాలు

### తెలంగాణ ద్వారా తొలిసారి భారత్ ఆతిధ్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**తెలంగాణ విత్తన రంగానికి మరో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విత్తన ప్రమాణాలను నిర్దేశించే ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ (ఇస్టా) బోర్డ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాలు హైదరాబాద్ వేదికగా జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ చరిత్రలోనే తొలిసారిగా భారత్ ఆతిథ్యం ఇస్తుండటం విశేషం. ఈ సమావేశం ఏర్పాట్లు, ప్రాధాన్యత తదితర అంశాలపై సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ బోర్డ్ అధ్యక్షులు తెలంగాణకు చెందిన డాక్టర్ కె కేశవుల నేతృత్వంలోని బోర్డు సభ్యుల బృందం రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్‌లతో భేటీ అయినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా రాష్ట్రంలో విత్తన రంగ అభివృద్ధి, అంతర్జాతీయ ఎగుమతులు, నాణ్యతా ప్రమాణాల పెంపుతో పాటు, తెలంగాణను గ్లోబల్ సీడ్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఇందులో చర్చించినట్లు కేశవులు ఆ ప్రకటనలో వెల్లడించారు.


# డిగ్రీ లెక్చరర్ల నియామకంలో రాత పరీక్షకు 40 శాతం మార్కులే

### ప్రత్యేకంగా జిఓఎంఎస్ నం. 4 జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ లెక్చరర్స్(అసిస్టెంట్ ప్రొఫెసర్స్) నియామకం కోసం ఇకపై రాత పరీక్షకు 40 శాతం మార్కులను పరిగణనలోకి తీసుకోనున్నారు. 50 శాతం మార్కులను అభ్యర్థి విద్యార్హతలకు కేటాయించనుండగా.. మరో 10 శాతం మార్కులను ఇంటర్వ్యూలకు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలైన గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాల నియామకానికే ఇంటర్వ్యూలను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని డిగ్రీ లెక్చరర్ల నియామకంలో ఇంటర్వ్యూలను కొనసాగించడం కోసం ప్రత్యేకంగా జీవో ఎంఎస్ నంబర్ 4ను జారీ చేసింది. గతంలో డిగ్రీ లెక్చరర్ల నియామకాలను చేపట్టిన విధంగా కాకుండా.. కొత్తగా నియామకాలను చేపట్టడం కోసం జీవో ఎంఎస్ నంబర్ 4 ద్వారా మార్గదర్శకాలను జారీ చేసింది. నియామకాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) చేపట్టనుంది. ఇప్పటి వరకు డిగ్రీ లెక్చరర్స్ నియామకం కోసం రాతపరీక్షకు 90 శాతం మార్కులను కేటాయించగా 10 శాతం మార్కులను ఇంటర్వ్యూకు కేటాయించారు. కానీ ఇపుడు కొత్త మార్గదర్శకాల ప్రకారం 100 శాతం మార్కుల్లో 50 శాతం విద్యార్హతలకు కేటాయించగా.. రాత పరీక్షకు కేవలం 40 శాతం కేటాయించారు.

మరో 10 శాతం మార్కులను ఇంటర్వ్యూకు కేటాయించారు. జీవో ఎంఎస్ నంబర్ 4 ప్రకారం.. ఎంపిక ప్రక్రియను మూడు భాగాలుగా విభజించారు. అభ్యర్థుల మెరిట్‌ను 100 మార్కులకు లెక్కగట్టి ఫైనల్ సెలక్షన్ చేస్తారు. అభ్యర్థి విద్యార్హతలకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. సబ్జెక్టు నైపుణ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించే రాత పరీక్షకు 40 శాతం వెయిటేజీ ఉంటుంది. వ్యక్తిగత ఇంటర్వ్యూకు 10శాతం మార్కులు కేటాయించారు. టీజీపీఎస్సీ నిర్వహించే ఈ రాత పరీక్షలో 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షలో క్వాలిఫై కావాలంటే ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 40 శాతం, బీసీలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30 శాతం కనీస మార్కులు రావాల్సి ఉంటుంది. 90 శాతం మార్కులను ఆధారంగా మెరిట్‌ను బట్టి 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో వచ్చిన మార్కులు 40 శాతం వెయిటేజీ, అకడమిక్ స్కోర్ 50 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ 10 శాతం మార్కులను కలిపి రిజ ర్వేషన్ల ప్రకారం సబ్జెక్టుల వారీగా తుది జాబితాను ప్రకటిస్తారు.

# బిట్‌కాయిన్ కేసులో రాజ్‌కుంద్రాకు బెయిల్ మంజూరు



**ముంబయి, ఫిబ్రవరి 20:** బిజినెస్ మాన్ రాజ్‌కుంద్రాకు మనీలాండరింగ్ నిరోధక చట్టం పరిధిలో దాఖలయిన కేసులో బెయిల్ మంజూరు అయింది. బిట్‌కాయిన్ లింక్ అయిన 6606కోట్ల కేసులో ఈడీ నమోదుచేసిన కేసుకు సంబంధించి బెయిల్ ఇచ్చింది. న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని తానేమీ తప్పులు చేయలేదని, ఇపుడు కోర్టు ఉత్తర్తులు బెయిల్ మంజూరుతో తనకు ఉపశమనం లభించిందని చట్టపరమైన విధానానికి తాను లోబడి నడుచుకుంటానన్నారు. ఛార్జిషీట్‌లో ఎలాంటి ఆధారాలు చూపించలేక పోయారని అందువల్లనే తాము బెయిల్‌కు దరఖాస్తు చేసామన్నారు. 2018 నుంచి రాజ్‌కుంద్రా ఈడీ ముందు హాజరవుతున్నారు. ఈడీ అధికారులకు సహకరించడంలేదన్న విమర్శలను ఆయన కొట్టివేసారు. ఇడి కోరినప్పుడల్లా వారిముందు విచారణకు హాజరయ్యానని కుంద్రా న్యాయవాది చెప్పారు. అలాగేకోర్టు ఇపుడు లక్ష రూపాయలు పూచీకత్తుపై బెయిల్‌మంజూరుచేసిన ప్రత్యేక కోర్టు విదేశాలకు వెళ్లేందుకు ముందుగాకోర్టు అనుమతిని పొందాలనిసూచించారు.

# బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర విభజనకు ముందు ఎపిలో 65 ప్రాంతాల్లో, విభజనానంతరం 3 చోట్ల పురావస్తు శాఖ తవ్వకాలు
- శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బదులిచ్చిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- తెలంగాణలో ఉన్న ఎపి పురావస్తు సంపద రప్పించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడి



విజయవాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో 65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధాన ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్ లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 2014-15, 2015-16లో జరిపిన తవ్వకాల్లో కాకినాడ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు, 8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 2017-18లో తవ్వకాలు జరపగా క్రీ.పూ. 1000-300 నాటి ప్రాచీన మానవుడి సమాధులు (మెగాలిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. తద్వారా ప్రాచీన మానవుడి కాలంనాటి సంస్కృతి, అనుసరించిన విధానాలు గుర్తించామన్నారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురావస్తు శాఖ ఎక్స్ కవేషన్ బడ్జెట్‌లో నుండి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా ఉన్న ఎపి పురావస్తు సంపదను తీసుకురావాలని, రాష్ట్ర విభజనకు ముందు జరిపిన తవ్వకాల నివేదికను రాష్ట్ర ప్రజల ముందుంచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మంత్రి దుర్గేష్‌ను కోరారు. తెలంగాణలో ఉండిపోయిన ఎపి పురావస్తు సంపదను తిరిగి రప్పించే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగాయని, హైదరాబాద్‌లో ఒకసారి సమావేశం కూడా జరిగినట్లు వివరణనిచ్చారు. త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దీనిని పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. పురావస్తు శాఖలో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు.

ఎపిలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక అంశాలపై మండలి బుద్ధప్రసాద్‌కు ఉన్న శ్రద్ధను, మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిని అభినందించారు. కేంద్రం నుండి నిధుల సాధన కోసం తామంతా కలిసి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## మండలిలో వైసిపి సభ్యుల ప్రవర్తన బాధాకరం

### - ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

సచివాలయం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శాసనమండలిలో శుక్రవారం జరిగిన సంఘటనలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించేవిగా, హిందూ సమాజాన్ని గాయపరిచేవిగా ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మీడియా పాయింట్ వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం, ప్రత్యక్ష దైవంగా భావించే వెంకటేశ్వరస్వామి ఫోటోలను ప్లకార్డులుగా పట్టుకొని, చెప్పులు వేసుకొని సభలోకి వచ్చి అవమానపరిచే రీతిలో ప్రవర్తించిన వైసిపి సభ్యులు తీరు క్షమించరానిదన్నారు. ప్రతిపక్షనేతగానో, మంత్రిగానో కాకుండా ముందుగా భారత పౌరుడిగా, హిందూ సమాజం నేర్పిన సంస్కృతి సాంప్రదాయాల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా తాను స్పందించానని పయ్యావుల కేశవ్ స్పష్టంచేశారు. కళ్ళముందు వెంకటేశ్వరస్వామి ప్రతిమను లేదా ప్రతి రూపాన్ని అపహాస్యం చేస్తున్న తీరు క్షమించరాని స్పందన, భావన వచ్చిందని, స్పాంటేనియస్‌గా రియాక్ట్ అయ్యానని ఆయన వివరించారు. 30సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నో తీవ్ర మైన సమస్యలు, రాజకీయ వైరుధ్యాలు, ఎత్తుగడలు చూశానని, కానీ ఎక్కడా మతం దేవుడు రాజకీయాల్లోకి రాలేదని, కేవలం రెండు కొండలు చర్చ మాత్రమే 5, 10 నిమిషాలు జరిగిందని, ఆ రోజు ఏం జరిగిందో సమాజం చూసిందని ఆయన గుర్తు చేశారు. రోడ్డు మీద స్వామి ప్రసాదం ఇస్తే చెప్పులు వదిలేసి తీసుకునే సంస్కృతి మనది అని, స్వామి ఫోటోను క్యాలెండర్‌ని కూడా గౌరవంగా తీసుకునే సంస్కృతి మనది అని, అలాంటిది ప్లకార్డు పట్టుకున్నట్లు రోడ్డుమీద తీసుకురావడం, సభలో ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందని మంత్రి అన్నారు. ఇది వైసీపీ లెజిస్లేటివ్ పార్టీ మొత్తంగా చేసిన చర్య అని, పార్టీ ఆదేశాల మేరకు జరిగిందిగా భావిస్తామని, ఒక ఇద్దరు కాదు మొత్తం పార్టీ చేసినప్పుడు జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు జరిగినట్టుగానే భావించాల్సి ఉందని పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

## తిరుమల సమాచారం



## తెప్పోత్సవాలకు పుష్కరిణి సిద్ధం

### - 26 నుండి మలయప్పకు ఉత్సవాలు

### - 23న ప్రయోగాత్మక నిర్వహణ

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలకు స్వామివారి పుష్కరిణిలో తెప్ప సర్వాంగసుందరంగా తయారైంది. ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి ఏర్పాట్లుచేసింది. 26వ తేదీ నుండి మార్చి 2వరకు ఐదురోజులపాటు ఈ తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు 23వ తేదీ సోమవారం సాయంత్రం తెప్ప ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుండి మార్చి 2వరకు పుష్కరిణిలో స్నానాలు కూడా రద్దుచేశారు. ఈనెల 26 గురువారం నుండి ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు 26వతేదీ గురువారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు 27వ తేదీ సాయంత్రం రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడు ప్రదక్షణలు విహరిస్తారు. మూడవరోజు 28వతేదీ, మార్చి 1, 2, తేదీల్లో స్వామివారు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి పుష్కరిణిలో భక్తులకు అనుగ్రహిస్తారు. చివరిరోజు మార్చి 2వతేదీ ఏడు ప్రదక్షణలు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ సందర్భంగా తొలి రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆ తరువాత మూడురోజులు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.



## అంతా మంచి జరగాలని వేడుకున్నాం

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచి జరగాలని ఆకాంక్షించినట్లు పలువురు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామసమయంలో కర్ణాటక హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎఎన్ వేణుగోపాలగౌడ, అపోలో ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సిరెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్‌ఠాగూర్, ప్రభుత్వ సలహాదారుడు ఆర్‌పి ఠాగూర్ కుటుంబాలతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి పథకాలకు రూ.50 లక్షలు విరాళం



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలకు దాత శుక్రవారం రూ.50 లక్షలు విరాళమిచ్చారు. హైదరాబాదకు చెందిన శివకోటి సిద్ధార్థ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు రూ.50లక్షలు చెక్కును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## నకిలీ ఆధార్ కార్డులతో గదుల మోసం...

## ముగ్గురు దళారుల అరెస్ట్



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు భక్తులకు తిరుమలలో గదులు దొరకకపోవడాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ ఆధార్ కార్డులు ఉపయోగించి గదులు పొందుతున్న ముగ్గురు దళారులను తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గదులను నిర్ణయించిన ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు ఆర్జిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తిరుమల టు టౌన్ సిఐ రాముడు తెలిపారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గదులు అధిక ధరకు విక్రయిస్తున్న మహారాష్ట్ర హింగోలి జిల్లాకు చెందిన ప్రసాద్ కేశవరావ్ ఖరోడే (34), కడప జిల్లా బద్వేలుకు చెందిన వందవాసి దినేష్ (27), తెలంగాణ ఖమ్మంకు చెందిన పత్తిపాటి కిశోర్‌కుమార్ (33) పట్టుబడ్డారు. ముద్దాయిలు చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆధార్ కార్డులలో ఫోటోలు, నంబర్లను మొబైల్ ఫోన్ ద్వారా మార్ఫింగ్ చేసి నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసేవారని సిఐ తెలిపారు. ఆ నకిలీ ఆధార్ కార్డులతో సిఆర్ఒ కార్యాలయంలో 50, 100 రూపాయలు గదులు పొంది, ఆ గదులను ఒక్కో గదిని వెయ్యి రూపాయలకు విక్రయించేవారని తెలిపారు. ఇలా ఒకే గదిని రెండు, మూడు సార్లు వేర్వేరు భక్తులకు ఇచ్చి మోసం చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయన్నారు. ఇటీవల వీరి మోసపూరిత కార్యకలాపాలపై పక్కా సమాచారంతో పోలీసులు నిఘా ఉంచి, మరిన్ని నకిలీ ఆధార్ కార్డులతో గదులు పొందేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు గదులు పొందుటకు అధికారిక మార్గాలను మాత్రమే అనుసరించాలని, దళారుల మాయలో పడకూడదని తిరుమల పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్య విలువలపై, దైవభక్తిపై ఏమాత్రం గౌరవంలేని పార్టీ వైసిపి

సచివాలయం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శాసనమండలిలో బలం ఉందని వైసిపి సభ్యులు చేసిన అపచారం, అపవిత్రత హిందూవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. జనసేన పార్టీ తరుపున మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని కాళ్ళకు చెప్పులు వేసుకొని ప్లకార్డులా వాడుతూ సభలోకి తీసుకురావడం చాలా పెద్ద అపచారమని అన్నారు. ఇది వైఎస్ జగన్మోహనరెడ్డి డైరెక్షన్‌తో నడిచిందని స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. హిందువుల మనో భావాలను దెబ్బతీసినందుకు హిందూ జాతికి జగన్మోహనరెడ్డి క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ తరుపున స్పష్టంగా డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే తగిన బుద్ధి చెబుతారని, దీనిపై ఖచ్చితంగా చర్య తీసుకోవాలని చైర్మన్‌ను కూడా కోరుతున్నామని ఆయన తెలిపారు.



## టిటిడిలో మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో మార్చి 9వన నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై తిరుపతిలో శుక్రవారం టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం టిటిడి మహిళా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, స్పీకర్స్ కమిటీ, పర్చేజ్ కమిటీ, కల్చరల్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీల విధులు, బాధ్యతలను తెలియజేశారు. వివిధ రంగాల్లో నిపుణులైన వారిని ఉపన్యాసకులుగా ఆహ్వానించాలని సూచించారు. టిటిడి మహిళా ఉద్యోగులకు అందించే పద్మావతి అవార్డులు ఈ ఏడాది మరిన్ని పెంచాలని, ఇందుకోసం నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా అర్హులైన అన్ని తరగతుల ఉద్యోగులను ఎంపిక చేయాలని అన్నారు. పద్మావతి అమ్మవారి వేద ఆశీర్వచనంతో మహిళా దినోత్సవాన్ని ప్రారంభించాలని, పద్మావతి వైభవం నృత్య కార్యక్రమంతో ముగించాలని చెప్పారు. ఈ సమీక్షలో సంక్షేమ విభాగం డెప్యూటీ ఇఒ ఆనంద రాజు, మహిళా అధికారులు, మహిళా ఉద్యోగుల సంఘం నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైసిపి సభ్యులు రాష్ట్రదైవాన్ని అవమానించారు

### - బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు

సచివాలయం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శాసన మండలిలో వైసిపి సభ్యులు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని చెప్పులు ధరించి ఊరేగింపుగా తీసుకొచ్చి సభలోనికి ప్రవేశించడం హిందూ మనోభావాలను దెబ్బతీసే అత్యంత అవమానకరమైన చర్య అని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీడియా పాయింట్ వద్ద తీవ్రంగా విమర్శించారు. కలియుగ దైవంగా, భారతీయ సంస్కృతికి ప్రతినిధిగా ఉన్న వేంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని షూస్‌తో తీసుకొచ్చి సభలో వాడి, తిరిగి వెళ్లిపోతూ విసిరివేయడం యావత్ హిందూ జాతికి అవమానకరమన్నారు. ఇది వైసిపి నాయకుడు జగన్మోహనరెడ్డి పైనుంచి వచ్చిన డైరెక్షన్ ప్రకారమే జరిగిందని తాము భావిస్తున్నామని సోము వీర్రాజు స్పష్టంచేశారు. జగన్మోహనరెడ్డికి విశ్వాసం ఉంటే చెప్పులతో వెంకటేశ్వరస్వామిని తీసుకొని హౌస్‌లోనికి ఊరేగింపుగా వెళ్ళమన్నారా? అని, దీనికి ఆయన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఆషా మాషిగా వదలకూడదని, ఇలా చేయడం వల్ల రేపు మరిన్ని అలాంటి కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందని, దీనిపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని కోరారు.





## జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పై బిజెపి యువమోర్చా కార్యకర్తలు దాడి

### జిల్లా ఎస్పీ జగదీష్ ని కలిసి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్, సిపిఐ నాయకులు

### ఢిల్లీలో ఏదో జరిగిందని ఇక్కడ దాడి చేయడం ఏంటని ప్రశ్న

అనంతపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై శుక్రవారం సాయంత్రం బీజేవైఎం కార్యకర్తలు చేసిన దాడిని కాంగ్రెస్ జిల్లా నాయకత్వం, సిపిఐ జిల్లా నాయకత్వం తీవ్రంగా ఖండించింది. సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ జగదీష్ ను కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దాదాగాంధీ సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి తదితరులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నాయకులు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ యోగం రాష్ట్ర నాయకులు, శాలిని దాదా గాంధీ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణ స్వామి విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర యువమోర్చ అధ్యక్షుడు సునీల్, ఆయన అనుచరులు కొందరు కలిసి కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేసి, కార్యాలయ ఫ్లెక్సీలను చింపివేసి, తలుపులను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో కార్యాలయానికి ఆస్తి నష్టం కలగడమే కాకుండా, అక్కడ ఉన్న సిబ్బంది, సమీప ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి అన్నారు. దిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం అన్నారు. దాడి సమయంలో బీజేవైఎం కార్యకర్తలు అసభ్య పదజాలంతో దూషణలు చేస్తూ, వ్యక్తిగతంగా బెదిరింపులకు పాల్పడినట్లు పార్టీ నాయకులు తెలిపారు. జిల్లా కార్యాలయాలపై మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరించడం ద్వారా ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్త పరిస్థితులను సృష్టించడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నా, అవి చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య మార్గాల్లోనే వ్యక్తం చేయాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కే చర్యగా నాయకులు అభివర్ణించారు.

ఈ ఘటనపై తక్షణమే కేసు నమోదు చేసి, సంబంధిత సాక్ష్యాలను సేకరించి, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ సంఘటనపై జిల్లాఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రాజకీయ కార్యాలయాలకు తగిన భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, కాంగ్రెస్ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి సంతోష్ కుమార్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర సమన్వయకర్త ఎనుముల నరేష్, ప్రధాన కార్యదర్శి సాయి, జిల్లా అధ్యక్షులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి రద్దీలో డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత సౌకర్యాలు

### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి



తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: రానున్న వేసవి సెలవుల్లో విపరీతంగా ఉండే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు, మూడు సంవత్సరాల వేసవి రద్దీ డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలోపల సుధర్మ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అధికారులతో కలసి రానున్న వేసవి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిసెలవుల్లో తిరుమలలో మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి, వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత వినియోగించుకుని, గంటల వారీగా ఇన్-అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపార్ట్మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని అదనపు ఇఒ వివరించారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, రవాణా జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, వెంకటయ్య, వేంకటేశ్వర్లు, విఎస్ఒ సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

## జిడిసిసి బ్యాంక్ స్కామ్‌లో కొనసాగుతున్న అరెస్టులు

గుంటూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: గుంటూరు డిసిసి బ్యాంక్ నల్లపాడు బ్రాంచ్‌లో నిధుల దుర్వినియోగం కేసులో మరో నింది తుడిని సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది జిడిసిసి బ్యాంక్ స్కామ్ నమోదైన కేసులో వెలిసెల ఏడుకొండలు పదో నింది తుడుగా వున్నాడు. గతంలో నల్ల పాడు జిడిసిసి బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసిన దేవరకొండ అరుణ కుమా రి, అప్పటి సిఈఓ తొర్లికొండ కృష్ణ వేణి, నాటి బ్యాంక్ చైర్‌పర్సన్ రాతం శెట్టి సీతారామాంజనేయులు వురఫ్ లాల్పురం రాము, అప్పటి కమిటీ సభ్యులు యర్రంశెట్టి ఈశ్వర్ ప్రసాద్, నల్లపాటి రామయ్య, కోటా హరి బాబు, వట్టికొండ కోటేశ్వరమ్మ, దూ మావత్. గోవింద నాయక్, వెలిసెల ఏడుకొండలు, కూనిసెట్టి శివ నవీన్, పీటా వెంకటేశ్వరావు కలిసి బ్యాంకులో భారీ మొత్తంలో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ కమిటీ సభ్యులు జిడిసిసి బ్యాంక్ నిబంధనలు, కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకింగ్ నియమాలను ఉల్లంఘిస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల బ్యాంకుకు ఆర్థిక నష్టం జరిగింది. ఈ అవకతవకలపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి డివిజినల్ కోఆపరేటివ్ సొసైటీ విచారణ చేపట్టారు.



## భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకున్న సజ్జనార్ దంపతులు

రాయచోటి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాయచోటి నందు వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని శుక్రవారం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ దంపతులు దర్శించుకున్నారు. రాయచోటి టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారిని దర్శించుకొనేందుకు విచ్చేసిన హైదరాబాద్ సిటీ కమిషనర్ సజ్జనార్ దంపతులకు ఆలయ పురోహితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వీరభద్రస్వామి వారి దర్శన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్, ఈఓ రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



## మార్చి 20న ఉగాది ఆస్థానం

### - విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 20వ తేదీ శుక్రవారం తెలుగు నూతన "పరాభవ నామ సంవత్సర" ఉగాది పర్వదిన ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 20వ తేదీ ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. అలాగే మార్చి 19న విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

### బంగారు వాకిలిలో ఆస్థానం

శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆనంద నిలయానికి ముందు బంగారువాకిలిలో 20వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. స్వామివారి అభిషేకం సేవ నిర్వహించాక ఆ రోజు ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి వారికి, విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు.

ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది.

# ఫ్లోర్ డిజైనర్ వేర్

ఫ్యాషన్ ఫ్యాషన్






ఈవెనింగ్ పార్టీలతో బ్రైట్‌గా వెలిగిపోతుంది. గెటు టు గెదర్ కాన్సెప్టు గెట్ రెడీ అంటుంటాయి. ఇలాంటప్పుడు నలుగురు కలిసే చోట న్యూ లుక్‌తో కనిపించాలని కోరుకుంటుంది నవతరం.

# ఇల్లే ఒక గ్రంథాలయం




ఒక చిన్న ఆలోచన వేలమంది విద్యా ర్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. దాని వెనక ఉన్న పేరు ప్రియాంక గార్గ్. 'వే ఆఫ్ లైఫ్' పేరుతో బుక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి, ఉచితంగా పుస్తకాలను అందిస్తారా.. పేద పిల్లల చదువుల కోసం తన ఇంటినే లైబ్రరీగా మార్చేశారు హరియాణాలోని పరీదాబాద్‌కు చెందిన ప్రియాంక గార్గ్, వృత్తి రీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ మన దేశంలో చాలామంది విద్యార్థుల పాఠశాల స్థాయిలోనే చదువు మానేస్తున్నారు. పుస్తకాలు కొనుక్కునే స్థోమత లేక చదువుకి దూరం అవుతున్న వాళ్లూ చాలామందే. ప్రియాంకాకి కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. తన ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకు పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేవు అని అడిగిందట. నా పిల్లలు పెద్దవాళ్లు, నీ పిల్లలు చిన్నవాళ్లు. ఇద్దరి తరగతులు వేరు. ఆ పుస్తకాలు నా దగ్గర లేవు. బయట కొని తెస్తా అన్నారట. అంతలోనే ప్రియాంక ఉంటున్న హౌసింగ్ సొసైటీ వాట్సాప్ గ్రూప్‌లో ఖిమా ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకు పాఠ్య పుస్తకాలు కావాలి. ఎవరి దగ్గరైనా పుస్తకాలుంటే చెప్పండి అంటూ మెసేజ్ పెట్టారట. అది మొదలు సొసైటీ సభ్యుల నుంచి అలాంటి మెసేజ్‌లు ఇచ్చారట. అది చూసి ప్రియాంక ఇలా బుక్స్ అవసరం అయిన వారందరికీ సాయం చేయాలను కున్నాడు. అందుకే 2018లో 'వే ఆఫ్ లైఫ్' పేరుతో ఉచిత బుక్ బ్యాంక్‌ను ఏర్పాటుచేశారు ఆమె.

**విద్యాదానం చేయమన్నా:** ఈ బుక్ బ్యాంక్ కోసం ప్రియాంక చాలా కష్టపడ్డారు. మొదట్లో తన హౌసింగ్ సొసైటీలో ఇంటిం టికీ తిరిగి పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెరి యల్స్ సేకరించారు. తరవాత నుంచి పాత పుస్తకాలను సేకరించేందుకు నగరంలో ప్రచారాలు చేపట్టి, శిబిరాలను ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా లోనూ వే ఆఫ్ లైఫ్ ప్రాముఖ్యతను వివరిస్తూ పెద్దఎత్తున ప్రచారాలు చేశారు. పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్ అమ్మ కండి వాటిని మాకు అందించి విద్యా దానం చేయమని కోరాను. దాంతో ఎంతోమంది దాతలు పాత పుస్తకాల్ని వే ఆఫ్ లైఫ్ ఆఫీస్‌కి పంపిం చడం మొదలు పెట్టారు. ఢిల్లీ నుంచి ఏటా ఎంతోమంది పాత పుస్తకాలను, మెటీ రియల్స్ ని డొనెట్ చేస్తున్నారు. ఆ విధంగానే ఈ వే ఆఫ్ లైఫ్‌ని పెద్ద బుక్ బ్యాంక్‌గా మార్చగలిగారు. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకూ అన్ని తరగతుల పుస్తకాలు... రైల్వే, ఎస్సై, నీట్, యూపీఎస్సీ వంటి అన్ని పోటీపరీక్షల స్టడీ మెటీరియల్స్ ఇక్కడ ఉన్నాయి. దొరుకుతాయి. పిల్లలకు కథల పుస్తకాలనీ ఉంచాం. మొత్తంగా మా ఇంటినే పుస్తక బ్యాంక్‌గా మార్చేశా అంటున్నారు ప్రియాంక. తల్లిదండ్రులూ వస్తున్నారు.. "నేను బుక్ బ్యాంక్ను మొదలు పెట్టినప్పుడు పేదపిల్లలు మాత్రమే వస్తారనుకున్నా. కానీ ప్రైవేటు స్కూల్స్, ఇంటర్నేషనల్ పాఠశాలల తల్లిదండ్రులూ మా దగ్గరకి వస్తున్నారు. మాకు విదేశాల నుంచీ బుక్స్ కోసం కాల్స్ వస్తున్నాయి. వాళ్లకి పుస్తకాలను పంపాలంటే రవాణా ఛార్జీలను స్పాన్సర్ చేసే దాతలు మాకు కావాలి. అంతేకాదు, పుస్తకాల కొరత వల్ల ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు. ఇదే నా లక్ష్యం. వందమందికి పైగా వాలంటీర్లు దీంట్లో పనిచేస్తున్నారు. ఉచిత పుస్తకాల పంపిణీకి కొన్ని స్వచ్ఛంద సంస్థల తోనూ పని చేస్తున్నాను. దీనికితోడు ప్రభుత్వ సాయం కూడా అందితే బాగుంటుంది అంటారు ప్రియాంక. □

# నైవేద్యం



ఒక విష్ణు భక్తుడు నిరంతరం నారాయణ జపంలో మునిగి తేలుతుంటాడు. ఆ తాదాత్మ్య స్థితికి ఆనందించి.. అతడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు స్వామి. భగవానుడి రాకను ఊహించని భక్తుడు ఆశ్చర్యపోయి, ఆయనకు ఏం సమర్పించాలా అని చుట్టూ చూశాడు. ఒకే ఒక్క అరటిపండు కనిపించగా పరవశించాడు. చిత్రంగా పండును పడేసి, తొక్కను భగవంతుడి నోటికి అందించాడు స్వామి పరమానందంగా తిని, క్షణంలో మాయమయ్యాడు. కొంతసేపటికి తెలివిలోకి వచ్చిన భక్తుడు తన తికమక పనికి చింతిం చాడు. మరోసారి నారాయణుడు ప్రత్యక్షమైతే ఇచ్చేందుకు వందల పండ్లు తెచ్చి, స్వామి కోసం సిద్ధం చేసుకున్నాడు. అతడి భక్తి చూసి, స్వామి ఇంకోసారి దర్శనమిచ్చాడు. ఈ సారి భక్తుడు జాగ్రత్తగా తొక్కను పడేసి, అరటి పండును మాత్రమే నోటికి అందించాడు. స్వామి వెంటనే ఉమ్మేయగా, భక్తుడు విస్తుపోయాడు. ఇంతకుముందు నువ్వు పారవశ్యంలో ఉన్నావు గనుక. తొక్కే అందించినా ఎంతో రుచిగా ఉండి, తినేశాను. కానీ ఇప్పుడు పండు నుంచి తొక్కను వేరుచేసే సాధనలో ఉన్నావే గానీ భక్తి లేదు. వేగంగా తొక్క తీసి, జాగ్రత్తగా అందించగలను అనే అతిశయం వల్ల.. ఇందులో రుచి లేదు. భక్తుడు ఏది ఇస్తున్నాడని కాదు, ఏ భావనతో ఇస్తున్నాడని చూస్తుంటాను. భక్తితో నివేదించింది నీళ్లే అయినా అమృత సమానం. నేను కోరేది ఆడంబరాన్ని కాదు, అచంచల భక్తిని అనేసి అంతర్ధానమయ్యాడు. □

# అరటికాయ కబాబ్



కావలసినవి : అరటికాయ: ఒకటి, సెనగపప్పు: అరకప్పు, చాట్ మసాలా: చిటికెడు, ఆమ్‌చూర్: చిటికెడు, కొత్తిమీర: కొద్దిగా, ధనియాల పొడి: అర టీస్పూన్, జీలకర్ర పొడి: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కారం: పావు టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ముందుగా, అరటికాయను ఉడికించి తొక్క తీసి, ఒక గిన్నెలో వేసి చేత్తో మెదిపి ఉంచాలి. ఉడికించిన సెనగపప్పును కూడా మెత్తగా మెదిపి అందులో వేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా, ఆమ్‌చూర్, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న చిన్న ఉండలు చేసుకుని.. పొడవుగా కానీ, వెడల్పుగా కానీ వత్తుకుని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకుంటే అరటికాయ కబాబ్ రెడీ. వీటిని టమాటా సాస్, పుదీనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి.

# కారం రుచి

ఆరోగ్య భాగ్యం

ఆయుర్వేదంలో దీన్ని 'కటురసం' అని అంటారు. ఇది గాలి, అగ్ని మూలకాలతో కూడి ఉంటుంది. ఇది శరీరానికి వేడి, పొడి, కాంతి లక్షణాల్ని అందిస్తాయి. ఇది కఫాన్ని తగ్గించి, పిత్త, వాతాన్ని పెంచుతుంది. ఇది లాటిన్ పదం నుండి వచ్చింది. కారానినప గర్తించే రుచి మొగ్గలు నాలుక మధ్య భాగంలో ఉండి రుచి మొగ్గల కన్నా సొమాటో సెన్సరీ నర్వ్స్ ద్వారానే గుర్తించబడతాయి. కారానికి దానిలోని రెసిన్స్, కొన్ని రకాల ఆయిల్స్, గ్లైకోసైడ్స్ వల్ల ఘాటైన వాసన, కారం రుచి వస్తుంది. కారానికి కడుపు, గుండె, రక్తం, ప98నరుత్పత్తి అవయవాలపై ప్రభావం ఎక్కువనే చెప్పాలి.

**ఆహార పదార్థాలు :** ఎండు మిరపకాయలు (1నన%) ఎండు కారం (75%), పచ్చిమిర్చి (50%) కారంఘాటుతో ఉంటామి.వేగాకన మిరియాలు, లవంగాలు, ఏలకలు అల్లం, వెల్లుల్లి తులసి, మెంతులు, ఆవాలు, ముల్లంగి, ఉల్లి, పచ్చిబల్చులి, స్ప్రౌట్ బుక్వీల్, టర్నిఫ్, ఇంగువ, దురియన్ పండు వంటి ఆహార పదార్థాల్లో కూడా కారం ఉంటుంది.

**లక్షణాలు :** ఇది ఆహారాన్ని గ్రహించడంలో, ఆహారం, రుచిని మెరుగు పర్చడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది చెమట వంటి వ్యర్థపదార్థాల నిర్మూలనలో సహాయపడు తుంది. ఇది ఆహారం శోషణ ద్వారా ఆహారాన్ని గ్రహించడంలో సహాయం పడుతుంది. సైనస్‌ల్ని క్లియర్ చేసి, రక్తప్రసరణని, స్టిములేట్ చేస్తుంది. ఇది ముక్కు, కంటిలోని స్రావాల్ని పెంచి శుభ్రపరుస్తుంది. ఇది ఇంద్రియ అవయవాల్ని పదును పెడుతుంది. శరీరంలోని టాక్సిన్స్, వాపులు, బనరువుని తగ్గిస్తుంది. దురదలు, ఎలర్జీలు వంటి కొన్ని చర్మవ్యాధుల నుండి కాపాడుతుంది ఇది అల్సర్ల పెరుగుదలని తగ్గిస్తుంది. కడుపులోని క్రిముల్ని చంపుతుంది. శరీరంలోని ఛానెల్స్‌ని క్లియర్ చేస్తుంది. రక్తం స్రావాన్ని తగ్గిస్తుంది. కండరాల కణజాలాన్ని స్క్రాప్ చేస్తుంది. ఇది స్థూలకాయం, శరీరంలోని జిడ్డుదనాన్ని కల్గిస్తుంది ఇది మలవిసర్జనకం మంచిది, అంతే గాకుండా కఫం, కండరాల నొప్పుల్ని తగ్గిస్తుంది. కారం మితంగా తింటే గొంతు నొప్పి, 2వాపు, అజీర్ణం నేత్రరోగాల్ని తగ్గుతాయి. కారం ఎక్కువగా తింటే వేడి, శుక్లనష్టం, బలంతగ్గుతుంది. గొంతు శరీరంలో మంట, దాహం శరీరం, ముందుకు వంగడం మైకం, కష్మదం, స్పృహకోలోనపనవడం, సన్నబడ డం, నపుంసకత్వం, కాళ్ళు, చేతులు, వీపులో వాయు నొప్పులుండడం, వణుకుంచడం, బరువు తగ్గుతారు. నడుం, వెన్నునొప్పి, కుట్టునొప్పి, అలసట, మలబద్ధకం ఉంటుంది. ఇది మూత్ర ప్రవాహానికి ఆటంకం కల్గించడం వల్ల ఆందోళన కోపం, చిరాకు భ్రమల వంటి లక్షణాలు కల్గుతాయి.

**జాగ్రత్తలు :** ఆహారం చివర ఘాటైరనవి తీసుకోవాలి. రక్త స్రావం అయ్యేవారు మంటలు, అధిక జ్వరంతో బాధ పడేవారు పొట్టలో పుండ్లు, అధిక దాహం, ఉన్నవారు, లైంగిక వ్యాధులున్నవారు సన్నగా ఉన్నవారు, మందులు వాడేవారు షుగర్, లివర్ డిసీజెస్ ఉన్నవారు, కాఫీ, టీలు ఎక్కువగా త్రాగేవారు కారం మితంగా తీసుకోవాలి. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# ఆత్మీయ సన్మానం



65 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పనిచేస్తూ, నేటికీ పాత్రికేయ రచనలో నిమగ్నులైన వాశిరాజు ప్రకాశంకు ఇటీవల అగ్ర కథానాయకుడు చిరంజీవి తమ ఇంట్లో అరుదైన ఆత్మీయ సత్కారం చేసారు. వివిధ పత్రికల్లో సేవలు అందిస్తున్న పాత్రికేయులు కన్నులపండువగా జరిగిన ఈ వేడుకకు విచ్చేశారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో వాశిరాజును చిరు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "65 ఏదేళ్లుగా పత్రికలే తమ లక్ష్యంగా, ఎంతో క్రమశిక్షణగా గడుపుతున్నారు వాశిరాజు. ఇన్నేళ్లుగా ఆయనతో నాకు వున్న అనుబంధాన్ని మాటలతో వర్ణించలేను. ఇది తీరని రుణం, బంధం అని చెప్పగలను" అని అన్నారు. అంతేకాకుండా వాశిరాజుతో తనకున్న అరుదైన జ్ఞాపకాలతో మెగాస్టార్ గుర్తు చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా "వందేళ్ల సినిమా చరిత్ర రచన తన లక్ష్యంగా" వున్నట్లు వాశిరాజు తెలిపారు. చిరంజీవి, అనిల్‌రావిపూడి కలయికలో రూపొందిన 'మన వరశంకరప్రసాద్ గారు' సినిమా అఖండ విజయం సాధించిన నేపథ్యంలో సీనియర్ పాత్రికేయులను చిరు సన్మానించారు..


# అంచనాలను పెంచిన 'టాక్సిక్' టీజర్



టాక్సిక్ టీజర్‌తో సరికొత్త సినిమాటిక్ యూనివర్స్‌ను పరిచయం చేసిన రాకింగ్ స్టార్ యశ్..ఇంటెన్సిటీతో అంచనాలను పెంచేస్తోన్న టీజర్2026లో సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న సినిమాల్లో"టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ ఒకటి. పోస్టర్స్, గ్లింప్స్ అంటూ కొన్ని నెలలుగా సినిమా ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తోందో మనం చూస్తూనే ఉన్నాం. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. టాక్సిక్ టీజర్‌ను గమనిస్తే.. ఒక విస్తృతమైన, గొప్పదైన సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది. ఇది ఒక వైపు చూడటానికి రంగుల ప్రపంచంలా కనిపిస్తూనే, హింసాత్మకమైన స్వరూపాన్ని కూడా ప్రదర్శిస్తుంది. ఈ టీజర్లో సినిమాటిక్ తుపాన్ కలకలానికి కేంద్రబిందువుగా రాకింగ్ స్టార్ యశ్ కనిపిస్తున్నారు. ఆయనలో కనిపిస్తున్న మార్పు కేవలం లుక్ మార్చడం మాత్రమే కాదు..పూర్తిగా కొత్త అవతారంలోకి మారినట్టుగా తెలుస్తోంది. సన్నగా, వేగంగా కదిలే శరీరాకృతి నుంచి యుద్ధాలకు సిద్ధమైన బలమైన, దృఢమైన ఆకారానికి మారడం వరకు ఆయన చూపించిన శరీరాకృతి లోని మార్పు ఈ సినిమాకి పెద్ద హైలైట్‌గా నిలుస్తోంది. చిత్రబృందం టీజర్ విడుదల సందర్భంగా "ఇట్స్ గాన్ గెట్ క్రేజీ" అంటూ ఒక ఉత్కంఠభరిత హెచ్చరికను ఇచ్చింది. టీజర్లో కనిపించిన భారీ దృశ్యాలు, భయనకమైన, ఉత్కంఠభరితమైన సీన్స్ చూస్తుంటే 2026 మార్చి 19న రాబోతున్న టాక్సిక్ మూవీపై ఉన్న అంచనాలను మించేలా ఉందనేది తెలుస్తోంది.

# తార

## CULTపవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్,



మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్‌నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో దిగేలిగి తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ సూట్ ధరించి, నోట్లో సిగరెట్‌తో ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. అతని చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలి ఉండగా, అతడు వేసే ప్రతి అడుగుతో రక్తం వ్యాపిస్తూ పోస్టర్‌కు డార్క్ టోన్‌ను తీసుకొచ్చింది. దిగేలిగితో విశ్వక్‌సేన్ మరో పెద్ద అడుగు వేస్తూ 40 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. తరుణ్ భాస్కర్ డైలాగ్స్ రాస్తుండగా, రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీకి అర్వింద్ విశ్వనాథన్, ఎడిటర్ రవితేజ గిరిజాల, ప్రొడక్షన్ డిజైన్‌కు అర్వింద్ ములే.

# 'బూకి'యూత్‌తో పాటు ఫ్యామిలీ సినిమా. నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి ౣ మంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్ లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది.

**ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

ప్రతి లవ్ స్టోరీ లో కథ ప్రేమతోనే మొదలవుతుంది. కానీ ఈ కథ మాత్రం బ్రేకప్‌తో మొదలవుతుంది.

**తమిళ్ లో ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?**

13న ఈ సినిమా తమిళ్లో రిలీజ్ చాలా అద్భుతంగా అద్భుతంగా వెళుతుంది. నిర్మాతలుగా చాలా హ్యాపీగా ఉన్నాం.

**విజయ్ ఆంటోనీ గారితో అసోసియేషన్ గురించి?**

2012లో నేను తమిళ్ లో బ్యాక్ టు బ్యాక్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండే వాడిని. ఆయన మ్యూజిక్ డైరెక్టర్ గా ఉండే సమయం నుంచి నాకు పరిచయం. ఫస్ట్ హీరోగా చేస్తున్నప్పుడు మా ఆఫీస్ కి వచ్చి హీరోగా పరిచయం అవుతున్నానని చెప్పారు. వారి ఫస్ట్ సినిమా కూడా మేము తెలుగులో రిలీజ్ చేయడం జరిగింది.

**డైరెక్ట్ గా తెలుగులో సినిమాలు చేయాలని ఆలోచన ఉందా?**

నాకు నేరుగా పెద్ద తెలుగు సినిమాలు చేయాలని ఉంది. కానీ దానికి100 టైం కేటాయించాలి. నేను పలు బిజినెస్ లో ఉన్నాను. మా ఫ్యామిలీ చెన్నైలో సెటిల్ అయింది. ఇప్పటికిప్పుడే హైదరాబాద్ షిఫ్ట్ అవ్వడం కుదరదు.

**మీ బ్యానర్ లో వస్తున్న కొత్త ప్రాజెక్టుల గురించి?**

సత్య దేవ్ గారితో ఒక సినిమా పూర్తయింది. అది తొందరలోనే రిలీజ్ చేస్తాం. అలాగే 100 దేవుళ్ళు సినిమా మేలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇంకో కథ చర్చల్లో ఉంది.

# బిత్తరి సత్తి పాడిన 'మింగలేక మంగళారాం' సాంగ్ రిలీజ్



శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం మెన్షన్ హౌస్ మల్లేష్. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై ఈ సినిమా ఫస్ట్ సింగిల్, టీజర్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ మింగలేక మంగళారాం సాంగ్ రిలీజ్ చేశారు. సురేష్ బొబ్బిలి అందరికీ కనెక్ట్ అయ్యే ట్యూన్ ని కంపోజ్ చేశారు. బిత్తిరి సత్తి పెక్యులర్ వోకల్స్ సాంగ్ లో హైలెట్‌గా నిలిచింది. మల్లేష్ క్యారెక్టర్ గురించి ఎంటర్టైనింగ్ చెప్పిన విధానం అలరించింది. తరుణ్ సైదుల్ రిలిక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ అమ్మముత్తు, ఎడిటర్ గ్యారీ బీహీ. మెన్షన్ హౌస్ మల్లేష్ మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తారాగణం: శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల, రాజేష్, మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, సాయి ప్రసన్న, పద్మ నిమ్మనగోటి, హరి రెబెల్.

# 'యస్ ఎల్ వి' నూతన చిత్రం !!



'మా ఊరి ప్రేమకథ' చిత్రంతో హీరోగా పరిచయం అయిన మంజునాథ్.. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ మంచి పేరు, గుర్తింపు తెచ్చు కోవాలని .. వరుసగా సినిమాలు చేస్తూ.. ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు. రౌడీ విక్రమ్ పక్కా ప్రేమికుడు, చిత్రాలు షూటింగ్ చివరి దశలో ఉండగానే మరొక చిత్రానికి శ్రీకారం చుట్టారు.. హీరో మంజునాథ్. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి క్రియేషన్స్ (S L V) పతాకంపై నూతన దర్శకుడు అభిరామ్ గంటా దర్శకత్వంలో టాలెంటెడ్ యాక్టర్ మంజునాథ్ హీరోగా వి. లక్ష్మీ దేవి నిర్మిస్తోన్న ప్రొడక్షన్ నంబర్ వన్ చిత్రం ఫిబ్రవరి 19న హైదరాబాద్ సంస్థ కార్యాలయం లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూ ర్తపు సన్నివేశానికి హీరో మంజునాథ్ క్లాప్ నివ్వగా డీవోపీ శేఖర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సన్నివేశానికి చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ... హీరో మంజునాథ్ మాట్లాడుతూ.. " నేను హీరోగా నటించిన మా ఊరి ప్రేమకథ చిత్రం మంచి హిట్ అయి హీరోగా నాకు మంచి పేరు తెచ్చింది. వెంటనే "రౌడీ విక్రమ్" సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్రం షూటింగ్ చివరి దశలో వుంది. ఇదిలా ఉండగా మరొక చిత్రం "పక్కా ప్రేమికుడు" సినిమా లో కూడా హీరోగా చేస్తున్నాను. ఈ చిత్రం తొంబై శాతం కంప్లీట్ అయింది. ఈ రెండు చిత్రాలు అండర్ ప్రొడక్షన్ లో ఉండగానే మరొక సినిమా చేసే అవకాశం వచ్చింది. చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా మాట్లాడుతూ.. ఫస్ట్ నేను యూట్యూబర్ ని. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్ చేశాను. ఈ సినిమాకి దర్శకత్వం చేసే అవకాశాన్ని ఇచ్చిన మా నిర్మాత లక్ష్మీ దేవి గారికి నా థాంక్స్. చిత్ర నిర్మాత వి. లక్ష్మీ దేవి మాట్లాడుతూ.. " ఈ చిత్రంలో హీరో మంజునాథ్ సరసన ప్రముఖ హీరోయిన్ కథా నాయికగా నటించనుంది.

# సెమీస్ కోసం 8 జట్ల సమరం

## నేటినుంచి సూపర్8 బిగ్‌ఫైట్ * సౌతాఫ్రికాతో భారత్ తొలిపోరు

ఆహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్ సమరం సూపర్-8కు చేరుకుంది. జింబాబ్వే సంచలన విజయాలతో సూపర్8కు చేరుకోగా, ఫేవరెట్ జట్లలో ఒకటైన ఆస్ట్రేలియా అనూహ్యంగా ఇంటి దారి పట్టింది. ఈ ఒక్కటి తప్పితే గ్రూప్ స్టేజ్ పెద్దగా సంచలనాలు లేకుండా ముగిసింది. హాట్ ఫేవరేట్ జట్లన్నీ అలవోకగా సూపర్8కు చేరుకున్నాయి. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్, నెదర్లాండ్స్ సంచలన విజయాలు సాధించలేక చతికిలపడ్డాయి. మిగతా క్రికెట్ కూనలు కెనడా, ఇటలీ, ఒమన్, యూఏఈ, ఐర్లాండ్, నేపాల్ లాంటి జట్లన్నీ గ్రూప్ స్టేజ్‌లోనే వెనుదిరిగాయి.

గ్రూప్-ఏ నుంచి హాట్ ఫేవరేట్ టీమిండియా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గింది. పాకిస్థాన్‌తో కలిసి సూపర్8 చేరింది. గ్రూప్-బి నుంచి జింబాబ్వే, శ్రీలంక.. గ్రూప్-సి నుంచి వెస్టిండీస్, ఇంగ్లాండ్... గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు ముందంజ వేశాయి. గ్రూప్ స్టేజ్‌లో కొన్ని నామమాత్రపు మ్యాచ్‌లు టోర్నీకి హైప్ తీసుకురాలేకపోయాయి.

**నేటి నుంచి సూపర్8 మజా**

పొట్టి ప్రపంచకప్ సూపర్8కు చేరుకోవడంతో ఇక మ్యాచ్‌లన్నీ ఉత్కంఠ రేపనున్నాయి. ఈ మెగాటోర్నీలో అసలుసిసలైన టీ20 మజా నేటి నుంచి మొదలుకానుంది. సూపర్8కు చేరిన ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. సూపర్8 గ్రూప్-1లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్... సూపర్8 గ్రూప్-2లో శ్రీలంకతో సహా పాకిస్థాన్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్-1 మ్యాచ్‌లు భారత్‌లో, గ్రూప్-2 మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి. గ్రూప్‌లో ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్ చేరుతాయి.



**సౌతాఫ్రికాతో తొలి సమరం**

ఇవాళ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్, న్యూజిలాండ్ మ్యాచ్‌తో సూపర్8 స్టేజ్ అసలుసిసలు పోరు మొదలుకానుంది. అతిథ్య భారత్..సూపర్8 తొలి మ్యాచ్‌లో ఆహ్మదాబాద్ వేదికగా ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో టీమిండియా తలపడనుంది.

**సెమీస్ వరకు పాక్‌తో ఫైట్ లేనట్లే**

చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు మరోసారి తలపడితే చూడాలని ఇరుజట్ల అభిమానులు కోరుకుంటున్నారు. అయితే సూపర్8లో ఆ ఛాన్స్ లేదు. రెండు జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉండడమే దీనికి కారణం. సెమీస్‌కు భారత్, పాకిస్థాన్ చేరుకుని తమ గ్రూపుల్లో ఒకటి టాప్ ప్లేస్, మరోటి సెకండ్ ప్లేస్‌లో ఉంటేనే సాధ్యమవుతుంది.

**భారత్‌కు అసలైన సవాళ్లు**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా గ్రూప్ స్టేజ్‌లో ఇరగదీసింది. అమెరికాతో కాస్త చెమటోడ్చడం మినహాయిస్తే మిగతా మ్యాచ్‌లన్నీ ఈజీ విక్టరీలతో ముగించింది. ప్రస్తుత టీమిండియా ఫామ్ చూస్తే సెమీస్‌లోకి చేరడం ఈజీగానే కనబడుతోంది. అయితే సూపర్8 గ్రూప్-1లో సౌతాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్‌ల నుంచి అసలు సిసలు పరీక్ష ఎదురు చూసింది. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కొనసాగించాల్సి ఉంటుంది. అయితే ఓ మ్యాచ్‌లో తడబడ్డా మరో రెండు మ్యాచ్‌ల్లో విజృంభిస్తే సెమీస్ ఛాన్స్ ఉంటుంది.

సెమీఫైనల్ చేరే జట్లపై మాజీ క్రికెటర్లు భిన్నమైన అంచనాలు వేస్తున్నారు. యుజ్వేంద్ర చాహల్, మహమ్మద్ కైఫ్ వంటి వారు భారత్, సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు టాప్ 4లో ఉంటాయని జోస్యం చెప్పారు.



# ఆసీస్ గెలుపు

**పల్లీకల్:** టీ20 ప్రపంచకప్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు ఊరట విజయం లభించింది. ఒమన్‌పై 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఒమన్ 16.2 ఓవర్లలోనే 104 రన్స్‌కు ఆలౌటైంది. వాసీమ్ అలీ 32 పరుగులతో ఒమన్ జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆడమ్ జంపా 4వికెట్లు.. గ్జేవియం, మాక్స్‌వెల్ రెండేసి వికెట్లతో కుల్చ కూల్చారు. 109 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఒక వికెట్ కోల్పోయి మరో 62 బంతులుండగానే గెలుపొందింది. తొలి వికెట్‌కు కెప్టెన్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ ధాటిగా ఆడుతూ 93 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఈ క్రమంలో మిచెల్ మార్ష్(33 బంతుల్లో 64 రన్స్) అర్ధ సెంచరీ సాధించాడు. ట్రావిస్ హెడ్ 19 బంతుల్లో 32 రన్స్ చేసి అవుటయ్యాడు. జోస్ ఇంగ్లిష్ అండగా మరో వికెట్ కోల్పోకుండా మిచెల్ మార్ష్ ఆసీస్‌కు విజయాన్ని అందించాడు. ఇప్పటికే టోర్నీకి దూరమైన ఆస్ట్రేలియా... 4మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో మూడో స్థానం పొందింది.



## దుబాయ్ ఓపెన్ టెన్నిస్
# రుతుజా జోడీ ఓటమి

**దుబాయ్:** భారత మహిళల టెన్నిస్ డబుల్స్ నెంబర్‌వన్ రుతుజా భోస్తే.. దుబాయ్ ఓపెన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. థాయ్ లాండ్ ప్లేయర్ పీంగ్‌టార్న్ జోడీగా బరిలోకి దిగిన రుతుజా... ప్రి క్వార్టర్ ఫైనల్లో కజకిస్తాన్-సెర్బియా జోడీ డానిలినా, క్రునిక్ చేతిలో పోరాడి ఓడారు. తొలి సెట్‌ను 3-6తో చేజార్చుకున్న రుతుజా జోడీ... రెండో సెట్‌లో నువ్వానేనా అన్నట్లుగా పోరాడింది. ట్రైబేకర్ వరకు జరిగిన రెండో సెట్‌లో ఒత్తిడికి లోనై 6-7తో ఓడింది. అంతకుముందు తొలి రౌండ్‌లో రుతుజా జోడీ 7-5, 6-2తో జపాన్-చైనీస్ తైపీ జోడీపై గెలుపొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన రుతుజా జోడీకి 15లక్షల ప్రైజ్‌మనీతో పాటు 120 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# న్యూజిలాండ్, పాకిస్థాన్ సూపర్ ఫైట్





**కొలంబో:** టీ20 ప్రపంచకప్ సూపర్8 సమరంలో నేడు న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ తలపడనుంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఈ మ్యాచ్‌కు వేదికకానుంది. రెండు జట్లు కూడా తమ తమ గ్రూప్‌ల్లో రెండో స్థానంతో సూపర్8కు వచ్చాయి. గ్రూప్ దశలో తక్కువ ర్యాంక్ జట్లపై సులభంగా గెలిచినా, ఎదురైన ఏకైక బలమైన జట్ల చేతుల్లో ఘోరంగా విఫలమయ్యాయి.

పాకిస్థాన్ జట్టు తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగా ఆడడం ఆజట్టుకు అనుకూలించే అంశం. న్యూజిలాండ్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లన్నీ భారత్‌లో ఆడింది. వేదిక మార్పు ప్రధాన సవాలుగా నిలువనుంది. స్పిన్నర్లకు అనుకూలించే ప్రేమదాస స్టేడియంలో కివీస్‌లు చెమటోడ్చాల్సి ఉంటుంది. పాకిస్తాన్ తమ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లను సమర్థంగా ఉపయోగించుకుంది. సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్‌లో పెద్ద మార్పులు చేయలేదు, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్, రచిన్ రవీంద్ర, ఫిలిప్స్ బ్యాటింగ్‌లో రాణిస్తే న్యూజిలాండ్‌కు తిరుగుండదు.

ఇక పాకిస్తాన్ టాప్ ఆర్డర్‌లో భారీ స్కోర్లు చేసే సామర్థం ఉంది, బాబర్ ఆజమ్, సయీమ్ అయూబ్ ఫామ్‌లో లేకపోవడం సమస్యగా మారింది. మరోవైపు సాహిబ్‌జాదా ఫర్హాన్ పవర్‌ప్లేలో పరుగుల బాధ్యతను తీసుకున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ వైఫల్యం పాక్‌ను వెంటాడుతోంది. అబ్రార్ అహ్మద్ సూపర్8లో తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. సూపర్8 కీలక దశల్లో పాకిస్తాన్‌కు అత్యుత్తమ ప్రదర్శన అవసరం.

**జట్లు(అంచనా): పాకిస్తాన్:**ఫర్హాన్, సయీమ్, సల్మాన్‌ఆఘా (కెప్టెన్), బాబర్ ఆజమ్, నఫాయ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ (వికెట్ కీపర్), నవాజ్/అష్రఫ్, సల్మాన్, ఉస్మాన్ తారిక్, అబ్రార్ అహ్మద్; **న్యూజిలాండ్:** సైఫర్ట్ (వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్మన్, డారిల్ మిచెల్, సాంట్నర్ (కెప్టెన్),నీషమ్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోధీ, జేకబ్ డఫీ.

# శివమ్ దూబే అసలైన క్లాస్

**ముంబై:** టీమిండియా ఆల్‌రౌండర్ శివమ్ దూబే జట్టు విజయాల్లో కీరోల్ పోషిస్తున్నాడు. ముఖ్యంగా జట్టు బ్యాటింగ్‌లో విఫలమైనపుడు జోరుచూపుతూ ఆదుకుంటున్నాడు. స్లాగ్ ఓవర్లలో పరుగుల వరద పారిస్తున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో మెరుపు బ్యాటింగ్‌తో అలరిస్తూ విలువైన బాట్స్‌మెన్‌గా ఎదిగాడు. ఎంతగా అంటే శివమ్ దూబే క్రీజ్‌లోకి వచ్చాడంటో మెరుపులు మెరిపిస్తాడు అన్నంతగా.

అహ్మదాబాద్ వేదికగా నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో శివమ్ దూబే 31 బంతుల్లోనే 4 ఫోర్లు, 6సిక్స్‌లతో 66 పరుగులతో చెలరేగాడు. సహచరులు రన్స్ చేయడానికి ఇబ్బంది పడిన వికెట్‌పై దూబే మాత్రం అలవోకగా పరుగులు సాధించాడు. బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ షో చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. పాక్‌తో మ్యాచ్‌లోనూ ఈ లెఫ్టాండ్ బ్యాట్స్‌మెన్ స్కోరు వేగం పెంచాడు. స్పిన్నర్లకు అనుకూలించిన ప్రేమదాస వికెట్‌పై చెలరేగాడు. 17 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో 27 రన్స్ సాధించాడు. జట్టు స్కోరును 175కు చేర్చాడు. ఇదే పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అలాగే నమీబియాపై కూడా 16 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్స్‌తో 23 విలువైన పరుగులు రాబట్టాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందు సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లోని వైజాగ్ మ్యాచ్‌లో సిక్సర్ల జడివాన కురిపిస్తూ 23బంతుల్లోనే వాయువేగంతో 65రన్స్ చేశాడు.



సవాలుతో కూడిన పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయడానికి ఇష్టపడతానంటున్న శివమ్ దూబే... ఒత్తిడిని పటాపంచలు చేస్తున్నాడు. సిక్సర్లు కొట్టడం ఇష్ట మైనప్పటికీ, పరిస్థితులను పట్టించుకోకుండా గుడ్డిగా ఆడలేనని శివమ్ దూబే స్పష్టం చేస్తున్నాడు. బౌలర్ మంచి బంతులు వేస్తున్నప్పుడు అంతే కసిగా ఆడడం తనకిష్టమని చెబుతున్నాడు.



# ఫ్యాషన్ దిగ్గజం ఎస్‌వోఎస్ యజమాని అనుమానాస్పద మృతి

**బ్యాంకాక్, ఫిబ్రవరి 20:** ఫ్యాషన్ దిగ్గజం ఏఎస్‌ఓఎస్ సహ వ్యవస్థాపకుడు క్వెంటిన్ గ్రిఫిత్స్ థాయ్‌లాండ్‌లో ఓ అపార్టుమెంట్‌లోని 17వ అంతస్తు బాల్కనీ నుంచి కిందపడి మృతి చెందారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. పట్టాయాలోని అపార్ట్ మెంట్ నుంచి అనుమానాస్పద స్థితిలో కిందపడి మృతి చెందారు. పోలీసులు, మెడికల్ సిబ్బంది, ఎమర్జెన్సీ సర్వీస్ అధికారులు వచ్చి చూసేసరికి ఆయన నేలపై విగతజీవుడిలా కనిపించారు. ఆయన మరణానికి ముందు అపార్ట్ మెంట్‌లో ఎలాంటి ఘర్షణ లేదా గందరగోళ వాతావరణం కనిపించలేదని అధికారులు వెల్లడించారు. అయితే కుట్ర కోణాన్ని వారు తోసిపుచ్చలేదు. పోస్టుమార్టం నివేదిక అనంతరం ఆయన మృతికి కచ్చితమైన కారణం తెలుస్తుందని వెల్లడించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీసు అధికారులు వెల్లడించారు. క్వెంటిన్ గ్రిఫిత్స్ అదే అపార్ట్ మెంట్‌లో ఉంటున్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఏఎస్‌ఓఎస్ సంస్థ వ్యవస్థాపకుల్లో క్వెంటిన్ గ్రిఫిత్స్ ఒకరు. తర్వాత అది బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదిగింది. ఈ సంస్థ ఫ్యాషన్ ఉత్పత్తులను వినియోగించే వారిలో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిచెల్ ఒబామా కూడా ఉన్నారు. క్వెంటిన్ తన మొదటి భార్య నుంచి విడాకులు తీసుకున్న తర్వాత 2007లో థాయ్‌లాండ్‌కు మకాం మార్చారు.

ఆ తర్వాత థాయ్ మహిళను వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికి ఆమెతో విడిపోయారు. క్వెంటిన్ గ్రిఫిత్స్‌కు ముగ్గురు సంతానం ఉన్నారు.

# ఎఐ టూల్స్‌పై పట్టులేని ఉద్యోగులకు ప్రమోషన్లు కట్

## ఎంప్లాయీస్‌కి యాక్సెంచర్‌సంస్థ డేంజర్ సిగ్నల్స్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం యాక్సెంచర్, ప్రమోషన్ల అర్హతలో కృత్రిమ మేధ (ఏఐ)ను క్రమం తప్పకుండా ఉపయోగించడం ఒక కీలకమైన అంశంగా మార్చింది. సీనియర్ ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని యాక్సెంచర్ సూచించింది. వాటి వినియోగం ఆధారంగా కూడా లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేదంటే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది. కంపెనీలు డిజిటల్ మార్పును వేగవంతంగా అందిపుచ్చుకుంటున్నాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగం ఏఐని అందిపుచ్చుకుని మెరుగైన పనితీరును కనబరచాలని టెక్నాలజీ సంస్థలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో యాక్సెంచర్ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి ఈ కీలక సూచన చేసింది. సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ ద్వారా ఈ సందేశం పంపించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. లీడర్‌షిప్ పాత్రలో ఎదగడానికి ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని స్పష్టం చేసింది. క్లయింట్లకు అత్యుత్తమ, వేగవంతమైన సేవలు అందించడానికి ఇది అవసరమని యాక్సెంచర్ భావిస్తోంది. యాక్సెంచర్ కొంతకాలంగా ఏఐపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. మరోవైపు, కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని ఉద్యోగులు స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని గూగుల్ ఇటీవల తెలిపింది. ఇందుకోసం విరమణ ప్యాకేజీని కూడా ప్రకటించింది. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ తదితర టెక్ దిగ్గజాలు కూడా గూగుల్ బాటలోనే పయనించాయి.

## వాణిజ్యం



# ఏప్రిల్‌నుంచి అమలులోకి ఇండోఅమెరికా ట్రేడ్‌డీల్!

## కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** భారత్ అమెరికాలమధ్య జరిగిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం సంతకాలు మార్చిలో జరుగుతాయని, వచ్చే ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని వాణిజ్యమంత్రి పియూష్‌గోయల్ పేర్కొన్నారు. అంతేకాకుండా భారత్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పం దాలు ఇతర దేశాలతో కూడా చేసుకుందని, బ్రిటన్, ఒమన్ దేశాలతో జరిగిన ఒప్పందాలు కూడా ఏప్రిల్‌నుంచే అమలులోకి వస్తాయన్నారు. న్యూజిలాండ్‌తో జరిగిన ఒప్పందం మాత్రం ఈ ఏడాదిసెప్టెంబరునుంచి అమలవుతుందని కేంద్ర మంత్రి స్పష్టంచేసారు. ఈనెల 23నుంచి ఈ ఒప్పందంపరిధిలోని న్యాయపరంగా వచ్చే సమస్యలు,సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ఉభయతారకంగా చర్చించేందుకు అమెరికా ప్రతినిధిబృందంతో చర్చలు జరుగుతాయన్నారు. అంతకుముందు ఈనెలలోనే భారత్ అమెరికాలు రెండు కూడా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం నిర్మాణ క్రమంరూపకల్పన జరుగుతున్నదని, ఒప్పందం ఖరారయిందని ప్రకటించాయి. ఇందుకోసం అమెరికా మంత్రి మార్కో రుబియో కూడా భారత పర్యటనకు రానున్నట్లు తెలిపారు.

# ఎనిమిది కీలకరంగాల వృద్ధి 4% మాత్రమే

**ముంబయి, ఫిబ్రవరి 20:** భారత్‌లోని ఎనిమిది కీలకరంగాల సమిష్టి వృద్ధి జనవరిలో నాలుగుశాతానికి నమోదయింది. అంతకు ముందునెలలో 4.7శాతంనుంచి స్వల్పంగా తగ్గిందని వాణిజ్యమంత్రిత్వ శాఖప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి వృద్ధిలో మందగమనమే ఇందుకుకారణమని, డిసెంబరులో 6.3శాతం ఉంటే జనవరిలో 3.8శాతానికి పడిపోయిందని వాణిజ్యశాఖ తెలిపింది. సిమెంట్ ఉత్పత్తి 10.7శాతం పెరిగింది. దీనివల్ల నిర్మాణరంగ కార్యకలాపాలుపెరిగాయి. అంతకుముందునెలలో 13.5శాతంవరకూ ఉన్నప్పటికీ జనవరిలో తగ్గినా నిర్మాణరంగం ఊపందుకుంది. ఇక ఉక్కు ఉత్పత్తి 6.9శాతంనుంచి 9.9శాతానికి పెరిగింది. బొగ్గురంగం కూడా 3.6 గతనెలలోపెరిగితే జనవరిలో 3.1శాతం వరకూ ఉత్పత్తిని సాధించింది. ఇక ఎరువుల ఉత్పత్తివిభాగంలో కూడా 4.1శాతంనుంచి జనవరిలో 3.7శాతానికి పడిపోయింది. పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు నిలకడగా కొనసాగాయి. అంతకుముందునెలలో ఒకటిశాతం క్షీణించిన తర్వాత జనవరిలో మాత్రం బ్రేక్‌ఈవెన్ దిశగా కొనసాగడం కొంత ఊరటనిచ్చింది. అలాగే హెచ్‌ఎస్‌బిసి సేవలరంగ పిఎంఐ సూచీ 58.5పాయింట్లకుపెరిగింది. డిసెంబరు 58 పాయింట్లు మాత్రమే ఉన్న సేవలరంగ సూచీ జనవరిలో 58.5 పాయింట్లుగా నమోదయింది. కొత్త బిజినెస్‌లు, సుస్థిర దేశీయ అంతర్జాతీయడిమాండ్ పెరగడమే దీనికి కారణం. ఇక ఉద్యోగ నియామకాలు కూడా సేవలరంగ సంస్థలు పెంచాయి. బిజినెస్ విశ్వాసం కూడా మూడునెలల గరిష్టానికి పెరిగింది. ఫైనాన్స్, బీమారంగాలు వృద్ధికారకాలుగా నిలిచాయి. వీటికితోడు డిజిటల్ సేవలరంగం కూడా వృద్ధిలోకి వచ్చింది. అమెరికాలోఐఎస్ఎం సర్వీసెస్ పీఎంఐ జనవరి నెలకుగాను 53.8శాతంగా ఉంది.



# విదేశీ కరెన్సీ ఖజానా కళకళ

## 725 బిలియన్ డాలర్లకు పెరిగిన నిల్వలు

**ముంబయి, ఫిబ్రవరి 20:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానాకు భారీగా విదేశీ నిధులు వచ్చిపడ్డాయి. దీనితో 14.595 బిలియన్ డాలర్లు పెరిగాయి. మొత్తంగాచూస్తే విదేశీ కరెన్సీ ఖజాని 725 బిలియన్ డాలర్లుగా ఉందని ఆర్బీఐ ప్రకటించింది. జనవరి 30వ తేదీతో ముగిసినవారానికి సంబంధించి గణాంకాలను ఆర్బీఐ విడుదలచేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ బంగారం 5600 డాలర్లు చేరుతున్న దశలో బంగారం కొనుగోళ్లు కూడా ఆర్బీఐ భారీగానే జరిపింది. భారత్‌వద్దప్రస్తుతం 810 టన్నులకుపైగా బంగారం రిజర్వులున్నాయి. ఎక్కువశాతం భారతీయకుటుంబాలవద్దనే పసిడినిల్వలున్నట్లు ప్రపంచ పసిడిమండలిసైతం పేర్కొంది. భారత్ విదేశీ కరెన్సీ ఖజానాపరంగా ఐదో అతిపెద్దఫోరెక్స్ నిల్వలున్న దేశంగా నిలిచింది. ఫోరెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ గరిష్టానికి అంటే 14.361 బిలియన్ డాలర్లు పెరిగి 723.774 బిలియన్ డాలర్లకు చేరాయి.

# వారాంతంలో భారీ లాభాలతో సెన్సెక్స్,నిఫ్టీ



**ముంబయి, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ సెక్టార్లన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభ పడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది. మార్కెట్ ధోరణి మాత్రం ప్రతికూలంగా ఉంది. బిఎస్ఇలో 1917 షేర్లు లాభపడితే 2265 షేర్లు నష్టాల్లో ముగిశాయి. రోజు ప్రారంభంలో ఒడిదొడుకులకు లోనైన ప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లు పుంజుకుయి. అమెరికా ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్‌బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.21శాతం, ఎన్టీపీసి 2.64శాతం, ఎల్‌అండ్‌టి 2.33శాతం వంటివి నిఫ్టీలో మంచి బూస్ట్ ఇచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.44శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.19శాతం క్షీణించాయి. పాక్స్ సిలికా కూటమిలో భారత్ చేరినట్లు ప్రకటన వెలువడగానే టెక్నాలజీ షేర్లు ఊపందు కున్నాయి. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 90.95గా నిలిచాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.06శాతంపెరిగి రూ.1,56,441గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లు 41సెంట్లుపెరిగి 71.25డాలర్లుగా కొనసాగింది. ఇక కంపెనీలపరంగా నోవార్టిస్ 20శాతం, ఎబిబి ఇండియా 4.72శాతం, డీ డెవలప్‌మెంట్ ఇంజినీర్స్ 13శాతం, సిఐఇ ఆటోమోటివ్ ఇండియా 1.68శాం, జైడస్ లైఫ్ సైన్సెస్ 0.08శాతం, పేస్ డిజిటెక్ 2.82శాతం, ఐఎఫ్‌జిఎల్ రిఫ్రాక్టరీస్ 0.20శాం పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.